మార్చి, 2010

# స్థానిక పాలన

గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 2 సంచిక: 2 పేజీలు: 64 వెల: రూ. 20/-



'సాక్షర్ భారత్' పుస్తకావిష్కరణలో...





జిల్లా పరిషత్ చైర్మన్ల సదస్సు

స్థానిక పాలన
గ్రామీణ వికాస మాసపత్రిక

సంపుటి: 2 సంచిక: 2

మార్చి, 2010

ఎడిటర్

**ఫణి కుమార్**

ఎడిటోరియల్ బోర్డు

**కె. అంబరీష్,** ఐ.ఏ.ఎస్. (రిటైర్డ్)
**సెబాస్టియన్ రాజు** ఎ.పి.ఎ.ఎస్. (రిటైర్డ్)
**బ్రిగేడియర్ డి.వి. రావు**
**మహమ్మద్ తకీయుద్దీన్**
**ఎమ్.ఎ. కుమార రాజా**
**హెచ్. కూర్మారావు**
**డాక్టర్ ఇ.వి. స్వర్ణలత**
**ఎన్. విజయ కుమార్**
**ఆర్. సూర్యనారాయణ రెడ్డి**
**డాక్టర్ వి.ఎస్.ఎస్. ప్రసాద్**
**డాక్టర్ సి. కృష్ణ మోహనరావు**
**డాక్టర్ పి. రఘునాధరెడ్డి**
**డాక్టర్ వి.ఎన్.వి.కె.శాస్త్రి**

*కాన్సెప్ట్, ప్లానింగ్,*
*ఎడిటింగ్, డిజైనింగ్*
మాస్టర్ మల్టీమీడియా, హైదరాబాద్

ప్రచురణ

ఎ.ఎం.ఆర్. అపార్డ్
రాజేంద్రనగర్
హైదరాబాద్-500 030
ఆంధ్రప్రదేశ్, ఇండియా
ఫోన్ : 040-24018656
ఫ్యాక్స్ : 040-24017005
E-mail ID : Phanikumar@ap.gov.in

# విషయ సూచిక

సంపాదకీయం ........ 2
మహిళా అక్షరాస్యత లక్ష్యంగా సాక్షర భారత్ ........ 3
'సాక్షరతా భారత్'కు రాష్ట్రం సిద్ధం ........ 5
తండ్రిని మించిన తనయుడు మన ఆదర్శ రాముడు ........ 6
డబ్బు చెట్టు (కథ) ........ 8
ఈ తరుణంలో చేయవలసిన పొలం పనులు ........ 11
మహిళలు, పిల్లలకు పోషకాహారం ఒక సవాలే ........ 14
సంక్షోభంలో మన పంచాయతీరాజ్ వ్యవస్థ ........ 20
పశ్చిమ గోదావరి జిల్లా ఉత్తమ పంచాయతీ సర్పంచ్‌ల కేరళ రాష్ట్ర పర్యటన ........ 22
కర్నాటకలోని అభివృద్ధి గ్రామాల అధ్యయన పర్యటన ........ 24
దేశ గౌరవాన్ని నిలబెట్టిన క్రీడాకారిణులకు వందనం ........ 25
మధుమాసోదయ మంగళవేళ ........ 29
ఆధునిక స్త్రీ చరిత్రను తిరగరాస్తోంది ........ 32
వికృతి నామ సంవత్సర రాశి ఫలితాలు ........ 36
సైన్ ఫ్లో (కథ) ........ 40
పంచాయతీ స్థానాల్లో పెద్ద సంఖ్యలో మహిళలు- దేశంలో విప్లవాత్మక పరిణామం ........ 44
మహిళా హక్కులు, చట్టాలు ........ 48
యేసుక్రీస్తును మేమూ ఆరాధిస్తున్నాం ........ 53
వార్తల్లో 'అపార్డ్' ........ 55
ఆదివాసీ మహిళల అక్షరాస్యత-కొన్ని సవాళ్ళు ........ 57
మహిళలకి రక్షణ కవచం గృహహింస నిరోధక చట్టం ........ 61
స్వయం సహాయక సంఘాల మహిళలకు సాగుభూమి యోచనలో ప్రభుత్వం ........ 64

మార్చి, 2010

# సంపాదకీయం..

## గ్రామీణాభివృద్ధికి, సంక్షేమానికి ప్రాధాన్యం

రాష్ట్ర ప్రభుత్వం 2010-2011 ఆర్థిక సంవత్సరానికి రాష్ట్ర శాసన సభలో, శాసనమండలిలో ప్రవేశపెట్టిన బడ్జెట్‌లో గ్రామీణ రంగానికి ప్రాధాన్యం లభించింది. సంక్షేమం, అభివృద్ధికి సమ ప్రాముఖ్యత ఇచ్చారు. ఈ బడ్జెట్‌లో ప్రజలపై కొత్తగా పన్నులు విధించటం కానీ, ఉన్న పన్నులను పెంచటం కానీ చేయలేదు. గత ఏడాది బడ్జెట్‌తో పోలిస్తే, మహిళా శిశు సంక్షేమం, ఎస్.సి, ఎస్.టి., బి.సి., మైనారిటీల సంక్షేమానికి, పంచాయితీ రాజ్, గ్రామీణాభివృద్ధి, మున్సిపాలిటీలు, పట్టణాభివృద్ధి, విద్యారంగానికి కేటాయింపులు బాగా పెరిగాయి. అదే విధంగా, విద్యార్థులకు ఫీజు రీయింబర్స్‌మెంట్, స్కాలర్‌షిప్‌లకు కేటాయింపులు పెంచారు. వైద్యం, గృహ నిర్మాణం, సాంఘిక భద్రత, వ్యవసాయ రంగాలకు కూడా కేటాయింపులు గణనీయంగా పెరిగాయి.

రాష్ట్ర ప్రభుత్వ చరిత్రలో ఎన్నడూ లేనంత భారీ స్థాయిలో రూ. 1,13,660 కోట్ల వ్యయంతో, రూ. 3,548 కోట్ల రెవెన్యూ మిగులుతో భారీ బడ్జెట్ ఆవిష్కృతమవటం ముదావహం. గత ఏడాది బడ్జెట్‌తో పోలిస్తే, ఈ బడ్జెట్ పరిమాణం రూ.10,000 కోట్లకు పైగా పెరిగింది. ప్రపంచ వ్యాప్తంగా ఆర్థిక మాంద్యం విస్తరించి, ఆ ప్రభావం దేశంపై, రాష్ట్రంపై కూడా పడి రాష్ట్ర ఆదాయం తగ్గినప్పటికీ, గత ఆరు నెలలుగా రాష్ట్రంలో వరదలు, వర్షాభావం, ఇతర ఆందోళనలు, ప్రతికూల వాతవారణం తీవ్ర ప్రభావం చూపుతున్నప్పటికీ, ఇంత భారీ స్థాయి బడ్జెట్‌ను రాష్ట్ర ప్రభుత్వం చేపట్టడం ప్రజలకు ఆశాజనకం కాగలదనటంలో సందేహం లేదు.

ఈ బడ్జెట్ ద్వారా ఆవిష్కృతమైన మరొక గొప్ప దృశ్యం ఏమిటంటే, ప్రపంచవ్యాప్తంగా తీవ్ర ఆర్థిక మాంద్యం నెలకొని, ఆయా దేశాలను, ప్రజలను ఉక్కిరి బిక్కిరి చేస్తున్నప్పటికీ, రాష్ట్రంలో ప్రజల తలసరి ఆదాయం పెరిగింది. ఈ పెరుగుదల జాతీయ తలసరి ఆదాయం కంటే అధికంగా ఉండటం విశేషం. ఆర్థిక మాంద్యంలోనూ రాష్ట్ర వ్యవసాయం, పరిశ్రమలు, సర్వీసులు రంగం పెరుగుదలను నమోదు చేశాయని బడ్జెట్‌తో పాటు ప్రభుత్వం ప్రవేశపెట్టిన సామాజిక, ఆర్థిక సర్వే స్పష్టం చేసింది.

ఈ బడ్జెట్‌లోని మరొక విశేషం - నియోజక వర్గ అభివృద్ధి నిధి కార్యక్రమాన్ని పునరుద్ధరించటం. శాసనసభ, శాసనమండలి సభ్యులందరికీ ఏడాదికి కోటి రూపాయల వంతున నియోజక వర్గ అభివృద్ధి నిధి నుంచి కేటాయిస్తారు.

కేంద్ర ప్రభుత్వం 2010-2011 బడ్జెట్‌లో గ్రామీణాభివృద్ధికి రూ. 66,100 కోట్లు, గ్రామీణ ఉపాధిహామీ పథకానికి రూ. 40,100 కోట్లు కేటాయించడం కూడా సంతోషదాయకం.

ఏదేమైనప్పటికీ, కేంద్ర, రాష్ట్ర బడ్జెట్లు ప్రజలకు గొప్ప ఊరట కలిగించిందనటంలో ఏ మాత్రం సందేహం లేదు.

# మహిళా అక్షరాస్యత లక్ష్యంగా సాక్షర భారత్

**మహిళా అక్షరాస్యత సామాజిక అభివృద్ధికి కీలకం, మహిళా సాధికారతకు మూలం. ఇది మానవ అభివృద్ధికి ప్రధాన సూచిక.**

ప్రపంచ వ్యాప్తంగా నిర్వహించిన అనేక పరిశోధనలలో మహిళా అక్షరాస్యత కుటుంబ ఆరోగ్యం, పిల్లల చదువు, శిశు మరణాలు, పౌష్టిక ఆహారం వంటి విషయాలలో తీవ్ర ప్రభావం చూపుతుందని రుజువయింది. మహిళా అక్షరాస్యత, మహిళా సమస్యగాకాక సామాజిక సమస్యగా గుర్తించాలి.

భారతదేశంలో స్వాతంత్ర్యం వచ్చినప్పటి నుండి మహిళా అక్షరాస్యత పెంపుదలకు కృషి జరుగుతోంది. అయితే సామాజిక, ఆర్థిక కారణాల వలన ఈ విషయంలో పూర్తి పురోగతి సాధించలేకపోయాం. ఈనాటికీ మహిళ అక్షరాస్యతలో వెనుకబడి ఉన్నాం. 2001 జనాభా లెక్కల ప్రకారం భారత దేశంలో 54.16 శాతం మహిళలు మాత్రమే అక్షరాస్యులుగా ఉన్నారు. అదే పురుషులలో అయితే, 75.85 శాతం అక్షరాస్యత ఉంది. అంటే స్త్రీ పురుషుల మధ్య అక్షరాస్యత అంతరం 21.69 శాతం. ఆంధ్రప్రదేశ్‌లో మహిళా అక్షరాస్యత మరింత తక్కువగా ఉంది. 2001 జనాభా లెక్కల ప్రకారం అది స్త్రీలలో 50.43 శాతం. పురుషులలో 70.32 శాతం. మన రాష్ట్రంలో అక్షరాస్యతా అంతరం 19.89 శాతం.



దేశంలో అక్షరాస్యతను పెంచేందుకు జాతీయ సాక్షరతామిషన్ 'సాక్షర భారత్' కార్యక్రమానికి రూపకల్పన చేసింది. సెప్టెంబరు 8, 2009 నాడు అంతర్జాతీయ అక్షరాస్యతా దినోత్సవాన్ని పురస్కరించుకొని మన ప్రధాన మంత్రి 'సాక్షర భారత్' కార్యక్రమాన్ని ప్రారంభించారు.

## సాక్షరతా భారత్ లక్ష్యాలు

**సాక్షరభారత్ ప్రధాన లక్ష్యాలు నాలుగు. అవి:**

1. **ప్రాథమిక అక్షరాస్యత** (Basic Literacy) : అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం లేని వయోజనులకు ప్రయోజన (Functional) అక్షరాస్యత, సంఖ్యా పరిజ్ఞానం అందించడం.
2. **ప్రాథమిక విద్య** (Basic Education): ప్రాథమిక అక్షరాస్యతను మించి తమ చదువుకొనసాగించేందుకు, నియత విద్యకు సమతుల్యమైన విద్యను పొందేందుకు వయోజన నూతన

### భారతదేశంలో స్త్రీ పురుషుల మధ్య అక్షరాస్యత అంతరం

| సంవత్సరం | అక్షరాశ్యతా శాతం | | అక్షరాశ్యతలో పురుషులు స్త్రీలు, స్త్రీ, పురుష నిష్పత్తి |
|---|---|---|---|
| | పురుషులు | స్త్రీలు | |
| 1961 | 40.39 | 15.33 | 25.06 |
| 1971 | 45.95 | 21.97 | 23.98 |
| 1981 | 53.46 | 28.47 | 24.99 |
| 1981 | 56.38 | 29.76 | 26.62 |
| 1991 | 64.13 | 39.29 | 24.84 |
| 2001 | 75.85 | 54.16 | 21.69 |

### ఆంధ్రప్రదేశ్‌లో స్త్రీ పురుషుల మధ్య అక్షరాస్యత అంతరం

| సంవత్సరం | అక్షరాశ్యతా శాతం | | అక్షరాశ్యతలో స్త్రీ పురుష అంతరం |
|---|---|---|---|
| | పురుషులు | స్త్రీలు | |
| 1961 | 12.03 | 30.19 | 18.11 |
| 1971 | 15.75 | 33.18 | 17.43 |
| 1981 | 24.16 | 46.83 | 22.67 |
| 1991 | 32.72 | 55.12 | 22.40 |
| 2001 | 50.43 | 70.32 | 19.89 |

అక్షరాస్యులకు అవకాశాలు కల్పించడం.

3. **నైపుణ్యాభివృద్ధి:** నూతన అక్షరాస్యులు, ఇతరులు వారి సంపాదన, జీవన పరిస్థితులను మెరుగుపరచుకోవడానికి తగు నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు అందించడం

4. **నిరంతర విద్య:** వయోజన నూతన అక్షరాస్యులకు, ఇతరులకు నిరంతర విద్యకు అవకాశాలు కల్పించడం. అక్షరాస్యత, అక్షరాస్యనంతర, నిరంతర విద్యా కార్యక్రమాలను ఒకదాని తర్వాత మరొకటి వరుస క్రమంలో నడపడం కాకుండా పరస్పర కొనసాగింపుగా కలగలిపి నడపడం 'సాక్షరభారత్' ప్రత్యేకత.

విస్తృత అర్థంలో చూసినప్పుడు 'సాక్షర భారత్' లక్ష్యం అభ్యాసన సమాజాన్ని, జ్ఞాన సమాజాన్ని ఆవిష్కరించడమే.

## నిర్దిష్ట లక్ష్యం

- ★ 15 సంవత్సరాల వయస్సు పైబడిన 7 కోట్ల వయోజన నిరక్షరాస్యులకు ప్రాథమిక అక్షరాస్యతను అందించడం.
- ★ 15 లక్షల వయోజనులకు ప్రాథమిక విద్యను సమతుల్య కార్యక్రమాల ద్వారా అందించడం.
- ★ 15 లక్షల వయోజనులకు వృత్తి నైపుణ్యాభివృద్ధి కార్యక్రమాలు చేపట్టడం.

## ప్రాధాన్యతా వర్గాలు

- ★ వయోజన నిరక్షరాస్యులందరూ ఈ కార్యక్రమంలో లబ్ధిదారులు. అయితే అసలు బడికి వెళ్ళే అవకాశం లభించని లేదా తాము నేర్చుకొన్న చదువు మరచిపోయిన నిరక్షరాస్య మహిళలకు ప్రత్యేక ప్రాధాన్యత ఉంటుంది.
- ★ సాక్షర భారత్ కార్యక్రమం ప్రధానంగా మహిళా కార్యక్రమం. ఈ కార్యక్రమంలో 85 శాతం మంది లబ్ధిదారులు మహిళలుంటారు. దేశంలో అక్షరాస్యతలో స్త్రీ, పురుష అంతరాన్ని తగ్గించేందుకు సాక్షర భారత్ కృషి చేస్తుంది. ప్రస్తుతం ఈ అంతరం 20 శాతానికి పైనే ఉంది.
- ★ అక్షరాస్యతా శాతం తక్కువ ఉన్న షెడ్యూల్డ్ కులాలు, షెడ్యూల్డ్ తెగలు, అల్ప సంఖ్యాక వర్గాలలోని వయోజన నిరక్షరాస్యులపై ప్రత్యేకంగా శ్రద్ధ కనబరుస్తారు. అల్ప సంఖ్యాక వర్గాలలోని ముస్లింలపై ప్రత్యేకంగా కేంద్రీకరించి పని చేస్తారు. అదే విధంగా అక్షరాస్యతలో వెనకబడిన ప్రాంతాలపైన కూడా దృష్టి కేంద్రీకరిస్తారు.
- ★ పంచాయితీరాజ్ సంస్థలలో ప్రజాప్రతినిధులుగా ఎన్నికైన నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా తీర్చిదిద్దడానికి ప్రాధాన్యతనిస్తారు. వీరు అక్షరాస్యులుగా మారితే అట్టడుగు స్థాయిలో పరిపాలనా వ్యవస్థ ఎన్నో రెట్లు మెరుగవుతుంది.
- ★ మొదలు గ్రామీణ ప్రాంతాలపై కేంద్రీకరిస్తారు. తదుపరి దశలో గ్రామీణేతర ప్రాంతాలకు విస్తరిస్తారు. భారతదేశంలో సాక్షరతా భారత్ క్రింద ప్రాథమిక అక్షరాస్యత అందించ తలపెట్టిన నిరక్షరాస్యుల సామాజిక, లైంగిక వర్గ వివరాల పట్టిక

(మిలియన్లలో)

| వర్గం | పురుషులు | స్త్రీలు | మొత్తం |
|---|---|---|---|
| షెడ్యూల్డ్ కులాలు | 4 | 10 | 14 |
| షెడ్యూల్డ్ తెగలు | 2 | 6 | 8 |
| ముస్లింలు | 2 | 10 | 12 |
| ఇతరులు | 2 | 34 | 36 |
| మొత్తం | 10 | 60 | 70 |

- ★ రాష్ట్రాల మధ్య, రాష్ట్రంలోని ప్రాంతాల మధ్య అక్షరాస్యతలోని అంతరాలను తగ్గించడం సాక్షర భారత్ ఇంకో లక్ష్యం. వివిధ రాష్ట్రాలలో అక్షరాస్యత శాతం 33 నుండి 88 వరకు ఉంది. ఈ అంతరం తగ్గించడం కోసం కార్యక్రమం మొదటి దశలో, 2001 జనాభా లెక్కల ప్రకారం సగటు మహిళా అక్షరాస్యత 50 శాతం అంతకన్నా తక్కువ ఉన్న జిల్లాలలో కార్యక్రమం అమలు చేస్తారు.
- ★ దీని ప్రకారం ఆంధ్రప్రదేశ్ రాష్ట్రంలో 18 జిల్లాలను మొదటి దశ కార్యక్రమం క్రింద ఎంపిక చేశారు. మన రాష్ట్రంలో హైదరాబాదు, ఆదిలాబాదు, కృష్ణా, తూర్పు గోదావరి, పశ్చిమ గోదావరి జిల్లాలలో ప్రస్తుతం కార్యక్రమం అమలు చేయడం లేదు. ఆదిలాబాదు జిల్లా సగటు మహిళా అక్షరాస్యత తక్కువే. అయితే నిరంతర విద్యా కార్యక్రమం అమలు చేసిన జిల్లాలనే మొదటి దశలో ఎంపిక చేసిన కారణాన ఈ జిల్లాను ఎంపిక చేయలేదు.

అక్షరాస్యతా సాధనలో సామూహిక ఉద్యమ (Mass Campaign) విధానంతోబాటు అవసరాన్ని బట్టి ప్రత్యామ్నాయ పద్ధతులకు కూడా "సాక్షర భారత్" స్థానం కల్పించింది. వాలంటీరు, ఆవాస బోధకుడు, ఆవాస శిబిరాలు పాక్షిక ఆవాస, పాక్షిక వాలంటీరు విధానాలను ప్రాథమిక అక్షరాస్యతా సాధనలో వినియోగించుకోవచ్చు.

రాష్ట్ర అక్షరాస్యతా మిషన్ అథారిటీ (ఎస్.ఎల్.ఎం.ఎ) రాష్ట్ర ముఖ్యమంత్రి / విద్యాశాఖామాత్యుల నేతృత్వంలో 'సాక్షర భారత్' కార్యక్రమం అమలుకు రాష్ట్ర స్థాయిలో పూర్తి బాధ్యత వహిస్తుంది. కార్యక్రమం విజయవంతం చేయడంలో పంచాయితీ రాజ్ సంస్థలకు ఆర్థిక, సాంకేతిక సహాయ సంపత్తిని అందచేస్తుంది.

అక్షర కేంద్రాలలో చదివిన అభ్యాసకుల ప్రాథమిక అక్షరాస్యతను పరీక్షించి వారు ఉత్తీర్ణులైనదీ లేనిదీ తేల్చేందుకు రాష్ట్రస్థాయిలో ప్రతి సంవత్సరం సెప్టెంబరు మొదటి వారంలోగా పరీక్షలు నిర్వహిస్తారు. ఉత్తీర్ణులైన అభ్యాసకులకు యోగ్యతా పత్రాలు అందజేస్తారు.

సార్వత్రిక జాతీయ సంస్థ, రాష్ట్ర సార్వత్రిక విద్యాపీఠం ప్రాథమిక విద్యను పరీక్షించే పరీక్షలు నిర్వహిస్తారు.

ఉన్నత ప్రమాణాలతో కూడిన బోధన, అభ్యాసన సామగ్రిని 'సాక్షర భారత్'లో సరఫరా చేస్తారు.

**– డా॥ సి. కృష్ణమోహన్ రావు**
సెంటర్ హెడ్, రీసెర్చ్ & ట్రెయినింగ్, అపార్డ్





# సాక్షరతా భారత్‌కు రాష్ట్రం సిద్ధం

**మహిళల్లో అక్షరాస్యతను పెంచేందుకు ఉద్దేశించిన 'సాక్షర భారత్' అమలుకు రాష్ట్రంలో అన్ని ఏర్పాట్లు జరిగాయి. దీనిపై జిల్లా పరిషత్ సీఈవోలు, పంచాయతీ ఆఫీసర్లు, వయోజన విద్యాశాఖ అధికారులతో ప్రత్యేక సదస్సు జరిగింది. వయోజన విద్యా శాఖ సంచాలకులు జనార్ధనరెడ్డి మార్గదర్శకాలను విడుదల చేశారు. మార్చి ఒకటి నుంచి రాష్ట్రంలోని 18 జిల్లాల్లో ఈ పథకం అమలు చేయాలని ప్రాథమికంగా నిర్ణయించారు.**

జాతీయస్థాయిలో ఈ పథకం అమలు కోసం కేంద్ర మానవ వనరుల అభివృద్ధి శాఖ ప్రత్యేక ప్రణాళికలను సిద్ధం చేసింది. దీనిని అనుసరించి 2012 నాటికి రాష్ట్రానికి రూ. 567 కోట్లు రానున్నాయి. ఇందులో తొలివిడతగా రూ.60 కోట్లు కూడా విడుదల అయ్యాయి. 75:25 నిష్పత్తి ప్రకారం నిధులను కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు భరిస్తాయి. ఈ పథకం అమలులో విద్యాశాఖకు చెందిన వయోజన విభాగం, పంచాయతీరాజ్ కీలకపాత్రను పోషించనున్నాయి.

ఈ కార్యక్రమం కింద మహిళల్లో సంతకం చేయడం, తెలుగులో చిన్న చిన్న పదాలను రాయడం వరకు నేర్పిస్తారు. ప్రధానంగా స్వయం సహాయక బృందాలను లక్ష్యంగా చేసుకుని కార్యకలాపాలు జరుగుతాయి.

## అమలు కానున్న జిల్లాలు

తూర్పు, పశ్చిమ గోదావరి, కృష్ణా, హైదరాబాద్ మినహా మిగిలిన 18 జిల్లాల్లో ఈ పథకాన్ని అమలు చేయనున్నారు. మహిళల్లో అక్షరాస్యత 50% కంటే ఎక్కువగా ఉన్నందున ఈ జిల్లాలను మినహాయించారు. ఆదిలాబాద్ జిల్లాలో కూడా మహిళా అక్షరాస్యత 50% కంటే తక్కువగా ఉన్నా, గత పథకం అమలులో ఆ జిల్లాకు స్థానం లభించనందున ఈ సారి కూడా పరిగణనలోనికి తీసుకోలేదు.

## అమలు విధానం

★ రాష్ట్రంలో సుమారు 7లక్షల మందిని అక్షరాస్యులుగా చేయాలని నిర్ణయించారు. వీరిలో 85% మంది మహిళలు, 15% పురుషులు ఉంటారు.

★ ఈ పథకం అమలుకు రాష్ట్ర స్థాయిలో, జిల్లా, మండల, పంచాయతీ స్థాయిల్లో ప్రత్యేక కమిటీలు ఏర్పడతాయి. రాష్ట్రంలో సీఎం, జిల్లాలో పరిషత్ ఛైర్మన్, మండల, గ్రామ పంచాయతీలో అధ్యక్షులు కమిటీలకు నేతృత్వం వహిస్తారు. జిల్లా కమిటీకి కలెక్టర్ ఉపాధ్యక్షులుగా వ్యవహరిస్తారు. రాష్ట్ర కమిటీని రాష్ట్రీయ సాక్షరతా కోశ్‌గా కేంద్రం వ్యవహరిస్తోంది.

★ ఈ పథకం అమల్లో భాగంగా ఐదువేల జనాభా కలిగిన పంచాయతీల్లో లోక్‌శిక్ష (వయోజన విద్య) కేంద్రాలు ఏర్పడతాయి. 5 వేలు మించిన జనాభా ఉంటే మరో కేంద్రాన్ని ఏర్పాటు చేస్తారు. ఇలా 18 వేల కేంద్రాలు ఏర్పడతాయని అంచనా వేస్తున్నారు. వీటికి అవసరమైన గదిని పాఠశాల, అంగన్‌వాడీ కేంద్రాల్లో సమకూర్చాలి. దీనికి గ్రామ పంచాయతీలు సహకరించాలి. కాలక్రమంలో శాశ్వత నిర్మాణాలను చేపడతారు.

★ ప్రతి కేంద్రానికి రూ. 2 వేల గౌరవ వేతనం మీద ఇద్దరు సమన్వయకర్తలను నియమిస్తారు. ఎస్.సి, ఎస్.టి., మైనార్టీ వర్గాలకు చెందిన 10వ తరగతి అర్హత కలిగిన వారినే నియమించాలని కేంద్రం నిర్దేశించింది. వీరు సామాజిక స్పృహ కలిగిన యువతీ యువకులతో, కలిసి నిరక్షరాస్యులైన మహిళలకు అక్షర జ్ఞానాన్ని కలిగిస్తారు. కాంట్రాక్టు పద్ధతిపై రూ.6 వేలను చెల్లించే విధంగా మండలానికి ఒకరి వంతున డిగ్రీ అర్హత కలిగిన వ్యక్తిని ఎంపిక చేస్తారు.



★ ఈ పథకం అమలుకు అవసరమైన నిధులను ఆన్‌లైన్‌లో ఎస్.బి.ఐ. ద్వారా నేరుగా పంచాయతీలకు చెల్లిస్తారు.

*- వై. సరోజ*

# తండ్రిని మించిన తనయుడు



# మన ఆదర్శ రాముడు

## శ్రీరామ కథామృతం

**'రామ' అన్న పదంలో దివ్యశక్తి ఉంది. రాముని చుట్టూ కన్పించే పాత్రలు, సన్నివేశాలు, నీతులు అన్నీ ఎన్నో సందేశాలకు ప్రతీకలు. రామాయణంలోని ఏ పాత్రను చూసినా ఏ సందర్భాన్ని విశ్లేషించినా దాని లోతు అంతు చిక్కదు. ప్రతిభకే అందని ఒక అద్భుతమేథ సృజనరూపం దాలిస్తే అది రామాయణం అవుతుంది. మంత్రశక్తి, ఆధ్యాత్మిక సాధన, భక్తి యోగజ్ఞానమార్గాలు, మానవలౌకిక జీవనం.. ఇలా చెప్పుకొంటూపోతే రామాయణం స్పృశించని అంశమే లేదు. రామాయణాన్ని కేవలం కథగా మాత్రమే భావించకుండా, లోపలి ఆంతర్యాన్ని అన్వేషించినప్పుడే రామకథాపీయూష మధురిమ రుచికి అందుతుంది.**

రాముడు లౌకికంగా మానవుడు ఎలా నడుచుకోవాలో తాను నడిచి చూపాడు. ఎల్లవేళలా ప్రజారక్షణ బాధ్యత రామునిది. ఇది పాలకుని ప్రథమ కర్తవ్యం. తాటకిని చంపినా, వాలిని చంపినా



బాధ్యత కోసమే. రాముని దృష్టిలో అంతా సమానమే. చివరికి పశు పక్ష్యాదులను, అభాగ్యులను సైతం ఆదరించిన వాడు.

*'రామో విగ్రహవాన్ ధర్మః'*

రాముడే మూర్తీభవించిన ధర్మం. ధర్మమంటే పితృవాక్యపాలన, భ్రాతృప్రేమ, పెద్దలను గౌరవించడం. కృతజ్ఞతను కలిగి ఉండడం (విజయోత్సాహంలో ఉండి కూడా భరద్వాజుని వరాన్ని తీర్చడమే దీనికి నిదర్శనం), ప్రజల కోసం తన స్థాయి కంటే దిగువస్థాయికి దిగి ప్రవర్తించటం (జటాయువు, కబంధుడు దీనికి ఉదాహరణ), త్యాగశీలిగా ఉండడం, లంకను జయించి విభీషణుడికే ఇవ్వడం దీనికి ఉదాహరణ. త్యాగం గురించి చెప్పాలంటే రామాయణంలో మరిన్ని పాత్రలున్నాయి. రాముడు రాజ్యంలో సీత, లక్ష్మణుడు, ఊర్మిళ, భరతుడు... ఇలా అందరూ త్యాగమూర్తులే. రాముడు తాను మానవులతోనే కాదు... నిరక్షరాస్యులతోనూ, పశుపక్ష్యాదులతోనూ చెలిమి చేసి వారిలోని శక్తిని బయటకు తీసి ఉపయోగించుకోగల నాయకత్వ లక్షణాలు కూడా కలవాడు. (పక్షులు, వానరులు, గుహుడు మొ॥) ఇలా తరచి చూస్తే కానీ బోధపడని దివ్య రహస్యాలు రామాయణంలో అనేకం ఉన్నాయి.

రామాయణం భారత భాగవతాలంత సులభంగా అర్థం కాదు. భాగవతం అర్థం కావాలంటే కేవలం భక్తి ఉంటే చాలు. భారతానికి హేతువుండాలి.

*'భక్త్యా భాగవతమ్, భక్త్యాయుక్త్యాచ భారతమ్'* అన్నారు. కానీ రామాయణానికి భక్తి, యుక్తి, వ్యుత్పత్తి కూడా ఉండాలి. అంటే రామాయణంలోని పాత్రల పేర్లలోనే దివ్య సందేశాలున్నాయి. కవి హృదయ దర్శనానికి సూచికలున్నాయి. ఉదాహరణకి కొన్ని పాత్రల పేర్ల వ్యుత్పత్తుల్ని, వాటిలోని బీజాక్షర శక్తుల్ని చూద్దాం.

'రామ' రకారం = అగ్ని. ఆత్మకు అదే ప్రధానం. అకారం ఆత్మనిత్యత్వం. మకారం జన్మ పరంపర.

'సీత' సకారం= ఆత్మశక్తి. ఈకారం వ్యక్త స్వభావం. తకారం=అమృతత్వం. ఇది ఆత్మశక్తికి కల నిత్యత్వాన్ని ప్రకటిస్తుంది.

సీతారాములిద్దరూ అభిన్నులైనా విధంగా ఆత్మ్దానిశక్తి కూడా అభిన్నమైనదని అర్థం.

'వాల్మీకి' అంటే పుట్ట. పుట్టశరీరం అంటే ప్రాణం చలిస్తూ ఉండేదని. వేదాంతపరం 'వాల్మీకి' అంటే విజ్ఞానమయ కోశం. పరమజ్ఞానమైన పరబ్రహ్మతత్వాన్ని, జీవాత్మనీ వేరు చేసేదే విజ్ఞానమయ కోశం.

'దశరధుడు' అంటే కళ్ళు, చెవులు, నాలుక, ముక్కు, కాళ్ళు, చేతులు అనే పది రథాలు కలవాడు. దశరధుడంటే ఈ పది ఇంద్రియాలలో ఉన్నవాడని అర్థం. **శక్తి 3 విధాలు. 1. జ్ఞానశక్తి (బుద్ధి) 2. క్రియాశక్తి (మనస్సు) 3. ఇచ్ఛాశక్తి (అహం).** ఈ మూడు శక్తులే దశరధుని భార్యలు. పరబ్రహ్మ చైతన్యానికి ఉండే నాలుగు రూపాలే నలుగురు పుత్రులు. రాముడు జ్ఞానానికి, లక్ష్మణుడు ఆలోచనాశక్తికి ప్రతీకలు. జ్ఞానానికి సక్రమమైన ఆలోచన తోడుగా ఉండాలి. రామలక్ష్మణ భరత శత్రుఘ్నుల పేర్లలో 'ర'కారం ఉంది. ఇది పాపతారకం. 'లక్ష్మణ'లోనూ రకారమే. (రలయోరభేదః)



అనలు రామాయణం అంటే *'రామస్య అయం చరితమ్'* రామాయణం. వాల్మీకి రామాయణంలో ఎక్కడా రామాయణమని చెప్పలేదు. మొదటి రెండు కాండలను 'రఘువరచరితమ్' అనీ, తరువాత రెండు కాండలను 'సీతాచరితమ్' అనీ, తదుపరి 2 కాండలను 'దశశిరోవధ' అని చెప్పాడు. 'రామ' అన్న శబ్దానికే రాముడు సీత, రావణుడు అనే అర్థాలున్నాయి. కాబట్టి అందరి కథా రామాయణమే. స్థూలంగా రామాయణంలో మొదటి రెండు కాండలలో బంధు, దాయాదుల మైత్రిని, తరువాత రెండు కాండలలో మిత్ర సంస్కృతిని, చివరి రెండు కాండలలో శత్రు సంస్కృతిని వాల్మీకి బోధించాడు.



రామాయణంలో ఉత్తర కాండను కలుపుకొంటే మొత్తం 7 కాండలు. ఈ ఏడింటిలో ముఖ్యమైనదీ, దివ్యమైనదీ అయోధ్యకాండ. దీనికి 'త్యాగకాండ' అని పేరు. ఒక్క కైకకు కల లోభగుణం వల్ల ఎందరో త్యాగగుణంతో ప్రకాశించారు. దశరథాదులు పుత్ర త్యాగం, రాముడు రాజ్యత్యాగం, సీత, లక్ష్మణుడు, ఊర్మిళ, భరతుడు మొదలగు వారు సౌఖ్యత్యాగం చేశారు.



అసలు రాక్షస సంహారం లేని కాండ ఒక్క అయోధ్యకాండే. ఇది మినహా అన్ని కాండలలోనూ రాక్షససంహారం ఉంది.

రకారం అనే వర్ణం (రేఫ) రామసోదరులతో ఉండడమే కాదు. దాదాపు రామాయణంలోని అన్ని శ్లోకాలలోనూ 'రేఫ' లేని శ్లోకం లేదని పెద్దలు చెబుతారు. ఒకవేళ ఉంటే అది ప్రక్షిప్తం కావచ్చు. రేఫం పాపాన్ని హరించే శక్తి కలది. అందుకే అనాదిగా రామాయణ పారాయణం ద్వారా భక్తులు పునీతులౌతున్నారు. ఇక రాముడి గురించి ఒక్కమాటలో చెప్పాలంటే - రాముడు తండ్రిని మించిన తనయుడు. 66వేల సంవత్సరాలు రాజ్యపాలన చేసిన దశరథుడు ఏక పత్నీ వ్రతాన్ని రాజ్యంలో అమలు చేయలేదు. కేవలం 11వేల సంవత్సరాలు మాత్రమే పాలించిన రాముడు నిర్బంధంగా అమలుపరిచాడు. ప్రజాసౌఖ్యమే రాముని మార్గం. అందుకే రాముడు ఆదర్శరాముడై అలరారుతున్నాడు.

*'భర్జనం భవబీజానాం ఆర్జనం సుఖసంపదాం*
*తర్జనం యమదూతానాం రామరామేతి గర్జనం'*

*- డాక్టర్ అద్దంకి శ్రీనివాస్*

"సూరీ.." దూరం నుండీ పెద్దగా పిలుస్తూ పరుగున వస్తున్నాడు పద్దయ్య.

అరటిచెట్ల పాదుల్ని పారతో సరిచేస్తున్న సూరి తలెత్తి చూసి...

"ఏంట్రా ఆ అరుపులు, పరుగులూ? ఏమైంది?" అనడిగాడు నిర్లక్ష్యంగా చూస్తూ.

"నీకు ఏదో కవరొచ్చింది. పోస్టుమాను మీ ఇంటికాడ కూర్చున్నాడు. నువ్వొచ్చి సంతకం పెడితే ఇస్తాడంట.."

"రిజిస్ట్రీనా?"

"అదేనేమొ..."

"సరే పద..." అంటూ పనాపి, పార ఓ పక్కన పారేసి పద్దయ్యతో బాటు ఇంటికి నడిచాడు.

# డబ్బు చెట్టు



అక్కడ పోస్టమ్యాను పంతులు ఇంటి ముందు గట్టుమీద కూచుని సూరి పెళ్లాం ఇచ్చిన మజ్జిగ తాగుతున్నాడు. సూరిని చూడగానే నవ్వుతూ "రా సూరీ... ఇవాళ నీ పంట పండిందిలే..." అన్నాడు.

"ఏం తెచ్చా?"

"నీ కొడుకు ఆస్ట్రేలియా నించీ కవరు పంపించాడు..."

"ఇందులో పంట పండటానికేముంది? ఉత్తరం రాసుంటాడు" అంటూ కవరందుకుని అటు ఇటు తిప్పిచూశాడు.

చేతికి ఫారం ఇస్తూ "ఇక్కడ సంతకం చెయ్యి" అంటూ వేలితో చూపాడు పోస్టుమ్యాను. సూరి సంతకం పెట్టాడు.

కవరు జాగ్రత్తగా తెరిచి చూశాడు.

నిజమే! కొడుకు సురేంద్ర వెయ్యి డాలర్ల డ్రాఫ్టు పంపించాడు! దాన్ని ఎలా మార్చుకోవాలో వివరంగా రాశాడు.

"పంతులూ! ఇది మారిస్తే మన డబ్బులెంతొస్తాయి?" డ్రాఫ్టు చూపిస్తూ అడిగాడు.

పరిశీలనగా చూసి "సుమారు యాభై వేలొస్తాయి" అన్నాడు పంతులు.

కాటూరి రవీంద్ర త్రివిక్రమ్

గ్రామీణ కథల పోటీ విభాగంలో కన్సొలేషన్ బహుమతి పొందిన కథ

"అంటే అరిటి తోటమీద ఒక సంవత్సరానికొచ్చిన లాభం అన్నమాట".

"ఇంకా తోటలు, పొలాల గురించి మాట్లాడతావేంటీ సూరీ. ఇప్పుడు నీ కొడుకే ఒక డబ్బుచెట్టు. నెలనెలకీ డాలర్ల  పంట పండిస్తాడు. ఒక్క కొడుకైనందుకు నిన్ను అందలంలో కూచోబెట్టి మరీ నీ రుణం తీర్చుకుంటున్నాడయ్యా..."

"మరీ అంత దిష్టి పెట్టకు... ఇదుగో నీ మామూలు" అంటూ పదిరూపాయలు చేతిలో పెట్టాడు.

"యాభైవేల డ్రాఫ్టు తెస్తే ముష్టి పది రూపాయలా?"

"లేకపోతే కమీషన్ ఇమ్మంటావా?"

"ఇంకో పదిరూపాయలివ్వొచ్చుగా?"

"సరే తీసుకో..." అంటూ ఇంకో పది రూపాయల నోటిచ్చాడు సూరి.

"ప్రతి నెలా ఇలాగే నీకు డ్రాఫ్టులు రావాలని మనసారా నిన్ను . . . నీ కంటే పెద్దవాణ్ణి కాబట్టి... ఆశీర్వదిస్తున్నానోయ్.." అన్నాడు డబ్బులు జేబులో పెట్టుకుంటూ పంతులు.

"ఆశీస్సులు సరే కానీ... నీ మామూలు నెలనెలా పెంచకు..."

"ఎంతైనా నీ పీనాసి బుద్ధిపోనిచ్చావు కాదు... నాలాంటి పేద వాడికిస్తే నీ సిరిసంపదలు పెరుగుతాయి... గుర్తుంచుకో..."

"గవర్నమెంటు ఉద్యోగం చేస్తున్నావ్... నువ్వు పేదోడివేంటి పంతులూ... మామూళ్లతో ఇల్లు గడిపేస్తావ్... జీతమంతా మిగులేకద?"

"ఇప్పుడు నువ్వు నాకు దిష్టి పెడుతున్నావా?! వస్తాబాబూ..." అంటూ సైకిలెక్కి తుర్రుమన్నాడు పంతులు.

"ఏవఁయ్యా..." అంది సూరి పెళ్లాం లక్ష్మి మొగుడికేసి ఆశగా చూస్తూ.

"ఏంటీ..." అన్నాడు సూరి కవరు జేబులో పెట్టుకుంటూ.

"అదుగో ఇదుగో అంటూ ఇన్నాళ్లు గడిపావ్... అబ్బాయి డబ్బులు పంపాడుగా.. పిల్లకి గొలుసు చేయించరాదూ.."

"ఇంకా చేతిలో డబ్బులుపడ్డాయో లేదో అప్పుడే సణుగుడు మొదలా?" కసురుకున్నాడు సూరి.

"పెళ్లీడుకొచ్చిన పిల్లకి మెళ్లో గొలుసన్నా లేకపోతే ఏం బావుంటదీ?"

"ఓర్పియవ్వ.. చేయిస్తాలేవే.. నా బుర్ర తినబోకు.." కవరు ఇంట్లో ఉంచి, మళ్లీ అరటితోటకి బయల్దేరాడు సూరి.

దారంతా కొడుకు గురించి ఆలోచన్లే...

ఇంత బుడతడు... చూస్తుండగానే పట్టుదలగా పరీక్ష మీద పరీక్ష పాసై చెట్టులా ఎదిగి, జతగాళ్లతో బాటు ఆస్ట్రేలియాలో ఉద్యోగానికని




వెళ్లి మూణ్ణెల్లయింది. కొడుకు చదువుకుంటున్న రోజుల్లో కూడా తనతోబాటు పొలం పనులకొచ్చేవాడు.

"నువ్వు కూచో నాన్నా... నేను చేస్తాగా" అంటూ పనంతా చక్క బెట్టేవాడు. మొదట సుబ్బయ్య అని తండ్రి పేరు పెట్టుకున్నాడు. ఆ పేరు ఫ్యాషనుగా లేదని స్కూల్లో జేర్పించేటప్పుడు సురేంద్రగా మార్పించింది భార్య. తనకి ఆ పేరుతో పిలవాలనిపించదు. తండ్రిని పిలిచినట్లే 'అయ్యా...' అని పిలుస్తాడు. పెళ్లాం మాత్రం 'బాబూ సురేంద్రా' అని పిలుస్తుంది.

తమ పల్లెటూళ్లో పై దేశానికి వెళ్లింది తన కొడుకొక్కడే. ఇతర దేశాల్లో జీతాలెక్కువంట. డాలరుకి బోలెడు రూపాయిలొస్తాయంట. ఈ కబుర్లన్నీ విడ్డూరంగా అనిపించేవి.

ఇప్పుడు తన కొడుకే ఏకంగా యాభై వేలు పంపాడు.

నిజమే! వాడు డబ్బుచెట్టే.. నెలకి యాభై వేలంటే మాటలా?! ఆలోచనల్లోనే అరటితోట వచ్చేసింది.

★ ★ ★ ★ ★

**పొ**ద్దున్నే ముసురు పట్టుకుంది.

తెల్లారినా ఇంకా తెల్లారనట్టే ఉంది. గాలి చెట్టుతో సరసాలాడుతోంది. కాకులు సన్నజల్లులో తడుస్తూ, రెక్కలు దులుపుకుంటున్నాయి.

పంతులు చంకకి ఉత్తరాల సంచీ తగిలించుకుని, ఒక చేత్తో సైకిలూ, మరో చేత్తో గొడుగుతో సూరి ఇంటిముందు ఆగాడు. సైకిల్ చప్పుడు వినగానే సూరి కూతురు కుమారి పరుగున వచ్చి "మా అన్నయ్య ఉత్తరం వచ్చిందా?!" అనడిగింది ఆత్రంగా. ఆ పిల్ల మెళ్లో బంగారు గొలుసు తళుకులీనుతోంది.

"అందుకే కదమ్మా వచ్చాను. ఏడీ మీ నాన్న షావుకారు?" అన్నాడు చమత్కారంగా.

లోపల్నుంచీ శిల్కుచొక్కా పంచెతో బయటకొచ్చాడు సూరి.

"రావయ్యా షావుకారూ... నీకు యాభై నాకు ఇరవై.. రాఁ.. ఇక్కడ

సంతకం పెట్టు...'' అన్నాడు కవరు అందిస్తూ.

"యాభై ఏంటి, ఇరవై ఏంటి'' అన్నాడు కాయితం మీద సంతకం పెడ్తూ.

"అదేనయ్యా... నీకు యాభై వేలు... నాకు ఇరవై రూపాయలు.. ఇప్పటికి ఆర్నెల్ల నుంచీ మనిద్దరికీ మామూలేగా...'' అన్నాడు చెయ్యిజాపుతు.

సూరి జేబులోంచి ఇరవై రూపాయలు తీసి ఇచ్చాడు. అందుకుని జేబులో పెట్టుకుంటూ "అంతా బాగానే ఉంది గానీ... వ్యవసాయం మానేసి, పొలాలన్నీ కౌలుకిచ్చి ఇట్లా ఇంటిపట్టున ఉంటే నీకెలా తోస్తుందయ్యా'' సందేహంగా అడిగాడు పంతులు.

"టి.వి. ఉంది గదయ్యా... దాంతోనే కాలక్షేపం...''

"అవున్లే... టి.వి. దగ్గర కూర్చుంటే ప్రపంచాన్నంతా చూడొచ్చు...'' అంటూ మళ్లీ సైకిలెక్కాడు పంతులు.

"అన్నయ్య ఏం రాసాడు నాన్నా... ఎప్పుడొస్తాట్ట...'' కుమారి ఆసక్తిగా అడిగింది.

ఉత్తరం చదువుకుంటూ- "అందర్నీ అడిగినట్లు చెప్పమన్నాడు. నిన్ను బాగా చదువుకోమన్నాడు...'' నవ్వి "ఆ పని మాత్రం చెయ్యవుగా'' అన్నాడు సూరి..

"చదువుకుంటూనే ఉన్నా కద నాన్నా...'' గారంగా అంది.

"ఏం చదువు వానాకాలం చదువు. ఇప్పటికి ఇంటర్మీడియెట్ రెండుసార్లు తప్పావ్...''

"ఈసారి పాసవుతాలే నాన్నా..''

"అదీ చూద్దాం..'' అంటూ ఇంట్లోకెళ్లాడు సూరి.

★ ★ ★ ★ ★

'**త**మరే చూడండి బాబూ... ఎదవగాలికి ఎక్కడి చెట్లక్కడే ఇరిగి పడ్డాయి..'' కౌలుదారు కిట్టయ్యా నడుం విరిగిన అరటిచెట్లని సూరికి చూపించాడు. ఆవేదన నిండిన మనసుతో చెట్లకేసి చూశాడు సూరి.

రాత్రి తుపాను గాలి ఉధృతంగా వీచింది. కరెంటు రానూపోనూగా వేధించింది. టి.వి. చూసిన కాస్సేపట్లోనే గుండెల్లో శూలంలా దిగిన వార్త చూసాడు.

ఆస్ట్రేలియాలో మనవాళ్ల మీద జరిగిన దాడుల్లో కొడుకు తీవ్రంగా గాయపడ్డాడు. ఆస్పత్రిలో 'కోమా'లో ఉన్నాడు. ఆత్రంగా కొడుకు స్నేహితులకి ఫోను చేశాడు. పరిస్థితి బాగాలేదని, ఆరోగ్యం చక్కబడ్డాక మనదేశం పంపేస్తామని చెప్పారు. అప్పట్నుంచీ మనసు మనసులో లేదు. అంతలో కౌలుదారు కిట్టయ్య పొద్దున్నే మరో దుర్వార్త మోసుకొచ్చాడు. అరటితోటంతా గాలికి విరిగిపడిందని. అందులో చెరిసగం వాటా ఉంది.

తోట చూశాక మౌనంగా ఇంటిదారి పట్టాడు సూరి.

ఇల్లంతా విషాద వాతావరణం అలుముకుని ఉంది. సురేంద్ర క్షేమంగా ఇంటికొస్తే చాలని భార్య, కూతురు వేయి దేముళ్లకి మొక్కుతున్నారు. తనెప్పుడూ దేవుడికి మొక్కలా...

నేలని నమ్మాడు... కష్టాన్ని నమ్మాడు...

ఎగుడు దిగుడులున్నా జీవితం బాగానే నడిచింది.

అంతలో కొడుకు ఎదిగాడు. డబ్బు చెట్టయినాడు. నెలకి యాభై వేల రూపాయల పంటతో తను వళ్లు మర్చిపోయాడు. ఎన్నెన్నో ఊహల మేడలు కట్టాడు. ఎకరాలు ఎకరాలు పొలాలు కొనేసి, ఊరికంతా తానే పెద్దరైతయి, పంచాయతీ ప్రెసిడెంటయి, పెత్తందారయి, కోరమీసం దువ్వుకుంటూ, సెంటువాసనల చొక్కాలతో దర్జాగా తిరుగుతూ... చూస్తుండగా కారు కొని... డాబా ఇంటిని మేడగా మార్చి... అలా అలా ఊహలు పందెం గుర్రాల్లా పరుగెడుతూనే ఉన్నాయి నిన్నటి దాకా... మూడు లక్షలు చేతికొచ్చేసరికి పొలంలో దిగి, పనులు చేయాల నిపించక కౌలుకిచ్చాడు. రోజూ కాసులు కురిపించే అరటితోటని చెరి సగం పంచుకునేట్టు కిట్టయ్యకప్పజెప్పాడు.

నూరుగొడ్లని తిన్న రాబందు ఒక్కగాలివానకి కూలినట్లు... తన ఆశలన్నీ కూలిపోయాయి. కొడుకుని ఇక తన దగ్గరే ఉంచుకుంటాడు.




''సూరీ...'' బయట నుంచీ పోస్ట పంతులు గొంతు విన్పించింది. కాయితం మీద సంతకం పెట్టించుకున్నాడు. డబ్బులియ్యబోతే "వద్దు సూరీ... బహుశ ఇదే నీకొచ్చే చివరి కవరనుకుంటాను.. అంతా అనుకుంటుంటే విన్నాను.. బాధపడకు... నీ కొడుకు క్షేమంగా ఇంటికి వస్తాడు. ఇక నుంచీ వాడ్ని కొడుకుగానే చూడు. డబ్బుచెట్టుగా కాదు. ఎందుకంటే చెట్లు గాలికి కూలతాయి. మమతలు ఎప్పటికీ మాయవు. వాడు వచ్చాక మళ్లీ పొలం పనులు మొదలెట్టు... వాడూ నీకు సాయంగా ఉంటాడు'' అంటూ వెళ్లిపోయాడు పంతులు.

"అవును... అలాగే చెయ్యాలి..'' సూరి తనకి తాను చెప్పుకున్నాడు. ☆

**వ్యవసాయంలో అదును పదును అనేది ముఖ్యమైనది. అదును చూసి పదును వున్నప్పుడు విత్తనం వేయాలి అనేది సాధారణంగా మనం అందరం అనుకునే విషయం. కాని వ్యవసాయంతో అన్ని కోతలు మొదలైన అన్ని పనులకు ఇది వర్తిస్తుంది.**

**మన రాష్ట్రంలో ఈ సంవత్సరం రాత్రి ఉష్ణోగ్రతలు తక్కువగా నమోదు అవుతున్నాయి. పలు ప్రాంతాల్లో రాత్రి ఉష్ణోగ్రతలు 16$^{0}$ కన్నా తక్కువగా నమోదు అవుతున్నాయి. మంచు కూడా బాగా పడుతుంది. ఈ వాతావరణ పరిస్థితులు మార్చి వరకు కొనసాగవచ్చని అంచనా. మంచు పర్వతాల నుంచి, ఆఫ్ఘనిస్తాన్, రష్యాలనుంచి కూడా మన దేశం పైకి శీతల పవనాలు వీస్తున్నాయి. మన రాష్ట్రంలో వివిధ జిల్లాల్లో కనిష్ట ఉష్ణోగ్రతలు 11$^{0}$ సెంటిగ్రేటు నుండి 19$^{0}$ సెంటీగ్రేటు మధ్య నమోదవుతుంది. ఇలాంటి వాతావరణ పరిస్థితులలో ఫిబ్రవరి- మార్చి నెలల్లో వివిధ పంటల్లో వచ్చే చీడ పీడలు- వాటి నివారణ గురించి తెలుసుకుందాం.**

# ఈ తరుణంలో చేయవలసిన పొలం పనులు

## వరి

వరి పైరులో రాత్రి ఉష్ణోగ్రతలు 24$^{0}$C లోపల వుండటం, మంచుపడటం, వాతావరణం చల్లగా వుండటం, గాలిలో తేమ అధికంగా వుండటం-ఈ పరిస్థితులలో పొడతెగులు, పొట్టకుళ్ళు తెగలు, మెడ విరుపు తెగులు ఎక్కువగా వచ్చే అవకాశం వుంది.

***పొడతెగులు :*** వరి నాట్లు పూర్తి అయిన 45-50 రోజుల నుండి ఆశిస్తుంది. అంటే వరి పైరు పిలకలు పెట్టిన తర్వాత ఈ శిలీంధ్రం వరి చేల గట్లు పై ఉండే కలుపు మొక్కల మీద పెరిగి, వాటి నుండి వరి పంటను ఆశిస్తుంది. భూమిలో ఉన్న ఈ శిలీంద్రం బీజాలు కూడా మొలకెత్తి వరి పైరును ఆశిస్తాయి.

ఈ శిలీంద్రం వల్ల కాండం పై ఉండే ఆకుమీద పాముపొడవంటి



మచ్చలు ఏర్పడి, క్రమేణా పెద్దవై, ఒకదానితో ఒకటి కలిసి మొత్తం వరి మొక్క ఆకులు, మొక్క కూడా ఎండి పోవటం జరుగుతుంది. ఈ మచ్చలు ఒక క్రమ పద్ధతిలో వుండవు. మచ్చల చుట్టూ గోధుమరంగు వుండి మధ్యలో బూడిద రంగు వుంటుంది. ఆకులు, మొక్కలు ఎండి పోవటం వలన పంట దిగుబడి, నాణ్యత తగ్గుతుంది.

నత్రజని ఎరువులను ఒకేసారిగా ఎక్కువ వేయటం వలన తెగులు తొందరగా అభివృద్ధి చెందుతుంది. కనుక నత్రజని ఎరువులను ఒకేసారిగా కాకుండ 3-4 దశలుగా వేయాలి. గట్లపై, చేనులో కలుపు లేకుండా చూడాలి. 10 శాతం పిలకలు ఈ పొడతెగులు వల్ల నష్టపోయినట్లు గమనించినట్లయితే ప్రొపికొన్యాజోల్ 1మి.లీ. లేక హెక్సాకొనజోల్ 2 మి.లీ లేక వాలిడా మైసిన్ 2 మి.లీ ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. 15 రోజుల వ్యవధి తర్వాత మరొకసారి ఈ మందు ద్రావణాన్ని పిచికారీ చేయాలి.

***పొట్టకుళ్ళు తెగులు :*** ఈ తెగులు వరి పైరు పొట్ట దశలో వున్నప్పుడు వస్తుంది. వెన్ను పైకి తీసే దశలో ఎక్కువగా కనిపిస్తుంది. ఈ తెగులు కలుగచేసే శిలీంద్రం సామాన్యంగా కీటకాలు వరి మొక్కలపై చేసిన గాయాల ద్వారా ప్రవేశించి వరి వెన్నును ఆకు లోపలనుండి పైకి వచ్చి మిగిలిన భాగం పోటు ఆకులోపల వుండిపోతుంది.

ఈ పోటు ఆకు కింది భాగంలో ఆకుపై కోలగా కాని లేక ఒక పద్ధతిలోగాని గోధుమరంగు లేదా చాక్‌లెట్ రంగు మచ్చలు ఏర్పడతాయి. ఈ మచ్చలకు మధ్యలో బూడిదరంగు వుంటుంది. ఈ తెగులు సోకటం వలన పైకి వచ్చిన వెన్నుపై ఉండే ధాన్యం గింజలు గట్టి గింజలుగా ఉండటం జరుగుతుంది. ఆకులోపల వెన్నుపై ఉండే గింజలు చాక్‌లెట్ రంగులోకి మారి పొల్లుగా మారటం జరుగుతుంది. ఎక్కువ గింజలు పొల్లుగా మారటం వలన పంట దిగుబడి బాగా తగ్గుతుంది.

వరి పైరులో ఈ తెగులు కనిపించిన వెంటనే ఒకసారి 7రోజుల తర్వాత మరొకసారి కార్బండిజయ్(50 I.w.p)లీటరు నీటికి 1గ్రాము చొప్పున కలిపి పిచికారీ చేయాలి.

***అగ్గి తెగులు లేక మెడ విరుపు తెగులు :*** ఈ తెగులు వరి పైరు అన్ని దశల్లోనూ రావటానికి అవకాశం వుంది. ఇది వరి వెన్ను పైకి తీయక ముందు అగ్గితెగులుగా ఆకులుపై వస్తుంది. ఫిబ్రవరి- మార్చి మాసాలలో వెన్ను పైకి తీసే దశలో వుంటుంది. ఈ దశలో ఈ తెగులు వచ్చినట్లయితే వరి వెన్ను మెడ దగ్గర నల్లటి మచ్చగాని, గోధుమరంగులో ఉండే మచ్చగాని ఏర్పడుతుంది. ఈ మచ్చల వలన మొక్కలలో పోషకపదార్థాల సరఫరాకు ఆటంకం ఏర్పడుతుంది.వెన్ను పైకితీసిన వెంటనే ఈ తెగులు సోకినట్లయితే వరి వెన్ను మీద ఉండే మొత్తం గింజలు పొల్లుగా మారి తెల్ల కంకిగా మారటమే కాకుండా పూర్తి పంట దెబ్బతింటుంది. వరి

పైరు వెన్ను తీసిన కొన్ని రోజుల తర్వాత ఈ తెగులు సోకినట్లయితే, తెగులు సోకక ముందు గట్టిపడిన ధాన్యం గింజలు మాత్రమే ఉంటాయి. మిగిలినవి, సగం నిండిన ధాన్యం గింజలు గాను, పొల్లుగాను వుంటాయి. అంతేకాకుండా తెగులు సోకిన వరి వెన్ను మెడ దగ్గర విరిగి వేలాడటం కాని, వెన్ను పడిపోవటం గాని జరుగుతుంది. అందుకే దీనిని 'మెడ విరుపు తెగులు' అంటారు.

ట్రైసైక్లోజోల్ (75శాతం) 0.6గ్రా లేదా ఎడిఫెన్ ఫాస్ 1 మి.లీ లీటరు నీటికి కలిపి పిచికారి చేయాలి. ఉదయం 11గం.ల తర్వాత పిచికారి చేయాలి.

### మామిడి

తేనె మంచు పురుగు :ఈ పురుగు మామిడి పూతనుంచి రసాన్ని పీల్చిటం వలన పూత, పిందె రాలుతుంది. ఈ పురుగులు తేనె లాంటి తీపి పదార్థాన్ని విసర్జిస్తాయి. ఈ విసర్జితాల మీద నల్లటిబూజు కూడా ఏర్పడుతుంది. మోనోక్రోటాఫాస్ 1.5 మి.లీ లేదా క్లోర్‌పైరిఫాస్ 2 మి.లీ లేదా డైమిథోమోట్ 2 మి.లీ లేదా కార్బరిల్ 3 గ్రా ఒక లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారి చేయాలి. పూత మొదలయ్యే సమయంలో పిందెలు తయారయ్యే సమయంలో పూత, ఆకుల పైనే కాకుండా మొదళ్ళపైనా, కొమ్మలపైన కూడా పిచికారీ చేయాలి.



బూడిదతెగులు: మామిడి పూత పిందె దశలో ఉన్నప్పుడు బూడిదతెగులు ఆశిస్తుంది. ఈ తెగులు ఆశించినపుడు మొక్కల ఆకులు, పూత, పిందెలపై తెల్లటి బూజు వంటి పదార్థం ఏర్పడుతుంది.

తెగులు తీవ్రంగా వున్నప్పుడు పూత, పిందె పక్వదశకు రాకుండానే రాలిపోవి అరవైశాతం వరకు నష్టం వాటిల్లుతుంది.

కెరథెన్ 1మి.లీ లేక బేలిటాన్ 1గ్రా. లేదా మైకోబ్యూటనిల్ (0.05గ్రా). వీటిలో ఎదైనా ఒక మందు లీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయాలి. 15 రోజుల వ్యవధిలో పూతకు ముందు, పూత దశలో, పూత ఆగిపోయిన తర్వాత మూడుసార్లు పిచికారీ చేయాలి.

### చెరకు

**పీక పురుగు :** ఫిబ్రవరి నుండి మే మాసాంతం వరకు దీని వలన చెరకు నష్టపడుతుంది. పీక పురుగు చెరకు మొవ్వల లోనికి తొలచు



కొనిపోయి మొవ్వును చంపి వేస్తుంది. నీటి ఎద్దడి వున్నప్పుడు ఈ పురుగు తాకిడి ఎక్కువగా వుంటుంది. చెరకు కణుపులు ఏర్పడిన తర్వాత పీక పురుగు కణుపు తొలిచే పురుగుగా మారుతుంది. పీకపురుగు ఆశించిన తల్లిగడలు నశించటం వల్ల పిలగా వుండే లాభసాటి కాని పిలకలు ఎక్కువగా వస్తాయి.

వీలైనంత తక్కువ వ్యవధిలో ఎక్కువ సార్లు అంటే దగ్గర దగ్గరగా నీటి తడులు ఇవ్వాలి. మొక్క తోటల్లో నాటిన మూడవ రోజున కారి శ్తోటల్లో కార్శిచేసిన వెంటనే ఎకరాకు 1.2 టన్నుల చొప్పున చెఱకు చెత్త కప్పాలి. ఎండో సల్ఫాన్ మందు లీటరు నీటికి 2 మి.లీ చొప్పున కలిపి నాటిన 4వ వారం, 6వవారం, 9వ వారవ పిచికారీ చేయాలి. నాలుగవ వారంలో హెక్టారుకి 450 లీటర్లు, 6వ వారంలో 675 లీటర్లు, తొమ్మిదవ వారంలో 900 లీటర్లు మందు నీటిని చల్లాలి. తెలంగాణా జిల్లాల్లో ఈ మందు 4,8,12 వారాల్లో పిచికారీ చేయాలి.

### మిరప

**పేనుబంక:** మిరప ఆకుల అడగు భాగాన , లేత రెమ్మలకు పేను వంటి పురుగులు, గుంపులు గుంపులుగా పట్టు రసాన్ని పీలుస్తాయి. దీని వల్ల మొక్కలు నీరసించి గిడసబారి పోతాయి.

ఈ పురుగులు తేనె లాంటి జిగురు పదార్థాన్ని విసర్జించటం వలన దీనికి చీమలు వస్తాయి. ఆకులకు, కాయలకు ఈ జిగురువల్ల నల్లటి



బూజు కూడ ఏర్పడుతుంది. కిరణజన్య సంయోగక్రియకు అంతరాయం కలగటం మొక్కలు పెరుగుదల, దిగుబడి తగ్గిపోతాయి. కాయ ముచ్చిక, కాడలకు, కొంతవరకు కాయ మీద కూడ ఈ తెగులు సోకటం వలన కాయ నాణ్యత తగ్గుతుంది. ఈ పేను బంక పురుగు వెర్రి తెగుళ్ళను వ్యాపింపచేస్తాయి,

ఎసిఫేట్ 1గ్రాము ఒకలీటరు నీటికి చొప్పున కలిపి పిచికారీ చేయటం వలన పేను బంకను సమర్ధవంతంగా నివారించవచ్చు. ఈ లసిఫేట్ మందు కాయతొలుచు పురుగు మీద కూడా సమర్ధవంతంగా పనిచేస్తుంది. ఇది ఎక్కువ ఉధృతంగా లేనప్పుడు మోనోక్రోటాఫాస్1$^{1/2}$ మి.లీ లేదా మిథైల్ డిమాటాన్ 2 మి.లీ ఒక లీటరు నీటికి కలిపి పిచికారీ చేయాలి. అవసరాన్ని బట్టి 2 లేదా 3 సార్లు మందులు మార్చి చల ్లుతుండాలి.

## పత్తి తీయటంలో మెళకువలు

పత్తిలో గిట్టుబాటు ధర రాబట్టటానికి పత్తి తీసేటప్పుడు కొన్ని జాగ్రత్తలు తీసుకోవాలి. పత్తి నాణ్యత అంటే ముఖ్యమైనవి పింజ పొడవు, పింజ మృదుత్వం, పింజ గట్టతనం, పింజ పరిపక్వత దూది శాతం వీటన్నింటి మీద నూలు వడికే శక్తి ఆధారపడివుంటుంది. ఇవన్నీ కూడ మొదటి రెండుసార్లు తీసిన పత్తిలో బాగుంటాయి. తరువాత వచ్చే పత్తిలో తగ్గుతూవుంటాయి. పత్తిని 4-5సార్లు తీయటం జరుగుతుంది. కాని మొదటి రెండు సార్లు తీసినది వేరుగా వుంచాలి. పత్తి నంతటిని కలిపివేస్తే ఎక్కువ నాణ్యత వున్న ప్రత్తికి కూడా సాధారణ ధర మాత్రమే వస్తుంది.



పత్తిని ఉదయం 8గం.ల తర్వాత, మధ్యాహ్నం ఒంటిగంట లోపల, మరల సాయంత్రం 3 గం.ల నుండి ఆరు గంటల లోపున తీసుకోవాలి. ప్రత్తి తీసేటప్పుడు అందులో గుడ్డి పత్తి లేక గొగ్గిపత్తి అంటే పురుగు తాగిన పత్తిని వేరుగా తీయాలి.

పత్తి తీసిన తరువాత కొంతసేపు ఎండలో వుంచితే పత్తిలో ఏ మైనా తేమవుంటే పోతుంది. తేమవున్న పత్తి కొంత రంగుమారి నాణ్యత తగ్గుతుంది. అలాగే వాన కురిసేటప్పుడు గాని, వాన వెలసిన వెంటనేగాని పత్తిని తీయకూడదు.



## పశుగ్రాసాలు

ఈ సంవత్సరం ఖరీఫ్ సీజనులో సాధారణ వర్షపాతం కూడా నమోదు కాకపోవటంతో 1068 మండలాలను కరువు ప్రాంతాలుగా ప్రకటించారు. నైరుతి రుతుపవనాలు నిరాశమిగల్చగా వర్షపాతం 27శాతం తక్కువగా నమోదయ్యింది. రబీలో ఈశాన్య రుతుపవనాలు ద్వారా ఆశించిన స్థాయిలో వానలు కురవలేదు. డిశంబరు చివరకి 224.3 మి.మీ. సాధారణ వర్షపాతానికి 185 మి.మీ మాత్రమే నమోదైంది. ఇలాంటి వర్షాభావ పరిస్థితులలో పశుగ్రాసాల కొరత వచ్చే అవకాశం వుంది. ఇలాంటి పరిస్థితులలో కనీసం పండించిన పశుగ్రాసాన్ని సక్రమంగా వినియోగించుకోవటం ఎంతో ముఖ్యం.

పచ్చి మేతను కాని, ఎండు గడ్డిని కాని చిన్న చిన్న ముక్కలుగా కత్తిరించి పశువులకు వేస్తే ఏ మాత్రం వృధా కాకుండా మేస్తాయి. అన్ని రకాల పశుగ్రాసాలను ముక్కలుగా కత్తిరించే యంత్రాలు వాడుకలోకి వస్తున్నాయి. గడ్డి కత్తిరించకుండా పశువులకు వేస్తే ఆకులు మాత్రం తిని కాడలు వదలివేస్తాయి. మేత పొడవుగా వుండటం వలన తినేటపుడు కాళ్ళకింద పడి పేడ మొదలైనవి అంటి, గడ్డి మలినమయి తినటానికి పనికి రాకుండా పోతుంది. అంతేకాక అలాంటి పరిస్థితులలో నిల ్వ వుంటే అంటువ్యాధులు, దోమలు, ఈగలు, ఇతర పురుగులు ప్రబలే అవకాశముంది. అందువలన గ్రాసాలను కత్తిరించి గాటిలోగాని, తొట్టిలోగాని, బుట్టలోగాని వేసి మేపితే పశుగ్రాసం ఏ మాత్రం వృధాకాదు.

అనుకూల పరిస్థితులలో మిగులుగా వున్న గ్రాసాన్ని మాగుడు గడ్డిగా గాని లేదా సక్రమ పద్ధతిలో ఎండబెట్టి ఎండు గడ్డిగా గాని నిలువ చేసుకొని పశుగ్రాస కొరతవున్న సమయాల్లో వినియోగించుకోవచ్చు.

పోషక విలువలు అతి తక్కువగా వుండే వరిగడ్డి,చొప్ప మొదలైన గ్రాసాలపై బెల్లపుమడ్డి (10శాతం) ఉప్పు 1శాతం యూరియా రెండు శాతం. ఉన్న ద్రావణాన్ని చల్లి పోషక విలువలు పెంచుకోవచ్చు.

సుబాబుల్, అవిశ, మోదుగ, దరిసెగ, నల్లతామ్మ, నిద్రగన్నేరు మొదలైన చెట్ల ఆకులు, వరిగడ్డి, చొప్ప మొదలైన వాటితో 20-30 శాతం వరకు కలిపి ఇచ్చినట్లయితే పాల దిగుబడి ఏ మాత్రం తగ్గదు. పశువులు ఆరోగ్యంగా కూడా వుంటాయి.

*- జి. విజయకుమార్*
(ఆకాశవాణి, హైదరాబాద్)

# మహిళలు, పిల్లలకు పోషకాహారం ఒక సవాలే

గడచిన కొన్ని దశాబ్దాలుగా జనాభా సంఖ్యలో వచ్చిన పెనుమార్పుల కారణంగా భారతీయుల ఆరోగ్య పౌష్టికాహార విషయాలలో మౌలిక మార్పులు చోటుచేసుకున్నాయి. 1951లో భారత జనాభా 36.1 కోట్లు ఉండగా, అది 2010 నాటికి 121.4 కోట్లకు పెరిగి ప్రపంచంలో అతిపెద్ద జనాభా ఉన్న దేశాల్లో రెండో స్థానానికి ఎదిగింది. కొన్ని దశాబ్దాలుగా భారతీయుల ఆరోగ్య స్థితిగతులు మెరుగుపడ్డాయని చెప్పుకోవచ్చు. మెరుగైన ఆరోగ్య సంరక్షణా సేవలు, పౌష్టికాహారం, పారిశుద్ధ్యం, యాంటీబయోటిక్స్, ఆధునిక శస్త్రచికిత్సా పద్ధతులలో వచ్చిన మార్పులు, సామాజిక ఆర్థికాభివృద్ధి దీనికి దోహదం చేశాయి. వీటి ఫలితంగా భారతీయుల ఆయుః ప్రమాణం కూడా గణనీయంగా పెరిగింది. అందుకే ఒక సగటు భారతీయుడు ఇప్పుడు 27 జన్మదినాలను ఎక్కువగా జరుపుకోగలుగుతున్నాడు. 1951లో సగటు భారతీయుడి జీవన పరిమాణం 37 సంవత్సరాలుండగా, అదిప్పుడు 64 ఏళ్ళకు పెరిగింది. అదే కాలంలో సహజ మరణాల రేటు 25 నుండి 7.4 (2007)కు, శిశు మరణాల రేటు 146 నుండి 57కు పడిపోయింది. అదేవిధంగా సహజ జననాల రేటు 41 నుండి 22.8కి దిగజారింది.

| ప్రస్తుత పరిస్థితి | | | |
|---|---|---|---|
| వ. సంఖ్య | ఆరోగ్య సూచికలు | భారత్ | ఆంధ్రప్రదేశ్ |
| 1. | జీవన పరిమాణం | 63.6 | 64.6 |
| 2. | సహజ జననాల రేటు (2008) | 22.8 | 18.4 |
| 3. | సహజ మరణాల రేటు | 7.4 | 7.5 |
| | సహజ మరణాల రేటు - పురుషులు | 8.0 | 8.3 |
| | సహజ మరణాల రేటు - స్త్రీలు | 6.8 | 6.7 |
| 4. | సంపూర్ణ ఫలన రేటు | 2.7 | 1.8 |
| 5. | లక్ష ప్రసూతుల్లో తల్లుల మరణాల నిష్పత్తి | 254 | 154 |
| 6. | పుట్టిన నెలలోపు/నెలలు నిండని శిశుమరణాలు | 37 | 33 |
| 7. | శిశుమరణాల రేటు | 53 | 52 |
| 8. | బాల్యమరణాల రేటు | 17 | 15 |
| 9. | (%) సగటు కంటే తక్కువ బరువుతో శిశువులు | 21.5 | 19.4 |
| 10. | 3 ఏళ్ళలోపు గిడసబారిన పిల్లలు | 38.3 | 33.9 |
| | 3 ఏళ్ళలోపు గిడసబారిన పిల్లలు - గ్రామీణ ప్రాంతం | 40.7 | 37.3 |
| | 3 ఏళ్ళలోపు గిడసబారిన పిల్లలు - పట్టణ ప్రాంతం | 31.1 | 27.4 |

జాతీయ కుటుంబ సంక్షేమ పథకం కారణంగా సంపూర్ణ ఫలన రేటు 2.7కు చేరుకోవటానికి దోహదపడింది. ఇది జాతీయ లక్ష్యమైన 2.1 స్థాయికి చేరుకొనే దిశగా అడుగులు వేస్తోంది. ఇప్పటికే ఆంధ్రప్రదేశ్, ఇతర దక్షిణాది రాష్ట్రాలు 2.1 దిగువ స్థాయికి చేరుకొన్నాయి. కుటుంబ నియంత్రణ పద్ధతులు, వాటి ఉపయోగాల గురించి భారతదేశ ప్రజలందరికీ అవగాహన ఏర్పడింది. గర్భనిరోధక పద్ధతుల అవలంబన 10.4 శాతం (1971) నుంచి 56 (2005)కి పెరిగింది.

పౌష్టికాహార లోపానికి గురయ్యే అవకాశమున్న ప్రీ స్కూలు పిల్లల ఆహారపు అలవాట్లలో మార్పులు వచ్చాయి. 1 నుంచి 3 ఏళ్ళ వయస్సు పిల్లలు 75 కిలో కెలోరీల శక్తినిచ్చే పదార్థాలను, 4 నుంచి 6 ఏళ్ళ మధ్య పిల్లలు కనీసం 140 కెలోరీల శక్తినిచ్చే ఆహారాన్ని తీసుకొంటున్నారు.

దేశం ఎంత పురోగతి సాధించినా, అధిక శాతం మంది ముఖ్యంగా గ్రామీణ ప్రాంతాలలోని ప్రజలు సకాలంలో జాగ్రత్తలు తీసుకొంటే నయమయ్యే జబ్బులు, గర్భస్థ, శిశుజననాల జబ్బులతో చనిపోతూ ఉన్నారు. తల్లులు, పిల్లల్లో హెచ్చుస్థాయిల్లో పౌష్టికాహార లోపాలు, బాల్య వివాహాలు, చాలినంత రక్షిత మంచినీటి సౌకర్యం లేకపోవడం, కిక్కిరిసిన జనావాసాలు, పారిశుద్ధ్య లోపం, చెత్త పారబోత సమస్యలు ప్రజలందరినీ, ముఖ్యంగా గ్రామీణ ప్రజానీకాన్ని పీడిస్తున్నాయి. వీటికి ప్రభుత్వాలు పరిష్కార మార్గాలను ఇప్పటికీ చూపలేకపోతున్నాయి. 2001 జనాభా లెక్కల ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లో 18 ఏళ్ళలోపు పిల్లలు 3.1 కోట్ల మంది ఉన్నారు. రాష్ట్ర జనాభాలో వీరు 41 శాతం మంది ఉన్నారు. వీరిలో అత్యధిక శాతం, అంటే 75% మంది గ్రామీణ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. ఆరు సంవత్సరాల లోపు పిల్లల్లో ప్రతి వెయ్యి మంది బాలురకు 961 మంది బాలికలు మాత్రమే ఉంటున్నారు. దీన్ని బట్టి రాష్ట్రంలో ఆడపిల్లల పట్ల వివక్ష కొనసాగుతోందని అర్థమవుతుంది.

18 సంవత్సరాల వయస్సు లోపున్న తల్లులకు జన్మించిన శిశువులు, 19 అంతకు మించిన వయస్సున్న తల్లులకు జన్మించిన శిశువుల కన్నా ఏడాది తిరగకముందే చనిపోవటానికి 60% ఎక్కువ అవకాశాలున్నాయి. డి.ఎల్.హెచ్.ఎస్ డేటా ప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లో 1998-99లో 73.9% మంది అమ్మాయిలకు 18 ఏళ్ళలోపు పెళ్ళిళ్ళు అయితే, అది 2002-04 నాటికి 39.3%కి, 2007-08 నాటికి 28.6%కి పడిపోయింది. శిశుమరణాలు తగ్గడానికి ఇదో శుభసూచకంగా భావించవచ్చు.

## శిశుమరణాల రేటు

దక్షిణాది రాష్ట్రాలలో శిశుమరణాల సంఖ్యలో ఆంధ్రప్రదేశ్‌దే అగ్రస్థానం. ప్రతి 1000 జననాలలో 52 మంది పుట్టుకతోనే చనిపోతున్నారు. వీటిలో పుట్టిన నెలలోపే చనిపోయే వారి సంఖ్యే ఎక్కువ. శైశవదశలో చనిపోయే వారిలో బాలికల కంటే బాలురే ఎక్కువ మంది మృత్యువాత పడుతున్నారు. అయిదేళ్ళలోపు పిల్లల్లో చూస్తే మాత్రం బాలికలే ఎక్కువ మంది మరణిస్తున్నారు. ఈ మరణాల రేటు గ్రామీణ ప్రాంతాలలో ముఖ్యంగా ఎస్.సి., ఎస్.టి జనాభాలలోనే ఎక్కువ ఉండటం గమనార్హం. మైనర్‌గా ఉన్నప్పుడే తల్లులు కావడం, కాన్పుల మధ్య ఎడం తక్కువ అవడం కూడా హెచ్చు శిశు మరణాలకు దారి తీస్తోంది.

ప్రస్తుత జననాల రేటు 22.8గా ప్రభుత్వ అంచనాలు సూచిస్తున్నాయి. అంటే 2.56 కోట్ల మంది పిల్లల సంరక్షణను మనం చూసుకోవాలి. పుట్టిన నెలలోపు చనిపోయే వారి రేటు 37గా నమోదైంది. అంటే పది లక్షల శిశువులు చనిపోతున్నారు. శిశుమరణాల రేటు 52 అంటే 16 లక్షల మంది తమ మొదటి జన్మదినానికి నోచుకోలేకపోతున్నారు. వీరిలో 64% మంది పుట్టిన నెల రోజుల్లోనే మృత్యుఒడిలోకి చేరుకొంటున్నారని అర్థం. వీటిలో సగానికి పైగా మరణాలు పుట్టిన మూడు రోజులకే జరగడం మరీ విచారకరం. ప్రతి వెయ్యి జననాలకు 15.9 రేటున శిశుమరణాలు జరుగుతున్నాయి. అయిదేళ్ళలోపు శిశుమరణాల రేటు కూడా ఏమంత ఆశాజనకంగా లేదు. అయిదేళ్ళలోపు వయస్సున్న వారిలో ప్రతివెయ్యి మందిలో 95 మంది లేదా 25 లక్షల మంది అయిదేళ్ళ నిండకముందే చనిపోతున్నారు. ప్రపంచంలో జరిగే శిశుమరణాలలో 23% మంది భారతదేశంలో ఉండటం గమనార్హం. ఈ సమస్యను యుద్ధప్రాతిపదికన ఎదుర్కోవాల్సిన అవసరం ఉంది.

## బరువుతక్కువ శిశువులు

ప్రపంచంలో చిన్నసైజు పిల్లలు పుట్టే దేశంగా భారతదేశం పేరుబడటం విచారించతగ్గ విషయం. 2.8 కిలోల కంటె తక్కువ బరువుతో పుట్టే పిల్లలను బరువు తక్కువ పిల్లలుగా పరిగణిస్తారు. భారతదేశంలో పుట్టే పిల్లల్లో 24% మంది ప్రామాణిక సగటుబరువు కంటే తక్కువగా పుడతారు. ప్రస్తుతం మన రాష్ట్రంలో పుట్టే పిల్లల్లో అయిదోవంతు (19.4%) మంది బరువుతక్కువగా ఉంటున్నారు. ఈ సమస్యకు ఆచరణీయమైన పరిష్కారం ఏమిటంటే, గర్భస్థ తల్లులకు మంచి పౌష్టికాహారం లభించేలా చూడటం, కాన్పుకు ముందు సక్రమమైన ఆరోగ్య సంరక్షణ చర్యలు తీసుకోవాలి.

## వ్యాధి నిరోధక పద్ధతులు

అయిదేళ్లలోపు జరిగే శిశుమరణాలలో ఎక్కువమంది వ్యాక్సీన్ల ద్వారా అరిగట్టగలిగే జబ్బులతో మరణిస్తున్నారు. వ్యాధి నిరోధక టీకాల ద్వారా చిన్నతనంలో ఏడు ప్రాణాంతక జబ్బుల నుంచి పిల్లలను కాపాడవచ్చు. ఆ ప్రాణాంతక జబ్బుల్లో టి.బి., డిఫ్తీరియా, కోరింత దగ్గు, టెటనస్, పోలియో, మశూచూచికం, హెపటైటిస్-బి మొదలైనవి ఉన్నాయి. మూడు నెలల వయస్సు నుంచి నాలుగేళ్ల లోపు ఉన్న పిల్లలు ఈ వ్యాక్సీన్‌లు తీసుకోకపోయినట్లయితే, చనిపోవడానికి మూడు రెట్ల హెచ్చు అవకాశాలున్నాయని వివిధ అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. రాష్ట్రంలో ఏడాది నుంచి రెండేళ్లలోపు వయస్సున్న పిల్లలకు పూర్తిస్థాయి వ్యాధినిరోధక టీకాలు (BCG-1, OPV-3, హెపటైటిస్-3, మచూచికం-1) వేయించుకొన్న వారి సంఖ్య 1992-93లో 45.4% ఉండగా అది 2007 నాటికి 82.7 శాతానికి పెరిగింది.

## కన్పించే ఆకలి లేదా మాంసకృత్తుల లోపం

ఆంధ్రప్రదేశ్‌తో సహా భారతదేశమంతటా మాంసకృత్తుల లోపం (Protein Energy Malnutrition - PEM) ప్రధానమైన ప్రజారోగ్య సమస్య. సాధారణంగా వచ్చే శ్వాస కోశ, ఉదరకోశ వ్యాధులు PEMను మరింత తీవ్రం చేసి మరణాలకు దారితీస్తాయి. మాంసకృత్తుల లోపం వల్ల దేహం గిడసబారిపోవడం, చదువురాకపోవడం, పని సామర్థ్యం తగ్గిపోవడం వంటి ఇతర రుగ్మతలు కూడా వస్తాయి. ఆంధ్రప్రదేశ్‌లో పిల్లల్లో పౌష్టికాహార సమస్యలు చాలా సాధారణమైపోయాయి. 2005-06లో NFHS సేకరించి డేటా ప్రకారం అయిదేళ్లలోపు పిల్లలలో 43% మంది గిడసబారిపోయిన వారిగా గానీ, వయస్సుకు తగ్గ ఎత్తు ఎదగకపోవడం గానీ జరుగుతున్నట్లు తేలింది. రాష్ట్రంలోని పిల్లలందరిలో మూడోవంతు మంది వయస్సుకు తగ్గ బరువు లేరు. అంటేవారు తీవ్రమైన లేదా దీర్ఘకాలిక పౌష్టికాహార లోపం బారిన పడుతున్నారన్న మాట. 12 శాతం మంది తీవ్రమైన పౌష్టికాహార లోపం వల్ల ఎత్తుకు తగ్గ బరువులేరు.

పిల్లలకు పాలిచ్చే పద్ధతుల్లో తల్లులు చేస్తున్న తప్పులవల్ల చాలామందికి పౌష్టికాహార లోపం కలుగుతోంది. కేవలం 10 శాతం మంది తల్లులు మాత్రమే సక్రమమైన పద్ధతులలో పిల్లలకు పాలిస్తున్నారు. సమగ్ర శిశుఅభివృద్ధి పథకం (ICDS) కింద 28% మంది పిల్లలకు అనుబంధ ఆహారం అందిస్తున్నారు. పౌష్టికాహార లోపాన్ని సరిదిద్దటానికి మనం చేపట్టే స్వల్పమైన, ఒక మోతాదు రూపాల్లో ఉండే చర్యల వల్ల అనుకొన్న లక్ష్యాలను చేరుకోలేక పోతున్నామనేది నిర్వివాదాంశం.

## కన్పించని ఆకలి లేదా మైక్రో న్యూట్రియంట్ల లోపం

శరీరానికి చాలా చిన్న మోతాదుల్లో కావాల్సిన మైక్రో న్యూట్రియంట్లు, న్యూట్రియంట్లు ముఖ్యంగా ఎ,బి,సి విటమిన్ల వంటివి, కాల్షియం, ఐరన్, అయోడీన్, జింక్ వంటి ఖనిజ పదార్థాల లోపం వల్ల కూడా పౌష్టికాహార లోపం ఏర్పడవచ్చు. ఆంధ్రప్రదేశ్‌లో ప్రధానంగా కన్పించే ఆహార లోపాలలో ఐరన్ డెఫిషియెన్సీ, అనీమియా, విటమిన్ డెఫిషియెన్సీ డిజార్డర్లు , అయోడీన్ డెఫిషియెన్సీ డిజార్డర్లు ముఖ్యమైనవి.

## పౌష్టికాహార సంబంధ అంధత్వం

విటమిన్ లోపంతో రేచీకటి మొదటి శాశ్వత అంధత్వం వరకు అన్నిరకాల అంధత్వ వ్యాధులు వచ్చే ప్రమాదం ఉంది. పదిమందిలో ఒకరి పాక్షిక అంధత్వ వ్యాధులు, అయిదింట ముగ్గరికి విటమిన్‌ల లోపంతో వచ్చే జబ్బులు వస్తున్నాయి. విటమిన్ ఎ లోపం వల్ల నీళ్ల విరోచనాలు రావడానికి మూడు రెట్ల ఎక్కువ అవకాశాలున్నాయి.

అలాగే మాశూచికం, శ్వాసకోశ సంబంధ వ్యాధులు రావటానికి రెండు రెట్ల ఎక్కువ అవకాశాలను పెంచుతుందని అధ్యయనాలు తెలియజేస్తున్నాయి.

## పౌష్టికాహార సంబంధ ఎనీమియా

పౌష్టికాహార సంబంధ రక్తహీనత దేశమంతటా ఉన్న పెద్ద ఆరోగ్య సమస్య. ఇది ముఖ్యంగా సంతాన వయస్సులో మహిళలకు, శిశువులకు, పిల్లలకు ఉంటుంది. అనేకమందికి ఐరన్ లోపం వల్లా, కొంతమందికి ఫోలేట్, B12 చాలినంత తీసుకోకపోవటం వల్ల వస్తుంది. ఆహారంలో తగినంత ఐరన్ తీసుకోకపోవడం వల్ల గానీ, పేగుల్లో ఐరన్‌ను గ్రహించేశక్తి లేకపోవడం వల్లగానీ ఎనీమియా వస్తుంది. పెరిగే దశలోగానీ, రుతుచక్రంలోగానీ, గర్భం ధరించినప్పుడు గానీ ఎక్కువ ఐరన్ అవసరమవుతుంది.

సగానికి పైగా గర్భస్థ తల్లులు ఐరన్ లోపంగా వచ్చే ఎనీమియాతో బాధపడుతున్నారు. అలాగే పదిమందిలో 8 మంది పిల్లలు కూడా ఈ ఎనీమియా బారిన పడ్తున్నారు.

గర్భం ధరించినప్పుడు ఈ ఎనీమియా బారినపడితే 20 శాతం మంది తల్లులు చనిపోయే అవకాశాలున్నాయి. నెలలు నిండకముందే కాన్పు అయ్యే అవకాశాలు పెరగడం, బరువు తక్కువ పిల్లలు పుట్టడం, గర్భస్థ శిశుమరణ ప్రమాదం, మెదడు శాశ్వతంగా దెబ్బతినే అవకాశాలు ఎక్కువగా ఉంటాయి. పిల్లలో దేహదారుఢ్యం తగ్గిపోవడం, జ్ఞాన సంబంధ రుగ్మతలు, తెలివి (IQ) 5 నుంచి 10 పాయింట్ల వరకు తగ్గిపోవడం, ఏకాగ్రత క్షీణించడం, తత్ఫలితంగా చదువులో వెనుకబడిపోవడం, ఇన్‌ఫెక్షన్ల బారినపడటం వంటివి సాధారణంగా జరుగుతాయి. పెద్దల్లో ఎనీమియా వల్ల శరీర పటుత్వం తగ్గిపోతుంది. ఉత్పాదక శక్తి క్షీణిస్తుంది. ఇన్‌ఫెక్షన్ల త్వరగా వస్తాయి. NFHS-3 డేటా ప్రకారం, 6 నెలల నుంచి 3 ఏళ్ల వయస్సున్న 80 శాతం మంది పిల్లలు ఎనీమియాతో బాధపడుతున్నారు. వారిలో 4% మంది తీవ్ర ఎనీమియా బారినపడిన వారున్నారు.

## అయోడీన్ లోపంతో వచ్చే అనారోగ్యం

అయోడీన్ లోపంతో వచ్చే జబ్బులు కొండల ప్రాంతాలకే కాకుండా ఆంధ్రప్రదేశ్ అంతా విస్తరించి ఉన్నాయి. గర్భంతో ఉన్నప్పుడు అయోడీన్ లోపం ఉంటే గర్భస్రావం జరిగే ప్రమాదం ఉంది. లేదా బుద్ధిమాంద్యంతో పిల్లలు పుట్టవచ్చు. కొన్ని సందర్భాలలో శిశువు చనిపోయే అవకాశం కూడా లేకపోలేదు. శిశువు మెదడు అభివృద్ధి చెందకపోవడం, తక్కువ తెలివైన పిల్లలు పుట్టవచ్చు. కొందరు మానసిక వైకల్యంతోనూ లేదా జ్ఞాన సంబంధ లోపాలతో చదువులో వెనుకపడిపోవడం, ఆటలు తదితర ఉత్తేజిత కార్యకలాపాల్లో పాల్గొనకపోవడం కూడా జరుగవచ్చు. కొందరిలో కండరాలు, మాట, వినికిడి సమస్యలు కూడా ఉత్పన్నమౌతాయి. అయోడీన్ లోపంతో మెడ కింద వాపు (గోయిటర్) వస్తుంది. పెద్దల్లో హైపోథైరాయిడిజం లేదా గొయిటర్ వస్తుంది.

## నియంత్రణ చర్యలు

విటమిన్ ఎ లోపంతో వచ్చే అంధత్వం, ఐరన్ లోపంతో వచ్చే ఎనీమియాను నివారించేందుకు ఐరన్, విటమిన్ ఎ కలిపిన ఉప్పును వాడేలా ప్రజలను ప్రోత్సాహిస్తున్నారు. అయితే ఈ ఖనిజ పదార్థాలు అందించే పథకాలు ప్రజలందరికీ చేరకపోవడంతో నివారణా చర్యలు విజయవంతం కావడంలేదని వివిధ అధ్యయనాల ద్వారా తెలుస్తోంది. NFHS-3 డేటా ప్రకారం, గత ఆరు నెలలలో ఏడాది నుంచి మూడేళ్లలోపు వయస్సున్న 29% మంది పిల్లలకు మాత్రమే విటమిన్-ఎ సప్లిమెంట్స్ ఇచ్చినట్లు తేలింది. అదే విధంగా 6 నెలల నుంచి 5 ఏళ్ల వయస్సున్న పిల్లలు 29% మంది అయోడీన్ కలిసిన ఉప్పును వాడుతున్నట్లు తేలింది. దీన్నిబట్టి రోగనివారణకు ప్రత్యామ్నాయ మార్గాలను అన్వేషించాల్సిన అవసరం ఉందని అర్థమవుతోంది.

## హెచ్.ఐ.వి/ఎయిడ్స్

భారతదేశంలో హెచ్.ఐ.వి/ఎయిడ్స్ ఒక శాతం కంటే తక్కువ మందికి ఉంది కానీ ప్రపంచ హెచ్.ఐ.వి./ఎయిడ్స్ కేసుల్లో 14% మందిని ఈ ప్రాణాంతక వ్యాధి ఇప్పటికే పట్టి పీడిస్తోంది. భారతదేశంలో మొత్తం 51 లక్షల మంది హెచ్.ఐ.వి/ఎయిడ్స్ తో జీవిస్తున్నట్లు అధికార అంచనాలు తెలుపుతున్నాయి. ఎయిడ్స్ కేసులు అత్యధికంగా ఉన్న 20 దేశాల్లో భారత్‌దే ప్రథమస్థానం. భారత్‌లో హెచ్.ఐ.వి/ఎయిడ్స్ ఉన్న వారి సంఖ్య 2006లో 51.3 లక్షలుంది. ప్రస్తుత రేటు (0.9%) ప్రకారం అది పెరుగుతూపోతే 2020 నాటికి ఈ సంఖ్య 63 లక్షలకు చేరుకొంటుందని అంచనా. పిల్లలలో ఈ జబ్బు గణనీయంగా పెరిగింది. 2003లో 14 ఏళ్లలోపు పిల్లలు 55 వేల మందికి హెచ్.ఐ.వి ఉన్నట్లు ప్రభుత్వ అధ్యయనంలో తేలింది.

క్లుప్తంగా చెప్పాలంటే, దురదృష్టవశాత్తు ఆంధ్రప్రదేశ్‌లో అనేకమంది పిల్లలు దుర్భర పరిస్థితుల్లోకి నెట్టి వేయబడుతున్నారు. వాడు కనీస అవసరాలకు కూడా నోచుకోలేకపోతున్నారు. ముఖ్యంగా బాలికలు దోపిడీకీ, అత్యాచారాలకు గురౌతున్నారు. చదువులు మాన్పించి బాధాకర పరిస్థితుల్లో వాళ్లతో పనులు చేయిస్తున్నారు. వారిలో హెచ్చు మంది దుర్భర దారిద్ర్యంలో పుట్టిన వారే ఉన్నారు. రక్త సంబంధీకులతో వివాహ సంబంధాలను పెట్టుకోకపోతే, దాదాపు నాలుగు లక్షల మందిని వికలాంగులు కాకుండా కాపాడవచ్చు. ఈ వికలాంగుల జీవితాలు దుర్భరంగా మారటమేకాక కుటుంబాలకు కూడా వారు భారంగా తయారవుతారు.

## యుక్తవయస్సు

దేశ జనాభాలో అయిదోవంతు మంది లేదా 22.5 కోట్ల మంది యువ జనులున్నారు. వీరిలో 12% మంది 10 నుంచి 14 ఏళ్ల వయస్కులు కాగా 10% మంది 15 నుంచి 19 ఏళ్ల వారున్నారు. యువతలో 47% మంది బాలికలు ఉన్నారు. నిరక్షరాస్య వైవాహిక మహిళల్లో సగం మందికి పైగా చట్టప్రకారం పెళ్లి చేసుకొనే వయస్సుకు ముందే పెళ్లి చేసుకున్న వారున్నారు. 2001 జనాభా లెక్కల ప్రకారం, 15 ఏళ్ల వయస్సు రాకముందే పెళ్లి చేసుకొన్న 15 లక్షల మందిలో దాదాపు 20% మంది తల్లులయ్యారు.

15-19 ఏళ్ల మధ్య వయస్సున్న మహిళల మరణాలు 10-14 ఏళ్ల వయస్సున్న అమ్మాయిల కంటే ఎక్కువ నమోదు అవుతున్నాయి.

10 నుంచి 19 ఏళ్ల మధ్య వయస్సున్న బాలికల్లో 70 శాతానికి పైగా మంది త్రీవ లేదా ఒక మాదిరి ఎనీమియాతో బాధపడుతున్నారు. 15-19 మధ్య పెళ్లైన మహిళల గర్భనిరోధ పద్ధతులను 27 శాతంమంది మాత్రమే పాటిస్తున్నారు. దేశంలోని హెచ్.ఐ.వి. రోగ గ్రస్తుల్లో 35 శాతానికి పైగా 15-24 సంవత్సరాల మధ్య వయస్కులు కావడం,వారు సరైన జాగ్రత్తలు తీసుకోవడం వల్లనే ఈ రోగం బారిన పడుతున్నారని తేలింది.

## మహిళల ఆరోగ్యం - పౌష్టికాహారస్థితి

సాధారణంగా ఆంధ్రప్రదేశ్‌లో, ఒక మహిళ యుక్త వయసు రాక ముందే పెళ్లి చేసుకొంటుంది. ఆ వెంటనే ఇద్దరు పిల్లలనుకని, కుటుంబ సభ్యుల సంఖ్యను నియంత్రించడానికి శస్త్రచికిత్స చేయించుకొంటుంది. దురదృష్టవశాత్తు ఈ దశలో కనీస పౌష్టికాహారానికి ఆమె నోచుకోదు. రాష్ట్రంలోని మహిళల్లో మూడోవంతు మంది సంతాన దశలో శక్తిహీనతతో బాధపడుతున్నారు. అల్పాదాయ వర్గాల మహిళలు తమకు అవసరమైన మేరకు శక్తి నిచ్చే పదార్థాలను తినరని వివిధ అధ్యయనాల ద్వారా తెలుస్తోంది. గర్భంతో ఉన్నవారు, పాలిచ్చే తల్లులు రోజుకు కనీసం వెయ్యి కిలో కేలరీల శక్తినిచ్చే ఆహారం చేసుకోవాల్సి ఉంటుంది. గర్భంతో ఉన్న అల్పాదాయ వర్గాల మహిళల కన్నా ఆర్థికంగా ఉన్నతంగా ఉన్న మహిళలు సగానికి పైగా బరువు పెరుగుతారు. నిరుపేద మహిళలు గర్భ ధరించినప్పుడు రోజూ తినే ఆహారం కన్నా ఆరోవంతు అదనంగా ($1^{1/6}$) తినాల్సి వస్తుంది. ఇండియన్ మెడికల్ కౌన్సిల్ రికమెండేషన్ల ప్రకారం, గర్భంతో ఉన్న స్త్రీ రోజుకు 300 కిలో కేలరీల శక్తి నిచ్చే ఆహారాన్ని, 10 నుంచి 15 గ్రాముల ప్రొటీన్లను అదనంగా తీసుకోవాల్సి ఉంటుంది. గ్రామీణ, పట్టణ ప్రాంత మహిళలు సాధారణంగా 1200 నుంచి 1600 కిలో కెలరీల శక్తినిచ్చే ఆహారాన్ని తీసుకొంటున్నారని అధ్యయనాలు తెలియజేస్తున్నాయి. గర్భంధరించాక వారు అదనంగా ఆహారాన్ని తీసుకోవడం లేదు. ముఖ్యంగా అల్పాదాయ వర్గాల మహిళలు అదనపు ఆహారం, తీసుకోనప్పటికీ, చురుకుగానే పనిచేయడం గమనార్హం. గర్భం దాల్చడానికి ముందు ఒక సగటు మహిళ 43 కిలోలు ఉంటుంది. గర్భస్థ దశలో 6 కిలోల బరువు పెరుగుతుంది. అటువంటి వారికి 2.7 కిలోల బరువున్న పిల్లలు పుడతారు. పట్టణ ప్రాంత మహిళలతో పోలిస్తే గ్రామీణ మహిళలు ఎక్కువ శ్రమ చేస్తారు. అందుకనే వారు పట్టణ ప్రాంత స్త్రీల కంటే 1 లేదా 2 కిలోల బరువు తక్కువగా ఉంటారు. గర్భం దాల్చినప్పుడు వారి బరువు 5 కిలోలు మాత్రమే పెరుగుతుంది. గర్భస్థదశలో తక్కువ మోతాదులో పోషక పదార్థాలు తిన్నా, శారీరక శ్రమ చేయకపోయినా లోపలి పిండం పెరుగుదలపై వ్యతిరేక ప్రభావాన్ని చూపుతుందని అధ్యయనాల ద్వారా నిరూపితమైంది. అల్పాదాయ వర్గాలలో 20శాతం మహిళలు గర్భస్రావం, ఇతర కారణాల వల్ల కాన్పులు జరగకుండానే గర్భాలను పోగొట్టుకొంటున్నట్లు అధికార లెక్కలు తెలుపుతున్నాయి. ఈ వర్గాలలోనే బరువు తక్కువ పిల్లలు పుట్టడం, కాన్పు సమయంలో మరణాలు సాధారణమై పోతున్నాయి. ఇటువంటి కేసులు ప్రతి వెయ్యి సజీవ జననాలకు 50 నుంచి 70 వరకు మరణాలు సంభవిస్తున్నాయి. పేద వర్గాలకు చెందిన మహిళలు సామాజిక సంప్రదాయాలకు కట్టుబడి పిన్నవయస్సులోనే పిల్లలను కనడం మినహా మరోమార్గం లేదు.

పాలిచ్చే తల్లులు మొదటి ఆరునెల్లల్లో 550 కిలో కేలరీల అదనపు శక్తి నిచ్చే పోషకపదార్థాలను తీసుకొన్నప్పుడే శిశువుకు చాలినన్ని పాలను ఉత్పత్తి చేయగలదు. ఆరు నెలల నుంచి ఏడాదివరకు 400 కిలో కేలరీల అదనపు శక్తి నిచ్చేపోషక పదార్థాలను తీసుకొంటే సరిపోతుంది. దురదృష్టవశాత్తు అనేక కుటుంబాలలో కాన్పు జరిగాక పోషకావసరాలను విస్మరిస్తున్నారు. కుటుంబ సంప్రదాయాలు, సంస్కృతి పేరుతో కాన్పు జరిగిన కొన్ని రోజుల వరకు పత్యమంటూ అన్ని రకాల ఆహారాన్ని అనుమతించక పోవడం మనం చూస్తూనే ఉంటాం.

## తల్లుల మరణాలు అందరికీ భారమే

**తల్లుల మరణాల సంఖ్యలో భారతదేశ అగ్రస్థానం**

**ప్రతి లక్ష సజీవ జననాలలో** 254 మంది తల్లులు మృత్యువాత పడుతున్నారు. ఈ కోవకు చెందిన అతి తక్కువ మరణాలు కేరళ రాష్ట్రంలో (95) నమోదు అవుతున్నాయి. అస్సాంలో అత్యధికంగా - 480 నమోదు అవుతున్నాయి. ప్రపంచ ఆరోగ్య సంస్థ అంచనాల ప్రకారం, ప్రపంచ వ్యాప్తంగా ఏటా జరిగే 5,29,000 తల్లుల మరణాలలో 1,36,000 భారత్‌లో జరుగుతున్నాయి. అంటే ఈ సంఖ్య 26 శాతానికి సమానం. ఇది దేశానికి పెనుభారంగా సంక్రమించింది.

ఇటీవల కాలంలో ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం తీసుకొంటున్న చర్యల కారణంగా తల్లుల మరణాలు గణనీయంగా తగ్గిపోతున్నాయి. అయినప్పటికీ, అనసరంగా అనేకమంది ప్రసవ సమయంలో, ప్రసూతి అనంతరం చనిపోతున్నారు. ఇండియన్ ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ హెల్త్ అండ్ ఫ్యామిలీ వెల్ఫేర్ అంచనాల ప్రకారం 1992-93లో రాష్ట్రంలో 417 మంది తల్లులు చనిపోగా, 1998-99లో అది 341 కి పడిపోయింది. ఆరేళ్లలో 76 మరణాలు తగ్గాయి. ఎస్.ఆర్.ఎస్. సంస్థ అంచనాల ప్రకారమైతే, 2001-03 కాలంలో 195 మరణాలు సంభవించగా అది 2004-06 కు 154కు పడిపోయింది. అయినప్పటికీ కేరళ, తమిళనాడుతో పోల్చుకుంటే ఈ సంఖ్య ఎంతో ఎక్కువ.

## ప్రసవ పూర్వ సంరక్షణ

ఇటీవల కాలంలో చేపట్టిన వివిధ అధ్యయనాల ద్వారా వెల్లడైన విషయం ఏమిటంటే, ప్రభుత్వం అందించే ఆరోగ్య సేవలను గర్భం ధరించిన మహిళలు 75% నుంచి 95% వరకు ఉపయోగించుకొంటున్నారు. వారు కనీసం మూడుసార్లు ప్రసవ పూర్వ సంరక్షణ కోసం ఆరోగ్య కేంద్రాలను సందర్శిస్తున్నారు.

## ఆరోగ్య కేంద్రాలలో ప్రసవాలు

ఆంధ్రప్రదేశ్‌లో 71.8% మంది స్త్రీలు ఆరోగ్య కేంద్రాలలో కాన్పులు చేయించుకొంటున్నారు. పట్టణ ప్రాంతంలో 90.9% మంది వరకు ఆసుపత్రులను కానీ, ఆరోగ్య కేంద్రాలను గానీ, ఆశ్రయిస్తున్నారు.

గ్రామీణ ప్రాంతంలో 65.7% ముందే ఆసుపత్రులలో కాన్పులు చేయించుకున్నట్లు 2007-08 జరిగిన ఒక సర్వేలో తేలింది.

## కృత్రిమ గర్భస్రావం - గర్భస్రావానంతరం సంరక్షణ

భారతదేశంలో ఏటా 50 లక్షల మంది అరక్షిత గర్భ స్రావాలు చేయించుకొంటున్నారు. సరైన ఆరోగ్య సేవలకు ఖర్చు పెట్టలేక ఏటా 20 వేల మంది గర్భస్రావం సందర్భంగా చనిపోతున్నారు. అరక్షిత గర్భస్రావాల సందర్భంగా వచ్చే ప్రమాదాల వల్ల అనేకమంది చనిపోతున్నారు. కొన్ని జాగ్రత్తలు తీసుకొంటే ఈ మరణాలను నివారించవచ్చు.

## తల్లుల పోషకాహారం

సాధారణంగా పోషకాహార లోపం మహిళలలోనే ఎక్కువ. దురదృష్టవశాత్తు వారు పోషకాహార లోపం, అధిక పోషకాహారం సమస్యలతో సతమవుతుంటారు. రాష్ట్రంలో మూడోవంతు మహిళలు బాడీ మాస్ ఇండెక్స్(BMI) కి 18.5 పాయింట్ల దిగువనుంటారు. అంటే పోషకాహార లోపం చాలా ఎక్కువ ఉన్న దన్న మాట. 15 నుంచి 49 ఏళ్ల వివాహిత మహిళలలో ఊబకాయులు / అధికబరువు ఉన్నవారి శాతం 11 నుంచి 15 కు పెరిగింది. ఒక సర్వేలో పాల్గొన్న 15-19 ఏళ్ల బాలికల్లో సగం మంది పోషకాహార లోపంతో బాధపడుతున్నారు. గ్రామీణ, పట్టణ ప్రాంతాలలో రక్తహీనత ప్రధానమైన ఆరోగ్య సమస్య.

దేశంలో దాదాపు సగంమంది మహిళలు ఒక మాదిరి నుంచి తీవ్రమైన రక్తహీనతతో బాధపడుతున్నారు. పురుషులకంటె స్త్రీలలో ఇది రెండు రెట్లు అధికంగా ఉంది. భారతదేశంలో సగం కుటుంబాలలో మాత్రమే అయొడీన్ కలిపిన ఉప్పును వాడుతున్నారు. దేశంలో 33 శాతం మంది స్త్రీలు, 24% మంది పురుషులు శాఖాహారులు. 60% మంది మహిళలు వారంలో ఒకసారి కూడా పండ్లు తినడానికి నోచుకోలేదు. ఒక అంతర్జాతీయ ఎయిడ్స్ చారిటీ సంస్థ **AVERT** అంచనాల ప్రకారం, 2004-05లో ఆంధ్రప్రదేశ్‌లోని ఆసుపత్రుల్లో దాదాపు 2% హెచ్.ఐ.వి. కేసులు నమోదు అయ్యాయి. ఈ సర్వే వివరాలు రాష్ట్ర ఆరోగ్య, పోషకాహార విషయంలో చాలా నిరాశా జనకంగా ఉన్నాయి.

## జాతీయ గ్రామీణ ఆరోగ్య మిషన్ (NRHM)

ఆర్థిక, సామాజికాభివృద్ధిలో, పౌరుల జీవితాలలో గుణాత్మక మార్పులు తెచ్చేందుకు కేంద్ర ప్రభుత్వం నేషనల్ రూరల్ హెల్త్ మిషన్‌ను 2005 ఏప్రిల్‌లో ప్రారంభించింది. ఇది 7 ఏళ్ల పాటు అమల్లో ఉంటుంది. ఆరోగ్య సంరక్షణ వ్యవస్థలో ఉన్న లోపాలను సరిదిద్దేందుకు ఈ మిషన్ చర్యలు తీసుకుంటుంది. ఈ మిషన్ ప్రధాన లక్ష్యాలు 1) 2012 కల్లా శిశు మరణాల రేటును ప్రతి వెయ్యి సజీవ జననాలలో 30 కితగ్గించడం 2) 2012 నాటికి తల్లుల మరణాలను 100/1,00,000 కు తగ్గించడం 3) 2012 నాటికి పూర్తి ఫలన రేటును 2.1 కి తగ్గించడం.

## టోటల్ ఫెర్టిలిటీ రేట్ (TFR)

**TFR** అంటే, ఓ మహిళ 15 నుంచి 49 ఏళ్లలోపు తన సంతాన యోగ్యకాలంలో ఎంతమంది పిల్లలకు జన్మనిచ్చింది అన్న విషయాన్ని తెలియజేస్తుంది. జనాభా లెక్కల నిపుణులు రీప్లేస్‌మెంట్ లెవెల్ ఫెర్టిలిటీని 2.1 గా నిర్ణయించారు. దక్షిణాది రాష్ట్రాలన్నీ ఈ స్థాయికి దిగువకు చేరుకొన్నాయి. ఆంధ్రప్రదేశ్‌లో 1983లో **TFR** స్థాయి 3.2 ఉండగా, అది 2008 నాటికి 1.78కి పడిపోయింది. అన్నిమతాల, కులాల, ఆర్థిక, విద్యాస్థాయిల మహిళలు రీప్లేస్‌మెంట్ ఫెర్టిలిటీకి దిగువకు చేరుకున్నారు. అల్పాదాయ వర్గాల మహిళలు ఇంకా **TFR** కు దగ్గరలో అంటే 2.4 స్థాయిలో ఉన్నారు. ఈ వర్గం మహిళలు ఆంధ్రప్రదేశ్‌లో 10శాతం ముందే ఉన్నారు.

## ఆహారం, పోషక పదార్థాలలో కొత్త ధోరణులు

భారతీయ ఆర్థిక వ్యవస్థకు మూలాధారమైన వ్యవసాయ రంగంలో ఎంతో ప్రగతి సాధించాము. హరిత విప్లవం వల్ల ప్రజల ప్రధాన ఆహారం గోధుమ, వరి పంటల ఉత్పత్తి బహ్మాండగా పెరిగింది. అయితే ఈ ప్రగతి కాయధాన్యాలు, నూనె గింజలు ఉత్పత్తిలో కన్పించలేదు. వ్యవసాయాభివృద్ధి వల్ల ఆహార భద్రత పెరిగింది కానీ దానికి తగ్గట్టు పోషకాహారంపై ప్రభావం ఏ మాత్రం లేదు. తృణ ధాన్యాలు రోజుకు తల ఒక్కంటికి 570 గ్రాముల చొప్పున లభిస్తున్నాయి. మన జనాభాలో దాదాపు 40శాతం మంది, రోజుకు కావాల్సిన శక్తిలో 80% నికి తక్కువగా తింటున్నట్లు సర్వేలు తెలియజేస్తున్నాయి. దీనికి ప్రధాన కారణం కొనుగోలు శక్తి లేకపోవడం, ఆహార పదార్థాలు అందుబాటులో లేకపోవడంగా చెప్పకోవచ్చు.

2004-05 సంవత్సరంలో నేషనల్ న్యూట్రిషన్ మానిటరింగ్ బ్యూరో **(NNMB)** నిర్వహించిన న్యూట్రిషన్ సర్వేలో అనేక ఆశ్చర్యకరమైన అంశాలు వెలుగులోకి వచ్చాయి. ఈ సర్వేలు దేశంలోని 9 రాష్ట్రాలలోని గ్రామీణ ప్రాంతాల్లో జరిపారు. వాటి ప్రకారం, చిరుధాన్యాల వాడకం 13% తగ్గిపోయింది. దుంపలు, గడ్డలు మినహా మిగతా ఆహార పదార్థాలు వారి నిత్యాహారంలో నిర్ణీత మోతాదుకంటే, బాగా తగ్గిపోయాయి. శరీరానికి రక్షణ కల్పించే ఆహారపదార్థాలైన పాలు, పప్పులు, ఆకుకూరలు, పండ్ల వాడకం మరీ తగ్గిపోయింది. ఐరన్,విటమిన్- ఎ, రైబోఫ్లేవిన్, ఫోలిక్‌యాసిడ్ వంటి అత్యవసరమైన మైక్రో న్యూట్రియంట్లు రికమెండ్ చేసిన స్థాయికంటే చాలా తక్కువగా ప్రజలు తీసుకొంటున్నారు. అయిదేళ్లలోపు పిల్లలలో 40% మంది బరువు తక్కువగా ఉంటున్నారు. స్త్రీ,పురుషుల్లో మూడోవంతుమంది దీర్ఘకాలంగా శక్తిహీనంతో బాధపడుతున్నారు. పురుషుల్లో 55%మంది, గర్భంలేని, పాలివ్వని తల్లులలో 75% మంది రక్తహీనతతో బాధపడుతున్నారు. గ్రామీణ ప్రాంతాల్లో నివసించే స్త్రీ పురుషుల్లో నాలుగోవంతుమంది హై బ్లడ్ ప్రెషర్‌తో సహజీవనం చేస్తున్నారు.

## సమస్యలు, సవాళ్లు

క్షీణించిన ఆరోగ్యం, పౌష్టికాహారలోపం రెండూ కలిస్తే జ్ఞాన సంబంధ సమస్యలు వస్తాయి. ముఖ్యంగా అయిదేళ్లలోపు పిల్లలు, స్కూలుకు వెళ్లేవారిలో విద్య పట్ల ఆసక్తి తగ్గిపోతుంది. పెద్దల్లో ఉత్పాదక శక్తి నశించిపోతుంది. పోషకాహార లోపం కారణంగా వచ్చే ఎనీమియాతో శారీరక, మానసిక సామర్థ్యం క్షీణిస్తుంది. ప్రపంచబ్యాంక్ రిపోర్టు ప్రకారం, 1996లో భారతదేశంలో ప్రధాన పోషకాహార లోపాల వల్ల 10 నుంచి

28 బిలియన్ల అమెరికన్ డాలర్ల విలువైన ఉత్పాదకత నష్టం జరుగుతోంది. ఇది స్థూల జాతీయ ఉత్పత్తిలో 3 నుంచి 9% వరకు ఉంటుందని అంచనా. దీన్ని బట్టి పోషకాహార లోపాల వల్ల 90% భారత్ నష్టపోతోంది. ఇలా ఉత్పాదకత నష్టపోవడం, రోగాలు, చావులవల్ల మానవాభివృద్ధి కుంటుబడి పోవడమే కాకుండా మాతాశిశు మరణాలు మరింత పెరుగటానికి దోహదపడుతున్నాయి.

రెండేళ్ల లోపు పిల్లలందరికీ సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాలు ఇవ్వడం వల్ల శిశు, బాల్య మరణాలను గణనీయంగా తగ్గించవచ్చు. పిల్లలు బడి మానివేయడాన్ని నివారిస్తే, వ్యాధి నిరోధక టీకాలను ఎక్కువ మందికి వీలవుతుంది. వ్యాధి నిరోధక టీకాలకు సంబంధించిన ప్రాథమిక సమాచారాన్ని తల్లి దండ్రులందరకీ అందించడం చాలా కీలకమైంది. బాధ్యతలను పంచుకోవడం, ఆరోగ్య కార్యకర్తలు, సిబ్బంది మధ్య విధి నిర్వహణ బాధ్యతలు స్పష్టంగా ఉంటే, సార్వత్రిక వ్యాధి నిరోధక టీకాల పథకాలు అట్టడుగు స్థాయి వారికి చేరుతాయి. ఈ సార్వత్రిక టీకాల పథకాలకు అదనపు వనరులను కూడా సమకూర్చి, సేవలను మరింత ముమ్మరం చేస్తున్నారు.

సంతాన యోగ్యమైన మహిళల సంఖ్య 2000 సంవత్సరంలో 24.9 కోట్లుండగా, వారి సంఖ్య 2025 కల్లా 35 కోట్లకు పెరుగుతుందని అంచనా. అదే విధంగా, రుతుచక్రం ఆగిపోయే 50-59 మధ్య వయస్సున్న మహిళల సంఖ్య 2000వ సంవత్సరంలో 3.5 కోట్లమంది ఉండగా, వారి సంఖ్య 2025 నాటికి 6.7 కోట్లకు పెరుగుతుంది. వివాహిత స్త్రీల (15-49 మధ్య వయస్సున్న వారు) సంఖ్య 2000వ సంవత్సరంలో 19.1 కోట్లుండగా, 2025కి అది 26.9 కోట్లకు పెరుగుతుందని అంచనా. 2000 నుంచి 2025 సంవత్సరాల మధ్య 60.9 కోట్ల జననాలు జరుగుతాయని అంచనా. ప్రజారోగ్య సంస్థలను పటిష్టంచేయడం, నూరుశాతం ఆసుపత్రుల్లో కాన్పులు చేయించడం, అట్టడగుస్థాయి ఆరోగ్య కార్యకర్తలను విస్తరింజేయడం, ఆరోగ్య సేవలను ప్రజల చేరువలో తప్పని సరిగా ఉంచడం, శిశు ఆరోగ్యంపై అవగాహన కల్పించడం అనేది అంశాలు ఆరోగ్య కార్యకర్తలకు సవాళ్లు. ఈ అవసరాలను తీర్చడం మరో పెద్ద సవాలు.

భారతదేశంలో స్త్రీ పురుష నిష్పత్తిలో అంతరం పెరిగిపోవడం విచారించతగ్గ విషయం. దీన్ని నివారించడానికి బాలికలకు సామాజిక, సాంస్కృతిక వ్యవహారాలలో సమానహోదాను ప్రోత్సాహించాలి. గర్భస్థ శిశుహత్యలను నివారించేందుకు చట్టాలను పటిష్టంగా అమలు చేయాలి. బాలికలను బడికి పంపేందుకు ప్రజలను సన్నద్ధం చేయాలి. బాల్య వివాహాలను నిరోధించే చట్టాలను పకడ్బందీగా అమలు చేయాలి. బాలికల హక్కులను పరిరక్షించడానికి మీడియా ద్వారా ప్రచారం సాగించాలి. బాలికలపై వివక్షను సమూలంగా నిర్మూలించి పరిస్థితిని మెరుగుపరిచేందుకు అన్ని చర్యలూ తీసుకోవాలి.

హెచ్.ఐ.వి/ ఎయిడ్స్ సోకిన పిల్లల సంరక్షణను మెరుగు పరచాలి. తల్లుల నుంచి పిల్లలకు జబ్బు రాకుండా నివారించాలి. పెళ్లైన జంటలందరికీ ఎయిడ్స్ స్క్రీనింగ్ టెస్టులు చేయాలి. వ్యాధి సోకిన పిల్లలకు ప్రాథమిక ఆరోగ్య సేవలు ఇంటి వద్దనే లభించేలా చూడాలి. ఎయిడ్స్ ఉన్న వ్యక్తులపై వివక్ష చూపకుండా ఉండేందుకు చట్టాన్ని చేయాలి.

కౌమారదశలో ఉన్నవారి ఆరోగ్యం పట్ల చాలా జాగ్రత్తలు తీసుకోవాలి. మన ఆరోగ్యం, అనారోగ్యం, మరణాలు, జనాభా పెరుగుదల మొదలైన అన్ని అంశాలకు అదే కేంద్ర బిందువు. యవ్వనదశలో ఆరోగ్యకరమైన సెక్స్, ప్రత్యుత్పత్తిలో పాల్గొనడం అలవాటైతే సమాజానికి మంచి ఫలితాలు అందుతాయి. పెళ్లి చేసుకోవడాన్ని వాయిదా వేయడం, టీనేజ్‌లో గర్భం రాకుండా చూసుకోవడం, గర్భనిరోధక పద్ధతులలో లక్ష్యాలను పూర్తిచేయడం, తల్లుల మరణాలను తగ్గించడం, సెక్స్ ద్వారా సోకే జబ్బులను నివారించడం, 10-19 మధ్య వయస్సులో హెచ్.ఐ.వి. సోకకుండా జాగ్రత్త పడటం వంటి చర్యలు తీసుకొంటే ఆరోగ్యవంతమైన జనాభాకు నాంది పలికినట్లవుతుంది. ఆర్థిక వ్యవస్థకు ఆరోగ్యకరమైన యువత గొప్ప జాతీయ వనరూ ఉంటుందనడంలో సందేహం లేదు.

ఆంధ్రప్రదేశ్‌లో జనాభా పెరుగుదల రేటును గణనీయంగా తగ్గించడంలో రాజకీయనేతల బలమైన పట్టుదల వల్లనే సాధ్యమైంది. సమర్థవంతమైన అధికారగణం నిరంతరం కుటుంబ సంక్షేమ పథకాలను అమలు చేయడం వల్ల లక్ష్యాలకు మించిన ఫలితాలు వచ్చాయి. సామాజిక ఆర్థికాభివృద్ధి ఆశించనంతగా లేకపోయినా జనాభాను అరికట్టడంలో విజయం సాధించగలిగారు. అంటే, జనాభా తగ్గుదలకు సామాజిక ఆర్థికాభివృద్ధి జరగాలన్న సాంప్రదాయపు ఆలోచన తప్పు అని రుజువైంది. జనాభా పెరుగుదలను అరికట్టినా బాల్యవివాహాలు, టీనేజ్‌లో పిల్లలను కనేవారి సంఖ్య, కాన్పులమధ్య ఎడంలేక పోవడం వంటి అంశాలపై ఇంకా శ్రద్ధ చూపాల్సి ఉంది. ఆంధ్రప్రదేశ్ ప్రజల దృష్టిలో కుటుంబ నియంత్రణ అంటే ఆపరేషన్ చేయించుకోవడమే. కాన్పులమధ్య ఎడంఉంచుకోవడం కూడా నియంత్రణలో భాగమని అనుకోరు.

ఆడవారినే ఆపరేషన్లు చేయించుకోమని అంటారు కానీ, కుటుంబ నియంత్రణ శస్త్రచికిత్సలు మగవారు చేయించుకోవడం చాలా అరుదు. చిన్నతనంలోనే పిల్లలను కని కుటుంబ నియంత్రణ శస్త్ర చికిత్సలు చేయించుకొనే వారి సంఖ్య పెరగడం వాంఛనీయం కాదు. శిశు మరణాల నివారించడంలో జాప్యం జరగడం, గర్భవతులైన తల్లులలో ఎక్కువ శాతం హెచ్.ఐ.వి. సోకిన వారుండడం చాలా ప్రమాదకరమైన ధోరణులు. వీటిని తక్షణం పరిష్కరించాల్సి ఉంది.

ప్రస్తుత సవాళ్లను ఎదుర్కోటానికి, ఆరోగ్యం, పోషకాహార స్థితిలో మార్పు తేచ్చేందుకు సంబంధిత రంగాలలో పరిశోధన అభివృద్ధి జరగాలి. ముఖ్యంగా గర్భవతులు / పాలిచ్చే తల్లులు, యువత, ప్రీ స్కూలు వయస్సులో ఉన్న పిల్లలు విషయంలో సమాజంలోని అన్ని వర్గాల వారు తమ చేయూతనివ్వాల్సిన అవసరం ఉంది.

**- డాక్టర్ ఎ. సాయిబాబా, ప్రొఫెసర్,**

ఇండియన్ ఇనిస్టిట్యూట్ ఆఫ్ హెల్త్ & ఫ్యామిలీ వెల్ఫేర్,

హైదరాబాద్

(అనువాదం - కె.ఎస్.రెడ్డి)

# సంక్షోభంలో మన పంచాయతీరాజ్ వ్యవస్థ

**జాతీయ స్థాయి ప్రభుత్వానికి ప్రధానమంత్రి, రాష్ట్రస్థాయి ప్రభుత్వానికి ముఖ్యమంత్రి, జిల్లాస్థాయి ప్రభుత్వానికి జిల్లా పరిషత్ చైర్మన్, మండలస్థాయి ప్రభుత్వానికి మండల అధ్యక్షుడు, గ్రామపంచాయతీ స్థాయి స్థానిక ప్రభుత్వానికి సర్పంచ్ నాయకత్వంలో ప్రభుత్వ యంత్రాంగం పనిచేయాలని రాజ్యాంగం రాజకీయ నిర్మాణాన్ని చేసింది. మహాత్మాగాంధీ కలలు కన్న 'గ్రామ స్వరాజ్యాన్ని' స్థాపించేందుకు 73, 74వ రాజ్యాంగ సవరణ ద్వారా 'స్థానిక సంస్థలకు' రాజ్యాంగ ప్రతిపత్తి ఇవ్వబడింది. రాజ్యాంగ ప్రతిపత్తి కల్పించి సుమారు ఒకటిన్నర దశాబ్దాల కాలం కూడా పూర్తయింది. స్థానిక స్వపరిపాలనకు సంబంధించి ఒకటిన్నర దశాబ్దాల కాలంలో వచ్చిన మార్పులాధారంగా పంచాయితీరాజ్ వ్యవస్థను మూడు రకాలుగా విభజించవచ్చు.**

ఒకటి పంచాయితీరాజ్ వ్యవస్థ బలంగా వున్న రాష్ట్రాలు. ఉదాహరణకు కేరళ, పశ్చిమబెంగాల్. రెండు పంచాయితీరాజ్ వ్యవస్థ మధ్యస్థంగా వున్న రాష్ట్రాలు కర్నాటక, మధ్యప్రదేశ్, సిక్కిం, గుజరాత్ తదితర రాష్ట్రాలు. మూడవ రకం- పంచాయతీరాజ్ వ్యవస్థ బలహీనంగా వున్న రాష్ట్రాల జాబితాలో ఆంధ్రప్రదేశ్, ఉత్తరప్రదేశ్, బీహార్ వంటివి వున్నాయి. దేశానికి స్వాతంత్ర్యం వచ్చిన తరువాత పంచాయితీరాజ్ వ్యవస్థను ప్రారంభించిన రెండవ రాష్ట్రం ఆంధ్రప్రదేశ్.

దేశమొదటి ప్రధానమంత్రి జవహర్‌లాల్ నెహ్రూ పంచాయితీరాజ్ వ్యవస్థను ప్రారంభిస్తూ, ఈనాటి నుండి గ్రామీణ ప్రాంతాలలో 'పాలు, తేనె' ఏకమై ప్రవహిస్తాయి అన్నాడు. దాని అర్థం పరిపాలనా వ్యవస్థలో ప్రజలందరూ భాగస్వాములై, నీతినిజాయితీ గల పాలనను అందిస్తారని అయితే ఆనాటి నుండి ఈనాటి వరకు రాష్ట్రంలో కొనసాగుతున్న పంచాయితీరాజ్ వ్యవస్థలో గ్రామ స్వరాజ్యం అంతర్భాగం కాకుండా, మరింత బలహీనపడింది. ఈ రకంగా రాష్ట్రంలో పంచాయితీరాజ్ వ్యవస్థ బలహీనపడడానికి అనేక కారణాలు వున్నాయి.

ఆంధ్రప్రదేశ్ ప్రత్యేక రాష్ట్రంగా ఆవిర్భవించిన నాటి నుండి నేటి వరకు రాజకీయాలలో సామాజిక హోదా, భూమిపైన ఆధిపత్యం, రాజకీయ పార్టీల పై పట్టు, ప్రజలను అణిచివేసే అధికారాన్ని చెలాయించే 'ఆధిపత్య కులాల అధికారం' కొనసాగడం. ఈ ఆధిపత్య కులాల అధికారానికి భూస్వామ్య, పెట్టుబడిదారీ స్వభావం వుంది. ఇటువంటి ఆధిపత్య కులాలు ప్రజలందరినీ భాగస్వాములను చేసి, అధికార వికేంద్రీకరణ దిశగా పంచాయితీరాజ్ వ్యవస్థను బలోపేతం చేయాలని ప్రయత్నించలేదు. ఇందుకు విరుద్ధంగా, రాష్ట్ర స్థాయిలో రాజకీయాధికారాన్ని కాపాడుకునేందుకు ఆధిపత్య కులాలు పంచాయితీరాజ్ వ్యవస్థను రాజకీయ దుర్వినియోగ చేశాయి. రాజకీయ ప్రయోజనాలకు, ఓటు బ్యాంక్ రాజకీయాలకు ఉపయోగించుకున్నాయి.

73వ రాజ్యాంగ సవరణ ద్వారా లభించిన రిజర్వేషన్ల వల్ల బడుగు బలహీన వర్గాలు స్థానిక సంస్థలలో భాగస్వామ్యం సంపాదించుకునేసరికి, ప్రత్యామ్నాయ సంస్థలను సృష్టించి, అధికారాలను బదలాయించకుండా పంచాయితీరాజ్ వ్యవస్థను మరింత బలహీనపరిచారు.




స్థానికసంస్థలకు బదలాయించవలసిన 29 అంశాలలో కేవలం ప్రాథమిక విద్య, స్త్రీ శిశు సంక్షేమం, సాంఘిక సంక్షేమం వంటి తొమ్మిది అంశాలను మాత్రమే పంచాయితీలకు ఇస్తున్నట్లు రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీచేసినప్పటికీ, అవి ఆచరణలో అమలుకావడం లేదు. ప్రాథమిక విద్యను పంచాయితీలకు బదలాయిస్తే ఉపాధ్యాయ సంఘాలు వ్యతిరేకిస్తున్నాయి. స్త్రీ శిశు సంక్షేమాన్ని పంచాయితీలకు ఇస్తే అంగన్‌వాడీ కార్యకర్తలు 'మా పై పంచాయితీల జులుమా' అంటూ వ్యతిరేకిస్తున్నాయి. అదే విధంగా జాతీయ గ్రామీణ ఉపాధిహామీ పథకాన్ని పంచాయితీరాజ్ సంస్థల ద్వారా అమలు చేయాలని చట్టం చెబుతున్నప్పటికీ,

రాష్ట్రంలో ఉపాధి హామీ పథకాన్ని జిల్లా స్థాయిలో జిల్లా నీటి నిర్వహణ సంస్థ, మండలస్థాయిలో కాంట్రాక్టుపై నియమితులైన ప్రోగ్రామ్ ఆఫీసర్ ద్వారా, గ్రామాల్లో పంచాయితీకన్నా మహిళా సంఘాలకు ప్రాధాన్యత ఇచ్చి అమలు చేయిస్తున్నారు.

రాష్ట్రంలో పంచాయితీరాజ్ వ్యవస్థ బలహీనపడడానికి మరొక కారణం - అధికారులను బదలాయించకుండా శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యులు గ్రామపంచాయితీ రాజకీయాలపై పట్టును సాధించేందుకు ప్రయత్నించడం. ఫలితంగా స్వతంత్ర ప్రతిపత్తితో పనిచేయవలసిన పంచాయితీరాజ్ వ్యవస్థ శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యుల నిధులపై ఆధారపడుతుంది.




ఈ విధంగా ఆధారపడడం వల్ల స్వతంత్ర ప్రతిపత్తిని కోల్పోయి నమ్మినబంట్ల వ్యవస్థగా మారుతుంది. అందువల్ల శాసనసభ్యులు, పార్లమెంట్ సభ్యుల నిధిలాగే స్థానిక సంస్థల నిధిని ఏర్పాటు చేయాలని డిమాండ్ వుంది. అయితే నిధులు, అధికారాలు పంచాయితీలకు బదలాయిస్తే 'వికేంద్రీకృత అవినీతి' ఆవిర్భవిస్తుందని వాదిస్తున్నారు. ఇటువంటి వాదనలను అధిగమించడానికి సమాచారహక్కు, సామాజిక తనిఖీ వంటి వాటిని ప్రవేశపెట్టారు.

చాలాకాలంగా రాష్ట్రంలో స్థానిక సంస్థలకు ఎన్నికైన ప్రజాప్రతినిధులు సంఘాలుగా ఏర్పడి నిధులు, విధులు, సిబ్బందిని పంచాయితీరాజ్ సంస్థలకు అప్పగించాలని గౌరవవేతనం, ఇతర సౌకర్యాలతో పాటు అధికారంలో భాగస్వామ్యం చేయాలని ఆందోళనలు చేస్తున్నారు. ఈ ఆందోళన ఫలితంగా పంచాయితీరాజ్ వ్యవస్థను బలోపేతం చేసే స్థాయిలో విధాన నిర్ణయాలు ఏమీ తీసుకోలేదుగాని, ఎన్నికైన ప్రజా ప్రతినిధుల హక్కులను మాత్రం కొంతవరకు సాధించుకున్నారు. ఆంధ్రప్రదేశ్‌లో పంచాయితీరాజ్ సంస్థల సంఘాల ఆందోళనలు ప్రజా బాహుళ్యంలో నుండి ఆవిర్భవించినవి కాకుండా, కేవలం ఎన్నికైన పంచాయితీ ప్రతినిధులకు మాత్రమే పరిమితమయ్యాయి.

అదే కేరళలో ప్రస్తుత ఆర్థికమంత్రి థామస్ఐజక్ (Thomas Isack) వంటివారు సమాజంలోని అన్ని వర్గాలతో పాటు మేధావులు, శాస్త్రవేత్తలు, కళాకారులు అందరిని భాగస్వాములను చేస్తూ 'ప్రజల ప్రణాళిక' (People Plan) ఉద్యమాన్ని నిర్వహించడం వల్ల పంచాయితీరాజ్ వ్యవస్థ బలపడి, కేరళ రాష్ట్రంలో పంచాయితీరాజ్ వ్యవస్థ దేశంలోనే ఆదర్శంగా వుంది. ఇటువంటి ఉద్యమం మన రాష్ట్రంలో కొనసాగడం లేదు.




ఎన్నికలు వచ్చిన ప్రతిసారీ ప్రతి రాజకీయ పార్టీ కూడా ఎన్నికల ప్రణాళికలో పంచాయితీలకు అధికారాలు బదలాయిస్తామని, అధికారంలోకి రాగానే అధికారాలను పంచాయితీలకు బదలాయించే ఫైల్‌పైనే మొదటి సంతకం పెడతామని వాగ్దానం చేస్తున్నాయి. అధికారంలోకి వచ్చిన తర్వాత ఆ విషయాన్ని పట్టించుకోవడం లేదు. ఇందుకు మూలకారణం రాష్ట్రంలో ప్రజల భాగస్వామ్యంతో కూడిన బలమైన పంచాయితీరాజ్ ఉద్యమం లేకపోవడమే.

*-**డాక్టర్ ఇ. వెంకటేశు,** అసిస్టెంట్ ప్రొఫెసర్,*
*జాతీయ గ్రామీణాభివృద్ధి సంస్థ*

# పశ్చిమ గోదావరి జిల్లా ఉత్తమ పంచాయితీ సర్పంచ్‌ల కేరళ రాష్ట్ర పర్యటన

**'అపార్డ్', రాజేంద్రనగర్ దేశంలోని ఉత్తమ పంచాయితీల సందర్శన మన రాష్ట్రంలోని సర్పంచులందరికీ చేపట్టింది. దీనిలో భాగంగా పశ్చిమ గోదావరి జిల్లా సర్పంచులు కేరళ రాష్ట్ర పర్యటన డిసెంబర్, 2009న చేసారు. నా అవగాహన, అభిప్రాయాలు ఇలాగ ఉన్నాయి.**

నూతన గ్రామపంచాయితీ వ్యవస్థ 73, 74 రాజ్యాంగ సవరణ ద్వారా 1994 నుండి భారతదేశమంతా అమలులోనికి వచ్చింది. ఈ వ్యవస్థను కొన్ని మార్పులతో కేరళప్రభుత్వం 2002 నుండి గ్రామపంచాయితీ, బ్లాక్ పంచాయితీ, జిల్లా పంచాయితీలుగా వికేంద్రీకరించి మూడంచెల వ్యవస్థ ఏర్పాటు చేసి, రాజ్యాంగంలో పొందుపరచిన 29 అంశాలలో 19 అంశాల ను నేరుగా గ్రామపంచాయితీలకు బదలాయించి సంపూర్ణ అధికారాలు కట్టబెట్టింది. కేరళరాష్ట్రంలో 999 గ్రామపంచాయితీలు, 152 బ్లాక్ పంచాయితీలు, 14 జిల్లా పంచాయితీలుగా ఏర్పాటుచేసి గ్రామస్వరాజ్యం నెల కొల్పింది. ఈ విధానాలు మొత్తం భారతదేశానికి ఆదర్శవంతమై స్థానిక సంస్థలకు బదులు స్థానిక ప్రభుత్వాలుగా కేరళరాష్ట్రంలో పంచాయితీలు వెలుగొందుతున్నాయి.

### గ్రామ పంచాయితీ సర్పంచ్-వార్డు మెంబర్ల ఎన్నిక విధానం

ప్రతి గ్రామపంచాయితీలో కనీసం 5,000 జనాభా నుండి 50,000 వరకు ఉంటారు. ఈ మొత్తం జనాభాలోని ఓటర్లను వార్డులుగా విడదీసి వార్డు సభ్యులను పార్టీ పద్ధతిలో ఓటర్లు ఎన్నుకుంటారు. ఈ ఎన్నికైన వార్డు సభ్యుల నుండి సర్పంచ్‌ని ఎన్నుకుంటారు. ఇక్కడ సర్పంచ్ పరోక్ష పద్ధతి ద్వారా ఎన్నిక అవుతారు.

### గ్రామపంచాయితీ పరిపాలన విధానం

కేరళ రాష్ట్రంలో గల గ్రామపంచాయితీల పరిపాలన ప్రజాప్రతినిధులు, ప్రజల భాగస్వామ్యంతో కొనసాగుతున్నవి. ప్రభుత్వం అమలుచేసే అన్ని అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలు గ్రామపంచాయితీల ద్వారానే జరిగితీరాలి. లబ్ధిదారుని అర్హత, అవసరం అంతా గ్రామపంచాయితీ ద్వారానే గుర్తించడం జరుగుతున్నది.

### ప్రణాళికలు-బడ్జెట్

గ్రామపంచాయితీ భవిష్యత్ అవసరాల గురించి, ప్రజాప్రణాళిక ద్వారా నిర్ణయించి, రాష్ట్ర ప్రభుత్వానికి గ్రామ పంచాయితీలే నేరుగా పంపిస్తాయి. కేరళ ప్రభుత్వం 1997 నుండి ఈ వికేంద్రీకరణ ప్రజాప్రణాళిక ద్వారా రాష్ట్ర ప్రభుత్వం రాష్ట్ర బడ్జెట్ రూపకల్పనకు ముందే పంపించి గ్రామ పంచాయితీకి, ఆ ఆర్థిక సంవత్సరానికి ఎంత మేరకు నిధులు అవసరమో తెలియజేస్తుంది.

### నిధులు సమీకరణ

గ్రామపంచాయితీలు ప్రజాప్రణాళిక ద్వారా పంపించిన ప్రతిపాదనలో, కేరళ రాష్ట్ర ప్రభుత్వం 40% నిధులకు ఆమోదం తెలిపి, ఆ నిధులను గ్రామ పంచాయితీ అకౌంట్‌కు మధ్య వర్తుల ప్రమేయం లేకుండా జమ చేస్తుంది. దీని ప్రకారం ప్రతి గ్రామ పంచాయితీకి 3 నుండి 4 కోట్ల రూపాయల వరకు సమకూరే అవకాశం ఉంది. ప్రతీ సంవత్సరం నిధులు సాధించేందుకు ఏ సర్పంచ్‌కి రాజకీయ పలుకుబడి అవసరంలేదు.

### నిధులు ఖర్చుచేసే విధానం

గ్రామ పంచాయితీకి వివిధ శాఖల ద్వారా జమ చేయబడిన గ్రాంటుల ను ఖర్చు చేసే అధికారం, స్వేచ్ఛ, గ్రామ పంచాయితీ సమావేశాలు, గ్రామ సభ ద్వారానే జరుగుతాయి. జమ చేయబడిన మొత్తం నిధులలో 40% ఉత్పాదక, 20% మౌలిక సదుపాయాలు, 40% పరిపాలనా సౌలభ్యం గురించి మాత్రమే ఖర్చు చేయాలి.

వీలైనంతవరకు గ్రామపంచాయితీకి ఆదాయం, రాబడి, ప్రజా విరాళాలు, వసూళ్ళు ద్వారానే వస్తుంటాయి.

### సర్పంచ్-విధులు-నిధులు-సిబ్బంది

కేరళ రాష్ట్ర ప్రభుత్వం, నేరుగా గ్రామ పంచాయితీలకు 19 అంశాల ను అప్పగించటం వల్ల, గ్రామ సర్పంచ్ శక్తివంతుడుగా వ్యవహరి స్తాడు. ఏ ప్రజాప్రతినిధి అయినా ప్రజారంజకంగా పరిపాలించాలంటే విధులు, నిధులు, సిబ్బంది వారి ఆధీనంలోనే ఉంటే అనుకున్న పని సక్రమంగా ముందుకెళుతుంది. ప్రజా అవసరాలను గుర్తించి తక్షణం నిధులు ఖర్చు చేయడానికి సిబ్బందిపై అజమాయిషి చేయడానికి ఇక్కడ సర్పంచ్‌కి పూర్తి అధికారం ఇవ్వడం వలన సమస్యలు వెంటనే తీరిపోతున్నాయి. పనులు సాధించుకోవడానికి ఎవరి వద్దకో వెళ్ళి సమయం వృధా చేసుకోకుండా గ్రామపంచాయితీ ద్వారా పరిపాలన అంతా అందుబాటులో ఉండటం వలన ఇక్కడ సామాన్య ప్రజానీకానికి పూర్తి న్యాయం జరుగుతున్నది. సరిగా పని చేయని సిబ్బందిపై క్రమశిక్షణా చర్యలు తీసుకునే అధికారం సర్పంచ్‌కి ఉండటం వలన అధికారులు, సిబ్బంది సర్పంచ్ అదుపాజ్ఞలలో కనుసన్నలలోనే ఉండటం వలన జవాబుదారీతనంతో చక్కగా పనిచేస్తున్నారు.

### సర్పంచ్-ఇతరుల జీతభత్యాలు

కేరళ రాష్ట్రంలో సర్పంచ్‌కి గౌరవ వేతనం నెలకు రూ. 5000 సెల్‌ఫోన్ అలెవెన్సు, కారు అలవెన్సు ఉంది. ఉపసర్పంచికి నెలకు గౌరవవేతనం రూ. 2500, వార్డు మెంబర్లకు రూ. 1750, గ్రామపంచాయితీ నిధులు నుండి డ్రా చేసుకోవచ్చు. కార్యాలయంలో పని చేసే సిబ్బందికి

జీతభత్యాలు రాష్ట్ర ప్రభుత్వ ఖజానా ద్వారా చెలిస్తున్నారు. సిబ్బంది జీతాలు గ్రామ పంచాయితీలకు భారం లేదు కాబట్టి ఇక్కడ నిధులను, అనేక అభివృద్ధి సంక్షేమ రంగాలకు ఎక్కువగా ఉపయోగిస్తున్నారు.

### పారదర్శకత

గ్రామపంచాయితీకి వచ్చిన నిధులు ఖర్చు చేసిన వివరాలు ప్రతీనెలా జరిగే గ్రామపంచాయితీ సమావేశాల్లో చర్చించటం, ప్రతి మూడునెలలకు ఒకసారి 'గ్రామసభ' నిర్వహించటం ద్వారా అభివృద్ధి, సంక్షేమ, ఆర్థిక వ్యవహారాలు ప్రతీ ఒక్కరికీ తెలియటం వలన, కేరళ రాష్ట్రంలో 2002 నుండి ఒక్క దుర్వినియోగం కేసు కూడా నమోదు కాలేదు. నిధులు దుర్వినియోగం చేసే అవకాశం ఈ వ్యవస్థ ద్వారా అసలు లేనే లేదు.

డిసెంబర్ 7, 2009 న త్రిచూర్ జిల్లా 'అదత్' గ్రామ పంచాయితీని సర్పంచ్‌లు సందర్శించిన సమయంలో ఈ దిగువ విషయాలు అవగాహన చేసుకోవడమైనది. ఇక్కడ గ్రామసర్పంచ్‌గా అనిల్‌లక్ష్మార్ ఉన్నారు. ఈ గ్రామ జనాభా 40,000 మంది, 17 వార్డులు, 5 రెవెన్యూ గ్రామాలు ఉన్నాయి. ఇక్కడ 1) పారిశుద్ధ్యం 2) గృహనిర్మాణం 3) మంచినీటి సరఫరా 4) డంపింగ్ యార్డుల నిర్వహణ మొదలైన విషయాలను గమనించడం జరిగినది.

***పారిశుద్ధ్యం :*** ఈ గ్రామంలో పారిశుద్ధ్యం మీద గ్రామ ప్రజలు చైతన్యవంతులైయున్నారు. ఎక్కడా బహిరంగ మల విసర్జన కనపడలేదు. డ్రైనేజీ వ్యవస్థ శుభ్రముగానే ఉన్నది. చెత్త, చెదారం గ్రామపంచాయితీ సేకరిస్తున్నది. ఆరోగ్య సూత్రాలు ప్రజలు పాటిస్తున్నారు.

***గృహనిర్మాణం :*** గ్రామసభ ద్వారా లబ్ధిదారులను ఎంపిక చేసి, బిల్లులను పంచాయితీయే చెల్లిస్తున్నది. ఇక్కడ గృహనిర్మాణాలకు ఆర్థిక పరిస్థితులను బట్టి, ప్రాంతాలను బట్టి, వ్యక్తుల ప్రత్యేక పరిస్థితులను బట్టి యూనిట్ విలువలు మారుతున్నవి. ప్రతీ ఇంటిని 400 చ.అ. పరిధిలోనే నిర్మించుకోవాలి. ఎస్.సి., ఎస్.టి.లకు ఒక లక్ష రూపాయల నుండి రూ. 1,25,000 ల వరకు పంచాయితీ చెల్లిస్తుంది. ఇతర వర్గాల వారి కి రూ. 35,000/ వరకు మాత్రమే చెల్లిస్తున్నది. దీని వలన ప్రతీ ఒక్కరు గృహాలు నిర్మించుకోటానికి ఆసక్తి చూపుతున్నారు.

***మంచినీటి సరఫరా :*** ఇక్కడ ప్రజలకు శుద్ధి చేసిన మంచినీటిని పంచాయితీ 24 గంటలు సరఫరా చేస్తున్నది. పబ్లిక్ కుళాయికి రూ. 1,750 లు చెల్లించాలి. ఆ తరువాత ఇక ఏ విధమైన నీటి పన్నును చెల్లించవలసిన అవసరం లేదు. ఎస్.సిలకు పూర్తిగా ఉచితం. క్రమం తప్పకుండా ఒ.హెచ్.ఆర్. క్లోరినేషన్ జరుగుతున్నది. ఇక్కడ ప్రజలు నీటిని పొదుపుగా వాడుతున్నారు.

***డంపింగ్ యార్డు నిర్వహణ :*** ఈ గ్రామంలో చెత్తను సేకరించి, గ్రామ శివారులో రేకుల షెడ్డు నిర్మించి, అందులో నిల్వచేస్తున్నారు. అది సేంద్రియ ఎరువుగా మారటం వలన, రైతులకు పంచాయితీ ద్వారా అమ్మకం జరిపి, ఆదాయం సమకూర్చుకుంటున్నారు. చెత్త సేకరణ, యార్డు నిర్వహణకు, సిబ్బందికి మొత్తం నెలకు 20,000 వరకు పంచాయితీ చెల్లిస్తుంది.

డిసెంబర్ 8, 2009 న త్రిచూర్ జిల్లా 'తాయ్‌కడ్' గ్రామాన్ని సందర్శించినపుడు 'కుటుంబశ్రీ' పథకం అమలు గురించి గ్రామసర్పంచ్ సురేష్ సమక్షంలో ఈ దిగువ విషయాలు అవగాహన చేసుకున్నాం.

కుటుంబశ్రీ పథకంలో పూర్తిగా మహిళలకు ఆర్థికసాధికారత, ఆర్థిక స్వావలంబన కలిగించే ఉద్దేశ్యంతో మహిళలతో 22 స్వయం సహాయక సంఘాలు ఏర్పాటు చేస్తున్నారు. ఈ గ్రామంలో ఈ తరహా గ్రూపులు 86 ఉన్నాయి. వారానికి రూ. 10 చొప్పున బ్యాంకులలో పొదుపుచేసి, బ్యాంకుల ద్వారా ఋణాలు తీసుకొని, చిన్న చిన్న వ్యాపారాలు చేసి ఆర్థిక పరిపుష్టి సాధిస్తున్నారు. ఈ ఋణంలో సబ్సిడీ క్రింద 50% బ్లాక్ పంచాయతీ ద్వారా లభిస్తుంది.

### ఇళ్ళ స్థలాలు

ఇళ్ళ స్థలంలోని నిరుపేదలకు 2 సెంట్ల భూమిని పంచాయితీ కొనుగోలు చేసి ఇస్తుంది. ఈ స్థలం లబ్ధిదారుడు నచ్చిన ప్రదేశంలో తీసుకోవచ్చు. అన్ని స్థలాలు ఒకే చోట ఉండాలనే నిబంధన ఇక్కడలేదు.

### పెన్షను

వివిధ రకాలైన సామాజిక పెన్షన్లు రూ.250/-వరకు ఇక్కడ ఇస్తున్నారు.

### ఆరోగ్యం

కేరళ రాష్ట్రంలో పౌరులకు అనారోగ్యానికి వైద్యం ఖర్చుల క్రింద ప్రభుత్వం సంవత్సరానికి రూ. 7,00,000 భరించే విధంగా 'హెల్త్ పాల సీ' ఇవ్వటం జరుగుతుంది. అనారోగ్యం, అత్యవసర సమయాలలో ఉచిత అంబులెన్సులు 1280 ద్వారా ప్రజలకు అందుబాటులో ఉంటున్నాయి.

### స్టాండింగ్ కమిటీలు

పంచాయితీ పరిధిలో అన్ని కీలకశాఖలకు స్టాండింగ్ కమిటీలు ఏర్పాటు చేయటం జరిగింది. ముఖ్యంగా ఫైనాన్స్ కమిటీకి ఉపసర్పంచ్ చైర్మన్‌గా వ్యవహరిస్తాడు. మిగిలిన కమిటీలకు వార్డు మెంబర్లు ఛైర్మన్‌గా, సంబంధిత శాఖ అధికారి కన్వీనర్‌గా, సంబంధిత శాఖకు సంబంధించి అనుభవజ్ఞుడైన నిపుణుడు, వివిధ రకాల ప్రజలు ఈ కమిటీలలో సభ్యులుగా ఉంటారు. ఈ కమిటీలలో ప్రజా భాగస్వామ్యం తప్పక ఉంటుంది. ఈ వ్యవస్థలో సర్పంచ్ మొదలు వార్డు మెంబర్ల వరకు తమ పూర్తి సమయాన్ని వెచ్చించి ప్రజావిశ్వాసం పొందేందుకు కృషి చేయాలి. లేని యెడల ప్రజలు గ్రామసభ ఏర్పాటు చేసి వార్డు మెంబరు మీద అవిశ్వాసం ప్రకటించి పదవి నుండి తొలగిస్తారు.

### ముగింపు

కేరళ రాష్ట్రంలో గ్రామపంచాయితీ వ్యవస్థ పూర్తిగా ప్రజలకు అందుబాటులో ఉంటుంది. ఇక్కడ నిధులు, ఆదాయం, వ్యయం అంతా పారదర్శకంగా ఉండటం వలన అవినీతికి ఆస్కారం లేదు. ప్రజాప్రతినిధులు తమ పూర్తి సమయాన్ని పనిచేయటానికి ఉపయోగించటం వలన వారి కుటుంబ పోషణకు ప్రభుత్వం గౌరవ వేతనాలు చెల్లిస్తున్నది. గ్రామసర్పంచ్ ఆధీనంలో నిధులు, సిబ్బంది, కార్యాలయం పనిచేయటం వలన నిత్యం ప్రజలకు అందుబాటులో ఉంటున్నారు. మన రాష్ట్రంలో అధికారాలు, నిధులు, విధులు, కేవలం కాగితాల మీదనే కానీ, వాస్తవంగా ఇవ్వకపోవడం వలన ఇక్కడ పంచాయితీ వ్యవస్థ తీవ్ర ఒడిదుడుకులకు గురి అవుతుంది. కేరళ రాష్ట్ర ప్రభుత్వం తమ అధికారాలు వదులుకొని పూర్తిగా స్థానిక సంస్థలకే అప్పగించటం ద్వారా ప్రజాస్వామ్య పరిమళ కుసుమాలు అక్కడ వికసిస్తున్నాయి.

***– వి.వి. సత్యనారాయణ,***
*మునిపల్లి సర్పంచ్,*
*నిడదవోలు మండలం, పశ్చిమగోదావరి జిల్లా.*

# కర్నాటకలోని అభివృద్ధి గ్రామాల అధ్యయన పర్యటన

**హైదరాబాద్‌లోని, అపార్డు రాష్ట్రంలోని విస్తరణ శిక్షణా కేంద్రాల ద్వారా పంచాయతీరాజ్ ప్రజా ప్రతినిధులను అనగా సర్పంచ్‌లు, మండలాధ్యక్షులను మహారాష్ట్ర, కేరళ, కర్నాటక రాష్ట్రాలలోని ఉత్తమ అవార్డు గ్రామాల సందర్శన కార్యక్రమం చేపట్టింది.**

అందులో భాగంగా ఇ.టి.సి. బాపట్ల ఆధ్వర్యంలో కృష్ణా (14) గుంటూరు (19) ప్రకాశం (14) నెల్లూరు (15) జిల్లాల, మండల ప్రజాపరిషత్ అధ్యక్షులను జనవరి 28 నుండి ఫిబ్రవరి 1, 2010 కర్నాటక రాష్ట్రంలోని మైసూర్ జిల్లా హెచ్.డి. కోట తాలూకాలోని సాగరే గ్రామ పంచాయతీ సందర్శనకు పంపారు. బాపట్ల ఇ.టి.సి. ప్రిన్సిపాల్ శ్రీ బి. ఆశీర్వాదం నాయకత్వంలో ఈ అధ్యయన కార్యక్రమాన్ని చేపట్టారు. అధ్యయన బృందం జనవరి, 28 బయలుదేరి దారిలో చిత్తూరు జిల్లా కాణిపాకం ఆలయం సందర్శించి మైసూరు జిల్లాలోని సాగర్‌కు చేరింది. ఉత్తమ నిర్మల్ పురస్కారం అవార్డు అందుకున్న ఈ గ్రామ సర్పంచ్ శ్రీ జోగయ్య, పంచాయితీ కార్యదర్శి శ్రీ కృష్ణ మూర్తి అందించిన వివరాలు, జిల్లా పంచాయితీ అధ్యక్షులు దర్మేంద్ర, జిల్లా పంచాయతీ అధికారులు చేపట్టిన కార్యక్రమాలు, ప్రజలను చైతన్యం చేసిన విధానాలు, పంచాయితీలో చేపట్టిన కార్యక్రమాలను తెలుసుకోవటం జరిగింది. నిర్మల్ పురస్కారం అందుకున్నా ఈ గ్రామం వివరాలు ఈ విధంగా ఉన్నాయి.

14130 కుటుంబాలతో నాలుగు గ్రామాలున్న ఈ పంచాయతీలో రోడ్లన్నీ సిమెంట్ రోడ్లుగా మార్చారు. గ్రామంలో ఒక పెద్ద వాటర్ ట్యాంక్‌తో పాటు రెండు మినీ వాటర్ ట్యాంక్‌లతో నీటి సమస్యను నివారించారు. గ్రామ సమీపంలోని డ్యామ్ ఉండటంతో 2400 ఎకరాలకు పుష్కలంగా నీరు అందుతోంది. పరిసరాలు ప్రకృతి శోభతో శోభాయమానంగా ఉన్నాయి. హైస్కూలుతో పాటు నాలుగు ప్రాథమిక పాఠశాలలు ఉండటంతో, పిల్లలందరూ పాఠశాలలో చేరి నిరాటంకంగా చదువుకుంటున్నారు. ప్రభుత్వం సువర్ణయోజన క్రింద ఆసుపత్రిని నిర్మించి వైద్య సేవలు మెరుగుపర్చింది. ఇంటి పన్ను, తదితర పన్నులు వసూళ్ళలో రూ. 1,31,942/- డిమాండ్ ఉంటే 100% ఇంటి పన్ను వసూలు కాగా, ప్రభుత్వ పరంగా 12వ ఫైనాన్స్ కమీషన్ క్రింద రూ. 2.40 లక్షలు, ఎన్.ఆర్.ఇ.జి.యస్. క్రింద రూ. 70.70 లక్షలు, గ్రామ స్వరాజ్ యోజన క్రింద రూ. 10 లక్షలు రావటంలో గ్రామాభివృద్ధిని చేపట్టారు. అంచెలంచెలుగా అభివృద్ధికి చేరువవవుతున్న ఈ పంచాయతీని జిల్లా పంచాయితీ అధికారులు ప్రోత్సహించి నిర్మల్ పురస్కారం వైపు నడిపించారు. ఈ ప్రోత్సాహంతో గ్రామంలోని 14 మంది వార్డు సభ్యులు, గ్రామ ప్రజలు, స్థానిక స్వచ్ఛంధ సంస్థల సహకారంతో పాఠశాల, విద్యార్థులతో కలసి, గ్రామంలో మరుగుదొడ్ల ఆవశ్యకతను వివరిస్తు ప్రచారం మొదలెట్టారు. తద్వారా గ్రామ ప్రజలు చైతన్యమై 2500 మరుగుదొడ్ల నిర్మాణానికి శ్రీకారం చుట్టారు. గ్రామ మంతా మరుగుదొడ్ల వినియోగంపై ఆసక్తి చూపారు. గ్రామ ఐక్యతను, సాధించిన అభివృద్ధిని ప్రశంసిస్తూ కర్నాటక ప్రభుత్వం 2007-2008 సంవత్సరానికి నిర్మల్ పురస్కార్ అవార్డు ప్రకటించింది.




ఈ అవార్డుతో సాగర్ గ్రామం కర్నాటక రాష్ట్రంలో వార్తల్లోకి ఎక్కింది. నేడు ఇతర గ్రామాలకు ఆదర్శ వంతంగా మారింది, డ్రైనేజి అభివృద్ధితో పారిశుద్ధ్యం సమస్యలను అధిగమించిన గ్రామం నేడు ఆంధ్రప్రదేశ్‌లోని 4 జిల్లాల మండలాధ్యక్షులకు స్ఫూర్తినిచ్చింది.

అక్కడ వార్డు సభ్యులు, ప్రజలు గ్రామ సభ ద్వారా పనులను నిర్ణయించడం, గ్రాంట్లు వచ్చినప్పుడు టెండర్ల ద్వారా పనులు చేపట్టడం ఇందిరా ఆవాస్ యోజన ద్వారా గృహ నిర్మాణం, డబ్ల్యు.ఆర్.జి.యస్. ద్వారా బి.పి.ఎల్. జాబితాలో నున్న 1184 కుటుంబాలను అభివృద్ధి చేయటంతో, గ్రామంలోని వారంతా సమైక్యంగా నిర్ణయాలు తీసుకోవటంతో గ్రామం ఈ అభివృద్ధిని సాధించింది. వీధి దీపాలు, పారిశుద్ధ్యం, రోడ్లు, డ్రైనేజి, మంచినీరు, మరుగుదొడ్ల నిర్మాణం, వ్యవసాయం, తదితర రంగాల్లో అభివృద్ధిని సాధించిన ఈ గ్రామాన్ని 4 జిల్లాల మండలాధ్యక్షులు వీధుల్లో తిరిగి సందర్శించారు. తమ గ్రామాలను ఇంతకంటే బాగా అభివృద్ధి చేస్తామని ధీమాను ప్రకటించిన మన ప్రజా ప్రతినిధులు ఆ గ్రామంలో జిల్లా పంచాయతీ వారికి అభినందనలు తెలుపుతూ, తిరుగుప్రయాణాన్ని ప్రారంభించారు. జనవరి 30న తిరుగు ప్రయాణంలో మైసూరు జిల్లా కేంద్రంలో బస చేసి 31 వ తేదీన చారిత్రక, పాలన ఆధారాలున్న ప్రపంచంలో చెప్పుకోదగ్గ మహారాజు వారి ప్యాలెస్ అయిన మైసూర్ ప్యాలెస్ సందర్శించారు.

**ఎ.వై. శివ,** ఎం.ఏ.
డి.ఆర్.పి. - ట్రైనింగ్ సెల్,
జెడ్.పి.పి.- యస్.పి.యస్.ఆర్. నెల్లూరు జిల్లా.

# దేశ గౌరవాన్ని నిలబెట్టిన క్రీడా కారిణులకు వందనం

క్రీడా రంగంలో చిన్నా, పెద్దా అనేక దేశాల కంటే భారతదేశం బాగా వెనుకబడి ఉండటానికి కారణం ఏమిటి? 100 కోట్లకు పైగా జనాభా ఉన్న మన దేశంలో ప్రపంచ స్థాయి ఆటగాళ్లు కొద్దిమంది కూడా లేకపోవటానికి కారణం ఏమిటి? అట్లాస్‌లో ఒక చిన్న చుక్క మాదిరిగా కనపడే చిన్నచిన్న దేశాలు క్రీడారంగంలో ఒక పక్క ఎంతో మెరుగైన ప్రతిభ కనబరుస్తుండగా, మనదేశానికి ఈ దుస్థితి పట్టడానికి కారణం ఏమిటి?

ఈ ప్రశ్నలు మనలో తరచూ తలెత్తుతుంటాయి. ఏ ఒలింపిక్స్‌లోనో, ఆసియా క్రీడల్లోనో భారతదేశ క్రీడా బృందాలు మంచి ఆటతీరు కనబరచక పోయినప్పుడల్లా ఈ ప్రశ్నలు అటు క్రీడాకారులను, కోచ్‌లను, క్రీడా సంస్థలు, విభాగాల యాజమాన్యాలను, ఇటు ప్రజలను వేధిస్తూనే ఉంటాయి. మది తొలుస్తూనే ఉంటాయి.

క్రికెట్‌ను మినహాయిస్తే, చదరంగం వంటి క్రీడల్లో అప్పుడప్పుడు తప్ప, మిగిలిన క్రీడల్లో మనం గొప్పలు చెప్పుకోవడానికి ఏమీ లేదు. గర్వపడేది ఏమీ లేదు. క్రికెట్‌లో అయితే, టీమ్ ఇండియా అగ్రస్థానాన కొనసాగుతోంది. ఇకపోతే, పైన పేర్కొన్న ప్రశ్నలు, విమర్శనాస్త్రాలు నిజమో, కాదో చర్చించుకోవలసి ఉంది.

అయితే, ఒక దృఢమైన ఆశావాదిగా, ఈ వ్యాస రచయిత మాత్రం మన క్రీడారంగ పరిస్థితి అంత నిరాశాజనకంగా లేదని భావిస్తున్నాడు. అవకాశాలుకూడా ఇదివరకటి అంత హీనంగా లేవని అన్పిస్తోంది.

ఈ మార్చి నెలలో 8వ తేదీన ప్రపంచం అంతర్జాతీయ మహిళా దినోత్సవంగా జరుపుకుంటున్నది. ఈ సందర్భంగా మనం ఒక విషయాన్ని గుర్తుంచుకోవాలి. పురుష క్రీడాకారులు ఆయా అంతర్జాతీయ క్రీడా పోటీల్లో డీలా పడినప్పటికీ, పి.టి ఉష, మన తెలుగింటి ఆడపడుచు కరణం మల్లీశ్వరి వంటి మహిళా క్రీడాకారిణులు మన దేశ గౌరవాన్ని నిలబెట్టారు. ఈ అంతర్జాతీయ మహిళా దినోత్సవం సందర్భంగా మహిళా క్రీడా కారిణులు క్రీడారంగానికి చేసిన సేవలను ఒకసారి స్మరించుకోవటం అవసరం.

కరణం మల్లీశ్వరి పేరుతో ఒక అద్భుత క్రీడాకారిణి ఉందనే వాస్తవాన్ని సగటు భారతీయులు చాలా రోజులు గుర్తించలేదు. ఊసవానిపేటకు చెందిన కరణం మల్లీశ్వరి అనే మట్టిలో మాణిక్యం 2000లో జరిగిన సిడ్నీ ఒలింపిక్స్‌లో రికార్డు స్థాయిలో బరువు ఎత్తి (69కిలోల విభాగం) దేశం పరువు నిలిపింది. తను కాంస్యపతకం గెలుచుకుంది. ఒలింపిక్స్‌లో ఒక పతకం అంటూ మొదటిసారి వచ్చింది స్త్రీ పురుష క్రీడాకారుల్లో కరణం మల్లీశ్వరికే.

అంతకుముందు థాయిలాండ్‌లో జరిగిన ఆసియా క్రీడల్లోనూ, ఇతర సందర్భాల్లోనూ ఆమె గెలిచిన పతకాలు, ప్రపంచస్థాయి







ఛాంపియన్ షిప్‌లు అంతగా ప్రజల దృష్టిని ఆకర్షించలేదు. కరణం మల్లీశ్వరి పేరు కూడా అంతగా మారుమోగిపోలేదు.

1984లో లాస్ ఏంజెల్స్‌లో జరిగిన ఒలింపిక్స్‌లో 'పయ్యోలి ఎక్స్‌ప్రెస్' పి.టి.ఉష కనపరిచిన ప్రతిభే భారతదేశానికి కొంతయినా పరువు మిగిల్చింది. అర క్షణంలో ఆమెకు కాంస్య పతకం తప్పిపోయింది.

వింబుల్డన్‌లో గర్ల్స్ టైటిల్ గెలుచుకుని, 2009లో ఆస్ట్రేలియన్ ఓపెన్‌లో మిక్స్‌డ్ డబుల్స్ టైటిల్ గెలుచుకున్న సానియామీర్జా గత ఐదేళ్లుగా అనేక విజయాలు సాధించటం ద్వారా యువతకు స్ఫూర్తిదాయకంగా నిలిచింది.

రెండుసార్లు ఒలింపిక్స్ పరుగు పందేలలో పాల్గొన్న సత్తి గీత, మల్లీశ్వరి రికార్డును మెరుగుపరిచిన పూజారి శైలజ రాష్ట్రానికి గర్వకారణంగా నిలిచారు. అయితే, మాదక ద్రవ్యాలు వాడిందన్న ఆరోపణలపై, పెద్ద వివాదం చెలరేగి పూజారి శైలజ కెరీర్‌ను బాగా దెబ్బతీసింది. సత్తిగీత క్రమబద్ధమైన ఆటతీరు కనబరుస్తూ, ఏథెన్స్, బీజింగ్‌లలో జరిగిన ఒలింపిక్స్‌లలో భారతదేశానికి ప్రాతినిథ్యం వహించింది. ఒలింపిక్స్‌లో 4×400 మీటర్ల మహిళల రిలే టీమ్‌లో ఆమె భాగంగా ఉంది. అయితే, గీత సాధించిన విజయాలకు పెద్దగా గుర్తింపు లభించకపోవటం బాధాకరం. ఆమెకు అర్జున అవార్డు కానీ, పద్మశ్రీ కాని రాలేదు.




గీతకు అర్జున అవార్డు వచ్చి ఉండాల్సిందని పుల్లెల గోపిచంద్ వ్యాఖ్యానించటం ప్రజాభిప్రాయాన్ని వ్యక్తం చేయుటవే. పశ్చిమగోదావరి జిల్లా మార్టేరుకు చెందిన గీత ఆసియాలో జరిగిన పోటీలలో అనేక మెడల్స్ సాధించింది.

ఇటీవలి కాలంలో అంతర్జాతీయ బ్యాడ్మింటన్ టోర్నమెంట్లలో సైనా నెహ్వాల్, గుత్తా జ్వాల అద్భుతంగా ఆడుతూ దేశ పతకాన్ని సమున్నతంగా నిలుపుతున్నారు. సూపర్ సిరీస్ ఛాంపియన్ షిప్‌ను గెలుచుకునే మొదటి భారతీయురాలి హోదా తృటిలో తప్పిపోయిన సైనా నెహ్వాల్‌కు ఇంకా టీనేజ్‌లో ఉండగానే అర్జున అవార్డు, పద్మశ్రీ అవార్డు దక్కటం ముదావహం.

మెదడు క్రీడ అయిన చదరంగంలో అంతర్జాతీయ పోటీల్లో కోనేరు హంపి, ద్రోణవల్లి హారిక సంచలనాలు సృష్టిస్తున్నారు. ప్రజాదరణ, కీర్తి ప్రతిష్టల విషయానికి వస్తే, విశ్వనాథన్ ఆనంద్ తరువాత స్థానాలు వీరివే.

అంతర్జాతీయంగా క్రీడారంగంలో వివిధ క్రీడల్లో భారతదేశం అగ్రభాగాన నిలబడక పోవటానికి కారణం మన వాళ్లకి ప్రతిభ లేకపోవటం కాదనేది అందరికీ తెలిసిన విషయమే. ప్రతిభకు సరైన ప్రోత్సాహం లభించకపోవటం, నిర్వాహకుల రాజకీయాలు, క్రీడా





సంస్థల రాజకీయాలు, తగిన మౌలిక సదుపాయాలు లేకపోవటం ఈ దుస్థితికి కారణం.

ఎక్కడైతే మనసుంటుందో, అక్కడ మార్గముంటుందని సామెత. క్రీడా రంగానికి వస్తే, ఈ సామెతను రుజువు పరిచే ఉదాహరణలు మన కళ్ల ముందే ఉన్నాయి. శ్రీకాకుళం జిల్లాలోని ఊసవానిపేట, ఆమదాల వలస ఇందుకు నిదర్శనాలు. ఛాంపియన్ వెయిట్ లిఫ్టర్లను తయారు చేయటంలో ఇవి వర్క్‌షాప్‌లుగా ప్రసిద్ధి పొందాయి. ఈ ప్రదేశాలు తయారు చేసిన క్రీడాకారుల జాబితా పెద్దదే. కరణం మల్లీశ్వరి, పూజారి శైలజ, కరణం నరసమ్మ, నీలంశెట్టి కృష్ణవేణి, కొత్తకోట రమాదేవి వంటి క్రీడాకారులందరినీ ఈ వర్క్‌షాప్‌లే తయారు చేశాయి.

కరణం మల్లీశ్వరి, పూజారి శైలాజ వంటి వారు అత్యున్నత స్థాయి శిక్షణా కేంద్రాలు, అకాడమీలు, కోచ్‌ల దగ్గర శిక్షణ పొందలేదనే విషయాన్ని మనం గుర్తుంచుకోవాలి. అంతేకాదు. వారు ధనిక కుటుంబాలకు చెందిన వారు కూడా కాదు. అయితే, పట్టుదలకు మారుపేరైన ఈ మహిళలు నిరంతర సాధనలో ఛాంపియన్లుగా అవతరించి రాష్ట్రానికి, దేశానికి పేరు తెచ్చి పెట్టారు.

అక్కడి పశువుల శాలలు రెండు రకాల ప్రయోజనాలను నెరవేర్చాయి. పశువులకు నీడనివ్వటంతో పాటు, అంతంత మాత్రపు పరికరాలతో సాధన చేస్తున్న ఈ బాలికలకు ట్రెయినింగ్ సెంటర్లుగా కూడా ఉపయోగపడ్డాయి.

ఈ సమస్యలు, లోటుపాట్లు, కొరతలు ఆ బాలికల ధైర్యాన్ని, స్థైర్యాన్ని, పట్టుదలను ఏ మాత్రం తగ్గించలేదు. వారి కోచ్‌లు కూడా ఇందులో వెనుకంజ వేయలేదు.

వెయిట్ లిఫ్టింగ్‌లో అనేకమంది బాలురు, బాలికలు శ్రీకాకుళం జిల్లానుంచి బయటకు వస్తూనే ఉన్నారు. ఇదే ప్రాంతం నుంచి వెయిట్ లిఫ్టింగ్‌లో మెరిసిన మరో తార, బడేటి తేజస్విని నాయుడు.








అనేక ఆటంకాలను చేధించి ఈమె ఉన్నత స్థానానికి ఎగబాకింది. మొదటిసారి విదేశాలకు వెళ్లినప్పుడే ఈమెకు కాలు విరిగింది. అయినా తేజస్విని వెనుకంజ వేయలేదు.

ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లు, కామన్ వెల్త్ క్రీడలు, ఆసియా క్రీడల స్థాయిలో తేజస్విని అనేక విజయాలు సాధించింది. ఆమె సాధించిన రికార్డులు, అవార్డులు ఎన్నో ఉన్నాయి. అయితే, ఉద్యోగం రూపంలో స్పాన్సర్‌షిప్ రూపంలో ఆమెకు ఇంకా తగిన గుర్తింపు లభించలేదు.

అన్ని రంగాల్లో వెనుకబడిన జిల్లా అయిన శ్రీకాకుళం జిల్లా అనేక ఆటంకాలను అధిగమిస్తూ, క్రీడారంగంలో ముందంజలో ఉండి, దేశానికి, రాష్ట్రానికి పేరు తెస్తుండటం పత్రికల్లో ప్రముఖంగా వచ్చింది. వెయిట్ లిఫ్టింగ్‌లో మనకు విజయాలను అందించి మహిళా క్రీడా కారులను తీర్చిదిద్దటంంలో వారి కోచ్‌ల పాత్ర మరవలేనిది. ప్రశంసా పాత్రమైనది. ప్రత్యేకించి నీలంశెట్టి అప్పన్న, అమ్మి నాయుడుల పాత్ర చెప్పుకోదగ్గది. అప్పన్న, అమ్మి నాయుడుల వద్ద చిన్నతనం లోనే శిక్షణ పొందిన కరణం మల్లీశ్వరి తరువాతి కాలంలో సాధించిన విజయాల గురించి మనకు తెలుసు.

తగిన మౌలిక సదుపాయాలు, పరికరాలు లేకపోయినా, సంబంధిత వర్గాలు, సంస్థలు నిర్లిప్తత కనబరుస్తున్నా, వీరు తమ కర్తవ్యాన్ని బ్రహ్మాండంగా నెరవేర్చారు. అయితే, వీరు పోషించిన పాత్రకు తగిన గురిర్తింపు లేదు. ఒక వేళ ఏదైనా ఉన్నప్పటికీ వారి సేవలకు తగిన విధంగా మాత్రం లేదనే చెప్పాలి.

వివిధ క్రీడలు, ఆటల్లో పురుష క్రీడాకారులు కనబరిచిన ప్రతిభకు, సాధించిన విజయాలను ఇక్కడ పేర్కొనలేదు. ఆఖరికి వెయిట్ లిఫ్టింగ్‌తో సహా. అందుకు కారణం అంతర్జాతీయ మహిళాదినోత్సవం సందర్భంగా, ఈ వ్యాసాన్ని మహిళా క్రీడాకారులకు అంకితం చేయటమే. రానున్న సంవత్సరాల్లో రాష్ట్రానికి చెందిన క్రీడాకారులు మరిన్ని నూతన, ఉన్నతమైన శిఖరాలను అధిరోహిస్తారని ఆశిద్దాం.

– దాసు కేశవ రావు

(అనువాదం : వై. సరోజ)



**చైత్ర వైశాఖములు వసంత రుతువు**

**చెట్లు చిగిర్చి వూలు పూయును ....,**

**ప్రభవ విభవ..., చైత్రము వైశాఖము జ్యేష్ఠము, ఆషాడము, శ్రావణము... పాల్గుణము - యీ పన్నెండునూ తెలుగు నెలలకు పేర్లు".**



# మధుమాసోదయ మంగళ వేళ....

*- శ్రీరమణ*

ఇప్పుడు యాభైల్లో వున్నవారి బాల్యాన్ని యీ మాటలు జ్ఞప్తికి తెస్తాయి. చిన్నప్పటి ఆ అప్పగింతలు ఇప్పటికీ చెవుల్లో గింగురుమంటాయి.

శ్రీ విరోధి నామ సంవత్సరం వెళ్లిపోయి వికృతినామ సంవత్సరం కొత్త చిగుళ్ల తోరణాలలోంచి, కోయిల కుహు రాగాల మంగళవాద్యాల మధ్య నుంచి తెలుగు గుమ్మాల్లోకి విచ్చేసింది. నూతన సంవత్సరానికి చేతులొగ్గి మనసు విప్పి స్వాగతం పలకడానికి ఇంటిల్లీపాదీ సిద్ధంగా వున్నారు.

"మామిడి కొమ్మమీది కలమంత్ర పరాయణ స్వామి" యిప్పటికే గొంతు సవరించుకుని సర్వసిద్ధంగా వున్నాడు. పూచిన పూతలతో ప్రతి తరువూ ఒక దీప వృక్షంలా వెలిగిపోతోంది. ఇన్నాళ్లూ ఎక్కడెక్కడో పెత్తనాలు చేస్తున్న తుమ్మెదలు హడావిడిగా జనావాసాల మధ్య ఝుమ్మంటూ తిరుగుతున్నాయి. ప్రతి పువ్వు నిండైన మధుపాత్రలా తుమ్మెదలకు సమర్పించుకోడానికి రంగురంగుల సింగారింపులతో సిద్ధంగా వున్నాయి. పూలు పూశాయని వసంతం వచ్చిందా? వసంతం వచ్చిందని పూలు పూశాయా? ఏమైతే నేం? పూల పరిమళాలు, వర్ణశోభలు మాత్రం మనకే కదా!

కాలమానంలో చాంద్రమానం, సూర్యమానం అని రెండు విధాలు. సూర్య గమనాన్ని అనుసరించేవారు కొందరైతే, చంద్రగమనాన్ని అనుగమించేవారు కొందరు. మనది చాంద్రమానం. చైత్ర మాసంతోనే మన నూతన సంవత్సరం ఆరంభమై, పన్నెండు నెలలు పన్నెండు ఆకులుగా తిరిగి మళ్లీ కొత్త సంవత్సరంలో కొత్త ఆకు ఆవృత్తమవుతుంది. గ్రహ చలనాలు కాలాన్ని సృష్టిస్తాయి. అందుకే నవగ్రహాల ప్రభావం మన జీవితాలపై ప్రభావం చూపుతాయని మన జ్యోతిషశాస్త్రం చెబుతుంది.

మనకు కనిపించే కోట్లాది నక్షత్రాలను వూహామాత్రంగా వచ్చే వాటి స్వరూపాలను బట్టి మేషం, మకరం, కుంభం, మీనం అని పేర్లు పెట్టారు మన ఖగోళవేత్తలు. ఒక్కొక్క రాశిని నాలుగు పాదాలుగా విభజించారు. జన్మ నక్షత్రాన్ని బట్టి రాశిని, పాదాన్ని నిర్ణయిస్తారు. దానిని బట్టి జాతకాల ను గణిస్తారు.'

'ఇన్ని కోట్ల మంది కేవలం పన్నెండు రాశుల్లోకి వచ్చేస్తారా? ఇందరి జాతకాలు కేవలం 48 విధాలుగా మాత్రమే వుంటుందా?" అని





చాలా మందికి వచ్చే సందేహం. సందేహం వున్నప్పుడు సమాధానమూ వుంటుంది. అందులోనూ యుగయుగాలుగా ఇదొక శాస్త్రంగా జనం మధ్యకు వచ్చినపుడు కావల్సినంత పునాది ఏర్పడి వుంటుంది. దానిపై చర్చకు దిగితే దరి చేరడం దుర్లభం. ఇది కూడా ఒకలాంటి కౌన్సిలింగ్ అనుకుంటే మనసుకి హాయిగా వుంటుంది.

ఉగాది రోజు వేపపూత ప్రసాదం తినడం ఒక ఆచారం. జీవితం చేదు వగరు పులుపు తీపి ఉప్పుకారం - అన్ని రుచుల సమాహారం సుమా అని సూచనగా గుర్తు చేయడానికే అంటారు.

సంక్రాంతి కూడా ఖగోళానికి సంబంధించిన పర్వమే. సూర్యుడు మకరరాశిలోకి ప్రవేశించి, ఉత్తరాయణానికి బయలు దేరతాడు. ప్రత్యక్ష నారాయణుడైన సూర్యుని ఆరాధించే పండుగ సంక్రాంతి. అది కచ్చితంగా ఏటా జనవరి 13న వస్తుంది. ఇది అంటే ఉగాది కొంచెం అటూయిటూ కదుల్తుంది. చైత్రశుద్ధ పాడ్యమి నాడు తెలుగు సంవత్సరాది అవుతుంది. భూమి తన చుట్టూ తాను తిరుగుతూ సూర్యుని చుట్టూ తిరుగుతుంది. చంద్రుడు భూమి చుట్టూ పరిభ్రమిస్తాడు. దీనికి 27 రోజులు వ్యవధి పడుతుంది. తిథి, వార, నక్షత్రాలు, యోగం, కరణం అనే అయిదు విభాగాలు కలిస్తే అది 'పంచాంగం' అవుతుంది. ప్రత్యేక ప్రావీణ్యత గల పంచాంగకర్తలు వీటిని గణించి లిఖిస్తారు.

గ్రహ చలనాలను బట్టి సుముహూర్తాలను, దుర్ముహూర్తాలను నిర్ణయిస్తారు. గ్రహణాలు ఎప్పుడు వచ్చేది విఘడియలతో సహా నిర్దిష్టంగా చెబుతారు. ఉగాది నాడు 'పంచాంగ శ్రవణం' ఒక వుత్సాహం. గొప్ప వుత్కంఠ. ఇందులో ఆయా రాశులవారి సంవత్సర ఫలితాలు వుంటాయి. భవిష్యత్తు తెలుసుకోవాలని అందరికీ ఆకాంక్ష వుంటుంది. కాని అట్లా తెలిసిపోతే జీవితం ఎంత నిస్సారంగా వుంటుందో ఎవ్వరికీ తెలియదు. తను జూదంలో ఘోరంగా ఓడిపోతానని ధర్మరాజుకి ముందే తెలిస్తే -భారత కథే లేదు. కురుక్షేత్రంలో తను పరాజితుణ్ణి అవుతానని దుర్యోధనుడికి ముందే తెలిస్తే - భగవద్గీతే లేదు.

మన పంచాంగ శ్రవణంలో బోలెడు లౌక్యం వుంటుంది. అందరికీ ఆశాజనకంగానే వుంటుంది. నాలుగుచోట్ల పంచాంగం వినిపించినపుడు సమయం సందర్భం సదస్సులను మనసులో పట్టుకుని వినిపించాలి. లేకుంటే మరు సంవత్సరం వారికి మైకూ దొరకదు, సభా దొరకదు. రాజపూజ్యం సున్నా అవుతుంది. ఆదాయం, వ్యయం; రాజపూజ్యం, అవమానం యివి యీ సీజన్‌లో తెగ వినిపిస్తాయి. ఈ సారి ఆదాయం కంటే వ్యయం ప్రతివారికీ అధికంగానే వుండాలి. రాజపూజ్యం, అవమానం కూడా అంతే, మునుపు రాజపూజ్యానికి ప్రచారం వుండేది. అవమానానికి అంతగా వుండేది కాదు. ఇప్పుడు పదహారు దారులు వచ్చి, నట్టింట్లో వార్తలు కనిపిస్తున్నాయి. ఎక్కడ కారుకూత వినిపించినా, చెంప ఛెళ్లుమన్నా దాని ప్రతిధ్వని ప్రత్యక్ష ప్రసారమై ఇంటింటా వినిపిస్తోంది. కనిపిస్తోంది. కాబట్టి అంతా జాగ్రత్తగా వుండాలి. ఇప్పుడు ఎవరు ఎందుకు



ఎట్లా వార్తల్లోకి ఎక్కుతారో తెలియదు.

అసలు ఒక్కమాట చెబుతాను. మన మేధావులు ఆలోచించాలి. కాలంతో బాటు నాగరికత, సంస్కృతి, భాష మారాయి. వాటిని బట్టి



పంచాంగ భాషని, అన్వయాలను నవీకరించాల్సిన అవసరం ఎంతైనా వుంది. ఈ కాలపట్టికల్ని పునర్మూల్యాంకన (తప్పులుంటే సరి చేసుకోండి) చేయాల్సిన సమయం ఆసన్నమైంది. ఫ్యూడలిస్టు అవశేషాలను సమూలంగా పంచాంగాల నుంచి తొలగించాలి. రాజే లేనప్పుడు రాజపూజ్యం ఎక్కడ? మానాభిమానాలే కొరవైన తరుణంలో అవమానం ఎక్కడ? ఆదాయానికి అర్థం మారినప్పుడు గణాంకాలను మార్చాలి కదా.

మీ పాల వాడికి నాలుగు లీటర్లు పాలిచ్చే ఆవు వుంది. కాని ఆరు లీటర్ల పాలు అమ్ముతాడు. ఒక అధికారికి నెలకు పాతిక వేలు జీతం వస్తుంది. వాళ్ల ఖర్చు నలభై వేల పై మాటే. ఈ లీలలకు అర్థాలు వెదక్కండి.

వాటిలోకి తొంగి చూడకండి. అవినీతి పెద్దమాట కాబట్టి అవసరం అని సరిపెట్టుకుంటే సరి.

జ్యోతిష్యం యింత పెద్ద వ్యాపారం అవుతుందని ఎవరు వూహించారు. భవిష్యత్ వాణి మీద ఒక్క మన రాష్ట్రంలోనే ఏటా పదకొండువందల పన్నెండు కోట్ల రూపాయల వ్యాపారం జరుగుతోందని ఒక చిత్తు అంచనా. జ్యోతిషం అన్నది ఒక మౌలిక అంశం. దాని ఆధారిత అనుబంధ వ్యాపారాలు ఎన్నో? గ్రహ దోష నివారణోపాయాలు వారి వారి స్థాయిని బట్టి వుంటాయి. ఆశ్రయించే గురువుల్ని బట్టి వుంటాయి. తాయిత్తు నుంచి నవరత్న హారాల దాకా; పూజల నుంచి ఆలయ ప్రతిష్టదాకా- వీటికే ఆకాశమే హద్దు. ఒకప్పుడు పంచభూతాలు అందరికీ వుచితంగా సముచితంగా లభించేవి. ఇప్పుడు నీరు, నిప్పు, గాలి, ఆకాశం, నేల అన్నింటినీ కొనుక్కోవలసిందే కదా. ఆకాశాన్ని కొనుక్కోవడమేమిటని అనుకుంటున్నారా? వేలాది ఉపగ్రహాలు రోదసిలో తిరుగుతూ మనిషికి రకరకాల సేవలు అందిస్తున్నాయి. వాటన్నిటికీ మనం అద్దె రూపంలో మూల్యం చెల్లిస్తున్నాం. మన సెల్‌ఫోను, అంతర్జాలం (ఇంటర్‌నెట్), టివి డిష్ అన్నీ చెల్లింపులతోనే కదా సాధ్యం. గాలి, వెలుతురు ఎప్పటినుంచో కొనుక్కుంటున్నాం. నీరు, నేల సరేసరి.

పంచభూతాలకు దీటుగా మరో కొత్త భూతం జాబితాలో చేరింది. అదే ఇంధన భూతం. పెట్రోలు, డీజిల్, సహజవాయువు ఇత్యాదులు. మనం పీల్చేగాలి లేకపోయినా జీవించగలం కాని వంటగ్యాస్ లేకుంటే బతకలేం. అలాగే గతంలో నవగ్రహాలు మాత్రమే వుండేవి. ఇప్పుడు కృత్రిమ గ్రహాలు ఎన్నో వాటితో బాటు చరిస్తున్నాయి. అంటే ఉపరితలంలో వాస్తు మారింది. ఈ విధంగా యిటీవల కాలంలో చాలా పెను మార్పులు వచ్చాయి. ఇంకా రానున్నాయి. అందుకని మన పంచాంగాలను 'అప్‌డేట్' చేసి తిరిగి రాయాల్సిన చారిత్రక అవసరం వుంది.



ఫలితాల్లో కూడా ఆదాయ వ్యయాలతో బాటు భద్రత, అభద్రత, నీతి, అవినీతి, జయం, అపజయం లాంటి మరికొన్ని ముఖ్యాంశాలను చేర్చి వాటికి కూడా స్కోరు నిర్ణయించాల్సిన అవసరం వుంది. ఒక్క విషయానికి నాకు ఆనందంగా వుంటుంది. పంచాంగంలో యిప్పటికీ చాలా తెలుగు మాటలు కనిపిస్తాయి. తెలుగు నెలలు, వారాలు, తిథులు, నక్షత్రాలు, ఘడియ, విఘడియ యిలాగ ఎన్నో...? అందుకే పంచాంగమంటే నాకు గౌరవం. నాకు యిష్టం. పైగా నాలుగు మంచి మాటలతో పెద్దదిక్కులా వెన్ను తడుతుంది. తిథి వారనక్షత్రాలు, గ్రహణ సమయాలు ముందే చెప్పి జాగ్రత చేస్తుంది. ఉగాది వచ్చిందంటే భద్రాచలం పులకిస్తుంది



గోదావరి కొత్త సందడికి నాంది పలుకుతుంది. ఇప్ప పూలు విరగబూస్తాయి. భాగ్య నగరంలో ముత్యాల జల్లులు పడతాయి. రామయ్యకు, సీతమ్మకు పెళ్లికళ వస్తుంది. ఉగాది తర్వాత ఆ రోజు ఈ రోజు వదిలేస్తే సరిగ్గా వారం రోజుల్లో సీతారామకల్యాణం! ఎంత వైభవం! ఎంత శోభస్కరం! ఈ వసంతం, దాని వెంట మధుమాసం రామయ్య పెళ్లి కోసమే వస్తాయి. భూమాత తన కూతురు పెళ్లికి అంతమాత్రం ఆర్భాటం చెయ్యదా?

దోసిట ముత్యాల తలంబ్రాలతో, నీలాల ను కెంపులను వైచాయకు అనుగుణంగా తెల్లని ముత్యాలు మారిపోతుంటే నివ్వెరపాటుని ప్రదర్శించే కళ్యాణమూర్తులు - ఆ సీతారాములు అందరికీ సర్వ శుభాలను ప్రసాదించాలని కాంక్షిద్దాం.

సర్వేజనాః సుఖినో భవన్తు. ✩



**మార్చి 8వ తేదీని ప్రతియేటా మహిళా హక్కుల సాధన కోసం 'అంతర్జాతీయ మహిళా దినోత్సవం'గా జరుపుకుంటున్నాం. ఇప్పటికి వందేళ్లు దాటింది. అయినా, మహిళలపై నేరాలు,ఘోరాలు, అఘాయిత్యాలు, అత్యాచారాలు, హింస నానాటికీ పెరుగుతున్నాయి,**

**ప్రేమని తిరస్కరిస్తే యాసిడ్ దాడులు.... కోరిక తీర్చనందుకు హత్యలు... ఆడపిల్లని కన్నందున హింస.... మగ పిల్లల్ని కననందుకు వేధింపులు.... అనుమానం కలిగితే ఆరళ్లు.... ప్రేమని ఒప్పకోనందుకు అఘాయిత్యాలు. కట్నం ఇవ్వనందుకు సజీవ దహనాలు.. అంతేకాదు. ఆఖరికి బట్టలు సరిగా ఉతకనందుకు, వంట రుచిగా చెయ్యనందుకు, ఆలస్యంగా ఇంటికి వచ్చినందుకు, జీతం లెక్క చెప్పనందుకు, తప్ప ఏదైనా ఉంటే నిలదీసి అడిగినందుకు.. ఇట్లా అనేకానేక కారణాలు చెప్పకుంటూ, మహిళలను, ఆడపిల్లలను వేధించి, హింసిస్తున్నారు. ఇక ఈవ్ టీజింగ్ వికృతంగా చూడటం, వ్యాఖ్యానించటం చాలా మామూలు విషయాలు. మహిళలను నియంత్రించి, శాసించి, దండించి, అదుపు చేసి, హింసించి, హత్యచేసి రకరకాల దారుణాలకు ఒడిగడుతున్నారు.**



ఇట్లాంటివి జరిగినప్పుడల్లా ప్రభుత్వం రక్షణ కల్పించటంలో విఫలం అయిందని కొందరు విమర్శిస్తారు. చట్టాలు కఠినంగా లేవని, ఇంకా కఠినమైన శిక్షణ విధించటమే పరిష్కారమని కొందరంటారు. మరి కొందరు ఎన్‌కౌంటర్ చేయాలంటారు. ఆడ పిల్లలు మన సంస్కృతీ సంప్రదాయాలను వదిలేసి, రెచ్చగొట్టేలా వస్త్ర ధారణ చేస్తున్నారని, అందుకే ఇట్లాంటివి జరుగుతున్నాయని మరికొందరు విశ్లేషిస్తుంటారు. సినిమాలే అందరినీ చెడగొడుతున్నాయని కొందరంటారు.

ఎవరేం చెప్పినా, పైన పేర్కొన్నవన్నీ తాత్కాలిక పరిశీలనతో చెప్పినవే తప్ప, అసలైన కారణాలు కాదు. సమస్య మూలాల్లోకి వెళ్ళి చూడటం లేదు.

# ఆధునిక స్త్రీ చరిత్ర

మహిళలపై రకరకాల దారుణాలు జరగటానికి అసలు మూలం మన సమాజ పునాదిలోనే ఉంది. ఇది పితృస్వామిక సమాజం. అంటే పురుషాధిక్య సమాజం. ప్రమాణాలు, విలువలు, పరిష్కారాలు, విశ్లేషణలు, చట్టాలు, న్యాయాన్యాయాలు అన్నీ పురుషుల దృష్టి కోణం నుంచే ఎక్కువగా అమలు జరిగాయి. జరుగుతున్నాయి. ఇప్పడిప్పుడు




పరిస్థితిలో కొంత మార్పు వచ్చినప్పటికీ, మహిళా రక్షణ చట్టాలు ఊపిరి పోసుకుంటున్నప్పటికీ అది సరిపోదు. సమాజ స్వభావంలో మార్పు వచ్చినప్పడే పురుషాధిక్యత అంతమైనప్పుడే; స్త్రీ, పురుషుల మధ్య సమభావనతో కూడిన స్నేహ సంబంధాలు వెల్లివిరిసిననప్పుడే మహిళలపై దారుణాలు అంతరిస్తాయి.



మతాలు, కోర్టులు, పోలీసుస్టేషన్లు, సైన్యం, పత్రికలు, సినిమాలు, పార్లమెంటు, అసెంబ్లీలు.... అన్నీ పురుషుల ఆధిక్యతలోనే ఉన్నాయి. వీటిలో మహిళల పాత్ర అల్పం. మహిళకు కుటుంబాలు ఉండవు, వాళ్లు కేవలం కుటుంబాలను వృద్ధి చేయుటానికి, సేవ చేయుటానికి, ఆశ్రయం పొందటానికి ఒక కుటుంబం నుంచి మరొక కుటుంబానికి మారతారు. మహిళలకు వంశాలూ ఉండవు. వంశాలు పురుషులవే. అందుకే వంశం నిలబెట్టడానికి ఒక్క మగపిల్లాడ్ని అయినా కనాలని చెప్తుంటారు. పురుషులే వంశోద్ధారకులు. మహిళలు కేవలం ఒక పురుషుడి వంశం నుంచి





# తిరగరాస్తోంది



మరొక పురుషుడి వంశానికి మారతారు.

సంస్కృతీ సాంప్రదాయాల్ని మహిళలే కాపాడాలి. చీర స్థానాలలో ప్యాంటు, చొక్కా వేసుకుంటే మన కట్టూ, బొట్టూ వదిలిపెట్టారని విమర్శలు వస్తుంటాయి. మహిళల వస్త్రధారణ సభ్యంగా ఉందా, అసభ్యంగా ఉందా అని నిర్ణయించేది పురుషులే. పురుషుల ఆధీనంలోని పత్రికలు, సినిమాలు, ఈ అంశంపై అదే పనిగా విమర్శలు గుప్పిస్తాయి.

మరి మన భారతీయ సంస్కృతీ సాంప్రదాయాల్ని పాటించాల్సిన బాధ్యత పురుషులకేం ఉండదు. అది మహిళల బాధ్యతే. భారతీయ సంస్కృతీ సాంప్రదాయమైన పంచెలు, ధోవతులు వదిలి పురుషులు ప్యాంట్లు, జీన్స్ ప్యాంట్లు, టీషర్టులు, షార్ట్‌లు (లాగూలు) వేసుకోవచ్చు. వారిని ఎవరూ విమర్శించరు. చొక్కాలు విప్పిన హీరోలు, ఛాతీలు





ప్రదర్శించే హీరోలు, లాగూల మీద తిరిగే హీరోలు హాయిగానే ఉంటారు. ఒక సినిమాలో బికినీ వేసుకున్న హీరోయిన్‌కి చీరలు పంపి నిరసన తెలిపారు ఒక యువజన సంఘం వాళ్లు. మరి శరీరాన్ని ప్రదర్శించే హీరోలకెందుకు వీళ్లు బట్టలు పంపించరు? సమ సమాజం కోసం పాటు పడుతున్నామని చెప్పుకునే వీరికి కూడా మహిళలంటే చులకనే.

చీరల్లో చదువులకు, ఉద్యోగాలకు వెళ్లటంలో మహిళలకు ఎన్ని ఇబ్బందులుంటాయనే దృష్టితో పురుషాధిక్య సమాజం ఎప్పుడైనా ఆలోచించిందా? వేగంగా నడవటానికి, మెట్లు ఎక్కడానికి చీర అనుకూలంగా ఉండదు. డబ్బులు, ఐడెంటిటీ కార్డులు, విజిటింగ్ కార్డులు, వీసాకార్డులు, సెల్‌ఫోన్లు వంటివి దాచుకోవడానికి పురుషుల దుస్తుల్లో మాదిరిగా చీరల్లో, సల్వార్ కమీజ్‌లలో ఏర్పాట్లు ఉండవు. వాటికి జేబులు లేకపోవటం, తప్పనిసరిగా బ్యాగులు మోయటం మహిళలకు ఎంత అసౌకర్యంగా ఉంటుందో వీళ్లు ఆలోచిస్తారా?

సంస్కృతీ సాంప్రదాయాల నేపథ్యంలో వస్త్రధారణ మీద విమర్శలు చేయాల్సివస్తే మహిళలపైనే ఎందుకు చేస్తారు? పురుషుల పై ఎందుకు చేయరు? ఇప్పటికీ, అన్ని రంగాల్లో పోటీపడుతూ పురుషులతో సమానంగా రాణించగలిగిన సత్తా ఉన్న మహిళలు ఎంత ఇబ్బంది ఉన్నా, చీరలే ధరించాలన్న ధోరణిని పురుషులు ఎందుకు కనబరుస్తున్నారు? తమకు ఏ దుస్తులు సౌకర్యవంతంగా ఉంటాయో,



ఏవి ఉండవో, ఏవి వేసుకోవాలో, ఏవి వేసుకోకూడదో మహిళలే తేల్చుకోవాలి. తమ సభ్యతా అసభ్యతలని, సౌకర్య అసౌకర్యాలను వాళ్లే నిర్ణయించుకోవాలి. వాళ్ల దుస్తులపై వాళ్లకే నిర్ణయాధికారం ఉండాలి. పురుష ప్రమాణాలనుంచి, పురుషుల దృష్టి కోణం నుంచి ఆడవాళ్లు విముక్తం కావాలి.

### పుట్టిన నాటి నుంచే వివక్ష

మగ పిల్లలు అయితే '+' అని, ఆడపిల్లలు '-' అని వ్యవహరిస్తారు. ఇదెంత వరకు న్యాయం? మగ పిల్లలు పున్నామ నరకం నుంచి తప్పిస్తారట. పెళ్ళిళ్లు చేయాలంటే ఆడ పిల్లలకు కట్నాలు ఇవ్వాలట. ఎందుకు? సృష్టికే ప్రతిసృష్టి చేయగలిగిన సత్తా ఉన్నందుకా? అణు ప్రమాణం నుంచి బిడ్డని తయారు చేసి, 9 నెలలు మోసి, పునర్జన్మ పొందినంత పనై కష్టపడి పిల్లల్ని కని, సమాజానికి అందించినందుకా? తన అందం, ఆరోగ్యం వసివాడిపోయినా కని, పాలిచ్చి, నిద్రాహారాలు మాని పెంచుతున్నందుకా? ఈ మహత్కార్యాన్నే కాక, ఇంటి పనులనూ, మార్కెట్ పనులను, ఇతర బయట పనులనూ చక్కపెట్టుకుంటూ పురుషులతో సమానంగా ఉద్యోగాలు కూడా చేస్తూ



ఆర్జిస్తున్నందుకా? నిజం చెప్పాలంటే, నేటి ఆధునిక మహిళ విశ్వరూపం ప్రదర్శిస్తోంది. పురుషుల కంటే ఎక్కువగా కుటుంబంలో, సమాజంలో తన పాత్ర పోషిస్తోంది.

అందుకే స్త్రీలు పురుషుల కంటే ఉన్నతులని మహాత్మా జోతిబాపూలే ప్రకటించారు. అంతరాంతరాల్లో ప్రతి మగవాడికీ తెలుసు తనకు లేనిదేదో స్త్రీకి ఉందని-అంటాడు ఓషో.

అయినా ఆడపిల్లలంటే చులకన భావంతో భ్రూణ హత్యలకు, అక్రమ నియంత్రణలకి పాల్పడిన సమాజం నేడు ప్రతి 1000 మంది పురుషుల జనాభాలో కేవలం 930 మంది స్త్రీలు మాత్రమే ఉండే స్థితిని తీసుకుని వచ్చింది.

పౌష్టికాహారంలోపం ఆడపిల్లల్లోనే ఎందుకు ఎక్కువో ఆలోచించండి.

మధ్యలో బడి మానేసే పిల్లల్లో ఆడపిల్లలే ఎక్కువుంటారెందుకు? పెద్ద చదువుల విషయంలో తేడాలెందుకు చూపుతున్నారు? పోలీసుస్టేషన్లలో, న్యాయమూర్తుల్లో, ఉన్నతాధికారుల్లో పత్రికల వారిలో, పరిశ్రమల్లో, వనరుల్లో, కేబినెట్ పోస్టుల్లో, పార్లమెంటు, అసెంబ్లీల సభ్యుల్లో మహిళలకు దక్కిన భాగస్వామ్యమెంత?

స్త్రీలు కూడా పురుషులతో సమానంగా హక్కులు పొందగలిగిన భారతదేశమే తాను కలలు కన్న భారతదేశమని, అర్ధరాత్రి సమయంలో కూడా స్త్రీ నిర్భయంగా బయట సంచరించగలిగినప్పుడే దేశానికి స్వాతంత్ర్యం వచ్చినట్లని గాంధీమహాత్ముడు స్పష్టం చేశారు. మహిళలపై నేటికీ జరుగుతున్న అకృత్యాలని, అమానుషాలనీ చూస్తుంటే, దేశానికి స్వాతంత్ర్యం వచ్చి 60 ఏళ్లు దాటినా మహిళలకు రాలేదనే చేదు వాస్తవం అర్థమవుతోంది.

రామ మనోహరలోహియా ఏడు విప్లవాలను ప్రతిపాదించారు. ఏడింటిలో మొదటిది 'స్త్రీ, పురుషుల మధ్య సమానత్వం కోసం' సాగించవలసిన విప్లవం.

కమ్యూనిస్టు సిద్ధాంతవేత్త ఫ్రెడరిక్ ఏంగెల్స్ తన సుప్రసిద్ధ 'ది ఆరిజిన్ ఆఫ్ ది ఫ్యామిలీ, ప్రైవేట్ ప్రాపర్టీ అండ్ ది స్టేట్' - కుటుంబం, సొంత ఆస్తి, రాజ్యాల ఆవిర్భావం అనే డాక్యుమెంట్‌లో ఇలా అంటారు - "ఈనాటి విడి కుటుంబాల్లో భార్య గృహదాసి. ఆ దాసీత్వం నిగూఢం కావచ్చు. బహిరంగం కావచ్చు. ఈ కుటుంబ వ్యవస్థకు మూలమే అది" అని. కుటుంబం లోపల భర్త బూర్జువా అని, భార్య కార్మిక వర్గానికి ప్రాతినిధ్యం వహిస్తుందని కూడా ఏంగెల్స్ స్పష్టం చేశారు.





అయితే, స్త్రీ తన సర్వోన్నతి కోసం సంఘర్షిస్తుందని తత్వవేత్త సిమోన్ దబూవుఆర్ అంటారు. ఇతరులను అణచివేసి, తమ నిరంకుశ అధిపత్యాన్ని స్థాపించి, తత్ఫలితంగా సౌఖ్యాలనీ, సౌకర్యాలనీ అందుకున్న వర్గాలేమీ తమంత తముగా అధిపత్యాన్నీ, అధికారాలను వదులుకున్న దాఖలాలు చరిత్రలో ఎప్పుడూ లేవు.

మహిళల సంఘర్షణ మనకిప్పుడు అనేక రూపాల్లో కనపడుతోంది. మెరుగైన జీవితాలను సాధించడానికి అనేక మంది మహిళలు పడుతున్న తపన కారణంగా, వారికి మద్దతుగా నిలిచిన న్యాయబుద్ధి కలిగిన అనేక మంది పురుషుల కారణంగా నేడు వారి జీవితాల్లో అనేక మార్పులు సంభవిస్తున్నాయి. మహిళలు నిరంతరం వివిధ రూపాల్లో పోరాడుతున్నారు. పురోగమిస్తున్నారు.

ఆడ పిల్లలకి చదువుల అక్కర్లేదనే దశనుంచి, పోటీ పరీక్షల్లో ఆడపిల్లల్ని ఎదుర్కోవటం మగ పిల్లలకి అంత తేలిక కాదని రుజువయ్యేంత దూరం వరకు చరిత్ర చాలా ముందుకు వెళ్లింది. అవకాశం వస్తే, ఏ రంగంలోనూ తాము ఎవరికీ తీసిపోమని మహిళలు నిరూపిస్తున్నారు. నిజానికి అవకాశం తమ దాకా వచ్చే వరకు వారు వేచి చూడటం లేదు. ముందుకురికి అందుకుంటున్నారు. పురుషులకే సొంతమనుకునే అన్ని రంగాల్లోకీ దూసుకెళుతున్నారు.

ఆధునిక స్త్రీ చరిత్రను తిరగరాస్తుందనే గురజాడ కన్న కలలు నిజమయ్యే రోజు మరెంతో దూరంలో లేదు.

*- గొట్టిపాటి సుజాత*



# వికృతి నామ సంవత్సర
## రాశి ఫలితాలు

### మేషం
(అశ్వని, భరణి, కృత్తిక మొదటి పాదం)

మేష రాశి వారికి ఈ ఏడాదివృత్తి వ్యాపారాల్లో గణనీయమైన పురోగతి కనిపిస్తుంది. కొత్త వ్యాపారాలు ప్రారంభిస్తారు. లక్ష్యాలు సాధిస్తారు.

సంవత్సరం ప్రారంభం నుంచి మే వరకు శని వక్రగమనం కారణంగా ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపాలి. ఖర్చులు అధికంగా ఉంటాయి. స్పర్థలు, అవమానాలు, చికాకులు ఎదురవుతాయి. జూలై నుంచి నవంబర్ వరకు గురువు వక్రించిన కారణంగా ఆర్థిక, విషయాల్లో జాగ్రత్తగా వ్యవహరించాలి. శుభాలను చేకూర్చే గురువు ఈ ఏడాది లాభ, వ్యయస్థానాల్లో సంచరిస్తున్నాడు. ఫలితంగా ఆదాయం పెరుగుతుంది. ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది. సంకల్పం సిద్ధిస్తుంది.

ఈ సంవత్సరం మీ 6వ స్థానంలో శని సంచరిస్తున్న ఫలితంగా వృత్తి వ్యాపారాల్లో బాధ్యతలు పెరుగుతాయి. కృషి రంగంలో రాణిస్తారు. హోటల్, వ్యవసాయం, పరిశ్రమల రంగాల వారు అభివృద్ధి సాధిస్తారు. పట్టుదలతో లక్ష్యాలు సాధిస్తారు. సంవత్సరారంభం నుంచి మే వరకు శని వక్రించిన కారణంగా అవమానాలు, అపవాదులు ఎదుర్కొంటారు. రుణాలు ఇచ్చిపుచ్చుకోవడంలో ఇబ్బందులు ఎదురవుతాయి. లక్ష్య సాధనలో శ్రమాధిక్యం తప్పకపోవచ్చు.

9-3 స్థానాల్లో రాహువు, కేతు గ్రహాల సంచారం ఫలితంగా వృత్తి వ్యాపారాల్లో రాణిస్తారు. ఉన్నత పదవి లభిస్తుంది. కోర్టు వ్యవహారాల్లో పరిష్కారం లభిస్తుంది. అయితే ఒత్తిళ్లు అధికంగా ఉంటాయి. అవమానాలు ఎదుర్కోవాల్సి వస్తుంది. సోదరీ సోదరులు, బంధుమిత్రుల కారణంగా చిక్కులు ఎదుర్కొంటారు. ఆస్తిపాస్తుల విషాయల్లో న్యాయ పరమైన సమస్యలు తలెత్తే అవకాశం ఉంది.

### వృషభం
(కృతిక 2,3,4 రోహిణి మృగశిర 1, 2 పాదాలు)

వృషభరాశి వారు ఈ ఏడాది వృత్తి, ఉద్యోగ వాపారాల్లో పురోగతి సాధిస్తారు. ప్రమోషన్లు, ఉన్నత పదవులకు అవకాశం ఉంది. ఆర్థిక విషయాలపై ఎక్కువగా దృష్టిసారిస్తారు. రాజకీయ, ప్రభుత్వ, సహకార రంగాలకు చెందిన వారికి ప్రోత్సాహకరం. ఇంట్లో వివాహాది శుభకార్యాలు జరుగుతాయి. అనుబంధాలు బలపడతాయి. జనవరి నుంచి మే వరకు చిన్నారులు, ప్రియతములు ప్రవర్తన మనస్తాపం కలిగిస్తుంది. జూలై - అక్టోబర్ మాసాల మధ్య పెద్దల ఆరోగ్యం కలవర పెడుతుంది. వృత్తి వ్యాపారాల్లో బాధ్యతలు అధికం అవుతాయి. శుభాలు చేకూర్చే గురువు ఈ ఏడాది మీ 10,11 స్థానాల్లో సంచరిస్తున్నాడు. కాబట్టి వృత్తి, ఉద్యోగ, వ్యాపారాలలో పురోగతి కనిపిస్తుంది. కొత్త ఆదాయం కోసం చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. అధికారం, హోదా, గౌరవ ప్రతిష్ఠలు పెరుగుతాయి. పలుకుబడి గలవారు, ఉన్నత పదవులలో ఉన్నవారు మీ వృత్తి, ఉద్యోగాలలో సహకరిస్తారు. గురువు వక్రగమనంలో ఉన్న జూలై 23 - నవంబర్ 18 తేదీల మధ్య కాలంలో బదిలీలు, మార్పులు చేర్పులు అసౌకర్యం కలిగిస్తాయి. వృత్తి వ్యాపారాల్లో చికాకులు, ఒత్తిళ్లు అధికం. తొందరపాటు నిర్ణయాలు తగవు. ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాల్లో ప్రతికూల ఫలితాలు కనిపిస్తాయి.

ఈ సంవత్సరం అంతా మీ పంచమంలో శని సంచారం కారణంగా విద్యా విషయాల్లో ఆటంకాలు ఎదురవుతాయి.

8-2 స్థానాల్లో రాహుకేతువుల సంచారం కారణంగా ఆర్థిక విషయాల్లో ఆశించిన ఫలితాలు సాధించడం కష్టసాధ్యం. ఆర్థిక విషయాల్లో అసంతృప్తి నెలకొంటుంది, ఆస్తి విషయాల్లో చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉంది. కొత్త వ్యాపారాల ప్రారంభం, ప్రాజెక్టుల విషయంలో చిక్కులు ఎదురైనా పట్టుదలతో సత్ఫలితాలు సాధిస్తారు. బదిలీ ప్రయత్నాలు చేస్తారు. పెట్టుబడుల విషయంలో జాగ్రత్త అవసరం. ఉమ్మడి నిధుల నిర్వహణలో మాటపడాల్సి వస్తుంది. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించాలి.

### మిథునం
(మృగశిర 3,4 ఆరుద్ర, పునర్వసు 1,2,3 పాదాలు)

గురు, శని, రాహు, కేతు సంచారం పరిశీలిస్తే మిథున రాశి వారు వృత్తి వ్యాపారాల్లో అభివృద్ధి సాధిస్తారు. పై చదువులు, విదేశీ గమనానికి అనుకూలం. కొత్త వ్యాపారానికి, పరిశ్రమల ప్రారంభానికి తగిన సమయం. ఉద్యోగంలో మార్పు కోరుకుంటారు. విజయం సాధిస్తారు. గురువు వక్రగమనంలో ఉండే జూలై - నవంబర్ మాసాల మధ్య ఆందోళనలు అధికం అవుతాయి. వృత్తిపరమైన ఒత్తిడులకు లోనవుతారు. శ్రమ అధికం. ఫలితం స్వల్పం.

9,10 స్థానాల్లో గురు సంచారం వల్ల ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం. వృత్తి, వ్యాపారాల్లో శుభపరిణామాలు సంభవం. ప్రమోషన్లు సాధిస్తారు. వ్యాపార విస్తరణకు తగిన సమయం.

చతుర్థ స్థానంలో శని సంచారం ఫలితంగా స్థిర చరాస్తులు సంపాదించుకుంటారు. గృహ నిర్మాణ, స్థలసేకరణ ప్రయత్నాలు కాస్త నిదానంగా అయినా ఫలిస్తాయి. వృత్తిపరమైన ఒత్తిడులు, కుటుంబ బాధ్యతలు పెరుగుతాయి. సంవత్సరారంభం నుంచి మే 31వ తేదీ వరకు శని వక్రగమనంలో ఉన్నాడు. ఈ ఐదు నెలల కాలంలో ఇంట్లో

పెద్దల ఆరోగ్యం ఆందోళన కలిగిస్తుంది.

7-1 స్థానాల్లో రాహువు, కేతువులు సంచరిస్తున్న ఫలితంగా వైవాహిక జీవితంలో చికాకులు తలెత్తుతాయి, మానసిక అశాంతికి లోనవుతారు. ఆర్థికపరమైన చికాకులు, ఆలస్యాలు సంభవం, రుణబాధలు అధికమవుతాయి. వ్యాపారంలో ఒతిళ్లు అధికమవుతాయి. పెట్టుబడులు పెంచడం ద్వారా వ్యాపారాన్ని విస్తరిస్తారు. డబ్బు కోసం పరిచయస్తులు, బంధుమిత్రుల నుంచి ఒత్తిళ్లు అధికం అవుతాయి. ఆస్తిపాస్తుల విషయాల్లో ఆచితూచి వ్యవహరించాలి.

## కర్కాటకం

(పునర్వసు 4, పుష్యమి, ఆశ్లేష)

కర్కాటక రాశిలో జన్మించిన వారికి ఈ ఏడాది శుభప్రదుడైన గురువు 8,9 స్థానాల్లో సంచరిస్తాడు. 3వ స్థానంలో శని సంచారం జరుగుతుంది. ఫలితంగా ఆస్తి పాస్తులు పెంపొందించుకుంటారు. పెట్టుబడులు లాభిస్తాయి. ఆర్థిక పరిస్థితి ప్రోత్సాహకరంగా ఉంటుంది. రాజకీయ, కళా, సాంస్కృతిక రంగాలు, ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం. వృత్తి వ్యాపారాల్లో వికాసం సాధిస్తారు. కోర్టు వ్యవహారాలు పరిష్కారం అవుతాయి. గురు, శనులు వక్రించిన మాసాల్లో ఆర్థిక, ఆరోగ్య సమస్యలు తలెత్తే అవకాశం ఉంది. సోదరీ సోదరుల విషయాల్లో బాధ్యతలు పెరుగుతాయి. ప్రయాణాల్లో జాగ్రత్తగా ఉండాలి.

ఈ ఏడాది గురు సంచారం వల్ల స్థిరచరాస్తులు సమకూర్చుకోగలుగుతారు. ఆర్థిక సమస్యలు పరిష్కారం అవుతాయి. వృత్తి ఉద్యోగాలలో శుభ పరిణామాలు సంభవం. గురువు వక్రగమనంలో ఉండే జూలై - నవంబర్ మాసాల మధ్య ఆర్థిక విషయాల్లో జాగ్రత్తగా వ్యవహరించాలి. ఖర్చులు అంచనాలు మించుతాయి. కోర్టు వ్యవహారాలు ఆశించిన ఫలితాలు రాకపోవచ్చు. మానసిక అశాంతికి గురయ్యే అవకాశం ఉంది. శ్రమాధిక్యంతో లక్ష్యాలు సాధిస్తారు.

3వ స్థానంలో శని సంచారం ఫలితంగా ఉద్యోగ, వ్యాపారాల్లో బాధ్యతాయుతమైన పదవులు చేపడతారు. ప్రమోషన్లు అందుకుంటారు.

6-12 స్థానాల్లో రాహువు - కేతు సంచార ఫలితంగా వృత్తి వ్యాపారాల్లో చికాకులు, ఎడబాట్లు సంభవం. సన్నిహితుల ఆరోగ్యం ఆందోళన కలిగిస్తుంది. ప్రియతములతో ఎడబాటు తప్పకపోవచ్చు. ఆర్థిక విషయాలు, రుణాల విషయంలో జాగ్రత్త అవసరం. ఆర్థిక విషయాల్లో మాటపడే అవకాశం ఉంది. శిరోవేదన, నరాల బలహీనత, నీరసం వంటి సమస్యలతో బాధపడుతారు. ప్రయాణాలు ఊరట కలిగిస్తాయి. విరామ కాలక్షేపాల్లో పాల్గొంటారు.

## సింహం

(మఖ,పుబ్బ,ఉత్తర 1వ పాదము)

సింహ రాశి వారికి ఈ ఏడాది కుటుంబ విషయాల్లో ప్రోత్సాహకంగా ఉంటుంది. ప్రత్యర్థులపై విజయం సాధిస్తారు. ఇంట్లో వివాహాది శుభకార్యాలు జరుగుతాయి. జనసంబంధాలు విస్తరిస్తాయి. న్యాయ విషయాల్లో విజయం సాధిస్తారు. ఆర్థిక విషయాల్లో ప్రోత్సాహకరం. పెట్టుబడులు, పొదుపు పథకాలు లాభిస్తాయి. సన్నిహితులను కలుపుకొని పదిమందికీ ఉపయోగపడే కార్యక్రమాలు చేపడతారు. జూలై - నవంబర్ మాసాల మధ్య గురువు వక్రగమనంలో ఉన్న కారణంగా శ్రీవారు, శ్రీమతి లేదా భాగస్వాముల మధ్య అపోహలు తలెత్తే అవకాశం ఉంది.

7,8 స్థానాల్లో శుభప్రదుడైన గురు సంచారం వల్ల శ్రీవారు, శ్రీమతి విషయాలలో పురోగతి కనిపిస్తుంది. స్నేహితులు, బంధువులు, అభిమానులు మీ లక్ష్యసాధనలో సహకరిస్తారు. ఇంట్లో శుభకార్యాలు జరుగుతాయి.

2వ స్థానంలో శని సంచారం వల్ల ఆర్థిక విషయాల్లో ఫలితం మధ్యస్థంగా ఉంటుంది. మే తరువాత స్థలమార్పిడి, ఉద్యోగ వ్యాపారాల్లో మార్పులు చేర్పులు జరుగుతాయి. వృత్తిరంగంలో పురోగతి సాధిస్తారు. సోదరులు, సన్నిహితులతో ఆర్థిక విషయాల్లో వివాదాలు తలెత్తే అవకాశం ఉంది. మంచికి పోతే చెడు ఎదురవుతుంది. ప్రయాణాలు, వాహనాలు నడిపే సందర్భంగా మెళకువగా వ్యవహరించాలి. బదిలీలు అసంతృప్తికరంగా ఉంటాయి. శని వక్రించిన ఫలితంగా మే వరకు సన్నిహితులతో వైరం తలెత్తే అవకాశం ఉంది. పెట్టుబడులు, ఆర్థిక లావాదేవీల్లో నిదానం అవసరం.

5,11 స్థానాల్లో రాహు - కేతు సంచారం ఫలితంగా చిన్నారులు, ప్రియుతములకు ఆరోగ్య పరమైన ఇబ్బందులు తలెత్తే అవకాశం ఉంది. ఆస్పత్రి ఖర్చులు అధికం. సంకల్పించిన పనులు పూర్తి కావడంతో ఆటంకాలు ఎదురౌతాయి. చెడు స్నేహాలకు దురలవాట్లకు దూరంగా ఉండాలి. చదువుల్లో ఆటంకాలు కలుగుతాయి. ప్రేమికుల మధ్య ఎడబాట్లు తప్పకపోవచ్చు. నిరంతరం ఏదో ఒక మానసిక అశాంతి మిమ్మల్ని వెంటాడుతూ ఉంటుంది.

## కన్య

(ఉత్తర 2,3,4, హస్త, చిత్త 1, 2 పాదాలు)

ఈ ఏడాది కన్యా రాశివారికి వృత్తి వ్యాపారాల్లో ప్రోత్సాహకరంగా ఉంటుంది. ఆస్తిపాస్తులు సమకూర్చుకుంటారు. వైవాహిక జీవితం సుఖమయంగా ఉంటుంది. ఉద్యోగస్తులు ప్రమోషన్లు సాధిస్తారు. వ్యాపార రంగాల వారు అధికలాభాలు గడిస్తారు. వివాహ ప్రయత్నాలు ఫలిస్తాయి. శుభకార్యాల్లో పాల్గొంటారు. వైద్యులు, వైద్య రంగాల వారికి శుభ్రపదం. శత్రువులపై విజయం సాధిస్తారు. జనసంబంధాలు విస్తరిస్తాయి. అయితే లగ్న శని కారణంగా లక్ష్య సాధనకు అధికంగా శ్రమించాల్సి వస్తుంది. శత్రుపీడ అధికం. మధుమేహం సమస్య ఉన్నవారు జాగ్రత్తలు పాటించాలి.

ఆరవ స్థానంలో గురు సంచారం ఫలితంగా ఉద్యోగ, వృత్తి, వ్యాపారాలలో గణనీయమైన అభివృద్ధి కనిపిస్తుంది. ఆత్మ విశ్వాసం, ధైర్య సాహసాలతో చేసే ప్రయత్నాలు జయప్రదం అవుతాయి. ఆటంకాలను లెక్క చేయకుండా ముందుకు సాగుతారు. జూలై 23 నుంచి - నవంబర్ 18 వరకు గురువు వక్రించిన ఫలితంగా ప్రత్యర్థుల నుంచి చిక్కులు ఎదురౌతాయి. వైవాహిక జీవితంలో చిక్కులు ఎదురవుతాయి.

మీ జన్మ రాశిలో శని సంచారం వల్ల క్రమశిక్షణతో వ్యవహరించి లక్ష్యాలు సాధిస్తారు. ప్రముఖులతో పరిచయాలు ఏర్పడతాయి. పెద్దల సహకారంతో లక్ష్యాలు సాధిస్తారు. మే 31వ తేదీ వరకు శని వక్రించి

ఉన్న కారణంగా ఆరోగ్యం మందగిస్తుంది. మనశ్శాంతి లోపిస్తుంది. దీర్ఘకాలిక పెట్టుబడులు లాభిస్తాయి. కుటుంబ సభ్యులతో ఎడబాట్లు తప్పకపోవచ్చు. అపనిందలు ఎదుర్కొంటారు.

4,10 స్థానాల్లో రాహు - కేతువుల సంచారం వల్ల ఆర్థిక విషయాల్లో అభివృద్ధి సాధిస్తారు. బదిలీలు, మార్పులు, చేర్పులు అసౌకర్యం కలిగిస్తాయి. తరచు ఆటంకాలు, అవరోధాల వల్ల నైరాశ్యం పెరుగుతుంది. ఊహించని సంఘటనలు ఆందోళన కలిగిస్తాయి. అపోహల వల్ల అశాంతికి గురవుతారు. అపనిందలు ఎదుర్కోవాల్సి ఉంటుంది. వయసులో మీకంటే పెద్ద వారితో స్నేహానుబంధాలు ఏర్పడతాయి.



## తుల

(చిత్త3, 4 స్వాతి, విశాఖ 1,2,3 పాదాలు)

తులా రాశి వారికి ఈ ఏడాది చదువులు, ప్రేమ విషయాలు, వివాహ నిర్ణయాలు, ఆర్థిక విషయాలు, వృత్తి, వ్యాపారాల్లో ప్రోత్సాహకరంగా ఉంటుంది. గురువు పంచమస్థానంలో సంచరిస్తున్న కారణంగా విద్యార్థులకు ప్రోత్సాహకరం. ప్రేమానుబంధాలు బలపడతాయి.

ఈ ఏడాది సంతానం విషయంలో శుభపరిణామాలు సంభవం. స్నేహ సంబంధాలు పెంపొందుతాయి. ఇంట్లో విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు. విద్య, వైజ్ఞానిక రంగాలలో విశేష ప్రోత్సాహం లభిస్తుంది.

గురువు వక్ర గమనంలో ఉండే జూలై -నవంబర్ మాసాల మధ్య అనారోగ్యం, పనుల్లో ఆలస్యం, ఆర్థిక ఇబ్బందులు, అనవసర వ్యయం ఉంటాయి. వృత్తిలో పెద్దల నుంచి ఒత్తిళ్లు, అపనిందలు తప్పవు. గృహ విషయాల్లో సామరస్య ధోరణి కొరవడుతుంది. విద్యార్థులకు ఆటంకాలు ఎదురవుతాయి. ప్రయణాల్లో చిక్కులు ఎదురవుతాయి.

12వ స్థానంలో శని సంచారం ఫలితంగా శుభాశుభ మిశ్రమ ఫలితాలు కనిపిస్తాయి. మే వరకు శని వక్రగమనంలో ఉన్నాడు. ఆ సమయంలో భాగస్వామి సహకారం అందుకుంటారు. క్రమశిక్షణతో, ఓరిమితో చేపట్టిన పనులు పూర్తి చేస్తారు. సంవత్సరం ద్వితీయార్థంలో ఆరోగ్యపరమైన ఇబ్బందులు తలెత్తుతాయి.

9-3 స్థానాల్లో రాహు, కేతు సంచారం ఫలితంగా ఉన్నత విద్య, విదేశీ వ్యవహారాలకు అనుకూలం. ఇంట్లో మహిళల ఆరోగ్యం ఆందోళన కలిగిస్తుంది. లక్ష్య సాధనలో ఊహించని అవాంతరాలు ఎదురౌతాయి. కుటుంబ సభ్యులకు దూరంగా ఉండాల్సి రావచ్చు. సోదరీ సోదరులతో చికాకులు ఏర్పడతాయి. స్థాన చలనం, లిటిగేషన్లు చిరాకు కలిగిస్తాయి. మధ్యవర్తుల కారణంగా ఇబ్బంది పడతారు. కోర్టు వ్యవహారాలు నెమ్మదిగా పరిష్కారం అవుతాయి.



## వృశ్చికం

(విశాఖ4, అనూరాధ, జ్యేష్ఠ)

ఈ ఏడాది గురు, శని, రాహుకేతువుల సంచారం ఆధారంగా వృశ్చిక రాశి వారు స్థల సేకరణ, గృహనిర్మాణం, రియల్ ఎస్టేట్ రంగాల్లో పురోగతి సాధిస్తారు. విదేశీ వ్యవహారాలు, ఉన్నత విద్యాభ్యాసానికి అనుకూలం. కుటుంబంలో శుభకార్యాలు జరుగుతాయి. పరిచయాలు లాభిస్తాయి. గృహాలంకరణ వస్తువులు సమకూర్చుకుంటారు. సొంత ఇంటి కల ఫలిస్తుంది. వాహనయోగం కలుగుతుంది. అయితే అన్ని విషయాల్లోనూ ఖర్చులు అధికంగా ఉంటాయి.

4,5 స్థానాల్లో గురు సంచారం జరుగుతున్నది. ఫలితంగా కుటుంబం విస్తరిస్తుంది. మాతృవర్గీయులు, బంధువుల సహకారం లభిస్తుంది. వారి విషయాల్లో శుభ పరిణామాలు, అభివృద్ధి సంభవం. విలువైన వస్తువులు, ఆభరణాలు, స్థిరాస్తులు సమకూర్చుకుంటారు. ఇంట్లో వేడుకలు, వివాహాది శుభకార్యాలు జరుగుతాయి.

ఈ సంవత్సరం అంతా 11వ స్థానంలో శని సంచారం ఫలితంగా రియల్ ఎస్టేట్ రంగంలోని వారి పరిస్థితి మెరుగుపడుతుంది. బాధ్యతాయుతమైన కార్యక్రమాలు చేపడతారు. బాధ్యతలతోపాటు, ఒత్తిడులు కూడా అధికమౌతాయి. మే వరకు శని వక్రించి ఉన్నందువల్ల అప్పటివరకు మరింత జాగ్రత్తగా ఉండాలి. వాహనాలు నడిపే సమయంలో ఏకాగ్రత అవసరం. క్రయవిక్రయాల్లో చిక్కులు ఎదురవుతాయి.

ఈ ఏడాది 2,8 స్థానాల్లో రాహుకేతువుల సంచారం జరుగుతుంది. ఫలితంగా ఆస్తిపాస్తులు సమకూర్చుకుంటారు. ఆదాయం పెరుగుతుంది. బదిలీలకు అవకాశం ఉంది. వైద్యం, పరిశ్రమల రంగాల వారికి శుభప్రదం. ఆరోగ్యపరంగా చిక్కులు ఎదుర్కొంటారు. శస్త్రచికిత్స వరకు వెళ్లే అవకాశం ఉంది. ప్రయాణాల్లో జాగ్రత్తలు పాటించాలి. ఆర్థిక విషయాల్లో ఆచితూచి వ్యవహరించాలి. రుణ ప్రయత్నాలు ఫలించకపోవచ్చు. ఉమ్మడి నిధుల నిర్వహణలో మాటపడాల్సి వస్తుంది. మధ్యవర్తిత్వం చేయకపోవడం మంచిది.



## ధనుస్సు

(మూల, పూర్వాషాఢ, ఉత్తరాషాఢ 1వ పాదము)

ఈ ఏడాది ధనూరాశి వారికి ఆదాయం పెరుగుతుంది. ప్రమోషన్లు పొందుతారు. అనుకున్న చోటికి బదిలీ అవుతారు. సోదరీ సోదరులు, విద్యా విషయాల్లో శుభపరిణామాలు సంభవం. గురువు వక్రగమనంలో ఉన్న జూలై-నవంబర్ మాసాల మధ్య కుటుంబం, ఆర్థిక విషయాల్లో ఆచితూచి వ్యవహరించండి. ఇచ్చిన డబ్బు తిరిగి రాకపోవచ్చు. వివాదాలకు దూరంగా ఉండండి. ఆరోగ్యం పట్ల శ్రద్ధ వహించాలి.

శుభప్రదుడైన బృహస్పతి ఈ ఏడాది 3,4 స్థానాల్లో సంచరిస్తాడు. ఫలితంగా ఆర్థిక సమస్యలు పరిష్కారం అవుతాయి. సోదరులు, సన్నిహితులతో సదవగాహన ఏర్పడుతుంది. దూర ప్రాంతాలు, విదేశాలలో ఉద్యోగం, వ్యాపారం వల్ల ఆర్థిక పరిస్థితి మెరుగుపడుతుంది.

10వ స్థానంలో శని సంచారం వల్ల వృత్తి వ్యాపారాల్లో రాణిస్తారు. సన్నిహితులు, బంధువుల భాగస్వామ్యంతో కొత్త వ్యాపారాలు ప్రారంభిస్తారు. శని వక్రగమనంలో ఉన్న మే నెల వరకు మానసిక ఆందోళనలు బాధిస్తాయి. తల్లిదండ్రుల ఆరోగ్యం ఆందోళన కలిగిస్తుంది. మే వరకు శని వక్రించిన కారణంగా ఆర్థిక విషయాల్లో చిక్కులు ఎదుర్కొంటారు. ఖర్చులు అంచనాలు మించుతాయి. సన్నిహితులతో తరచు గొడవలు పడతారు.

1,7 స్థానాల్లో రాహుకేతువుల సంచారం వల్ల పెట్టుబడులు లాభించకపోవచ్చు. స్పెక్యులేషన్లకు దూరంగా ఉండండి. రుణబాధ అధికంగా ఉంటుంది. వైవాహిక పరంగా ఇబ్బందులు ఎదుర్కొంటారు.

## మకరం
(ఉత్తరాషాఢ 2, 3, 4 శ్రవణం, ధనిష్ఠ 1, 2 పాదాలు)

మకర రాశివారు ఈ ఏడాది ఆర్థిక విషయాల్లో పురోగతి సాధిస్తారు. వృత్తి వ్యాపారాల్లో స్థాన చలనం జరిగి, ఆ తరువాత గణనీయమైన అభివృద్ధి కనిపిస్తుంది. ఉన్నత చదువుల కోసం విదేశాలకు వెళ్లేందుకు అనుకూలం. జూలై - నవంబర్ మాసాల మధ్య గురువు వక్రించిన కారణంగా ఆర్థిక విషయాల్లో దూకుడు తగదు. స్పెక్యులేషన్లు లాభించకపోవచ్చు.

ఈ ఏడాది గురు గ్రహం అనుకూల సంచారం వల్ల ఆదాయం గణనీయంగా పెరుగుతుంది. స్థిర, చరాస్తులు, విలువైన వస్తువులు సమకూర్చుకుంటారు.

9వ స్థానంలో శని సంచారం వల్ల న్యాయపరమైన చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉంది. బాధ్యతాయుతంగా వ్యవహరించి మంచి పేరు తెచ్చుకుంటారు. రాజకీయ, ప్రభుత్వ రంగాల వారికి శుభప్రదం. సంవత్సరారంభం నుంచి మే వరకు శని వక్రించి ఉన్న కారణంగా న్యాయ, బోధన, కళా, రాజకీయ రంగంలోని వారు అనాలోచిత వైఖరి వల్ల ఇబ్బందులు పడతారు.

12,6 స్థానాల్లో రాహుకేతువుల సంచారం వల్ల సంకల్పం సిద్ధిస్తుంది. పై చదువులకు అనుకూలం. అయితే కుటుంబ కలహాలు పెరుగుతాయి. మానసిక శాంతి లోపిస్తుంది. భయాందోళనలకు గురవుతారు. సన్నిహితుల ఆరోగ్యం కలవరపెడుతుంది. వృత్తి వ్యాపారాల్లో ఊహించని చిక్కులు ఎదురయ్యే అవకాశం ఉంది. విదేశీ ప్రయాణాలకు అనుకూలం. యోగధ్యానాలపై దృష్టి సారించడం ద్వారా ఆరోగ్యం మెరుగుపరుచుకుంటారు.

## కుంభం
(ధనిష్ఠ 3,4 శతభిషం, పూర్వాభాద్ర 1, 2,3 పాదాలు)

కుంభ రాశి వారికి ఈ ఏడాది వ్యక్తిగత ప్రతిష్ఠ పెరుగుతుంది. ఆర్థిక విషయాల్లో పురోగతి కనిపిస్తుంది. ప్రమోషన్లు, బదిలీలకు అవకాశం ఉంది. గురువు వక్రించిన జూలై - నవంబర్ మాసాల మధ్య ఆర్థిక, ఆరోగ్య విషయాల్లో శ్రద్ధ చూపాలి. ఆస్తి పంపకాల్లో ఇబ్బందులు తలెత్తుతాయి. దూరప్రయాణాలు చేయాల్సి రావచ్చు. వృత్తిపరంగా మార్పులు, చేర్పులకు అవకాశం ఉంది. ఏ విషయంలోనూ నిలకడ ఉండదు.

శుభాలనిచ్చే గురుగ్రహం ఈ ఏడాది మీ జన్మరాశిలోనూ ఆ తరువాత 2వ రాశిలోనూ సంచరిస్తున్నది. ఫలితంగా అన్ని రంగాల్లోనూ విశేష శుభఫలితాలు సాధిస్తారు. గౌరవ ప్రతిష్ఠలు పెరుగుతాయి.

అష్టమ శని సంచార ఫలితంగా ఆర్థికంగా చిక్కులు ఎదుర్కొంటారు. ఆరోగ్యం పట్ల శ్రద్ధ చూపించాలి. ఆస్పత్రి ఖర్చులు అధికంగా ఉంటాయి. ఆస్తి విషయాల్లో, పెట్టుబడుల్లో చిక్కులు ఎదురవుతాయి. అపవాదులు ఎదుర్కోవాల్సి రావచ్చు. సంవత్సరారంభం నుంచి మే వరకు శని వక్రించి ఉన్న కారణంగా ఆర్థిక వ్యవహారాల్లో శ్రమాధిక్యం కలుగుతుంది. ఉద్యోగాలు మారతారు.

11,5 స్థానాల్లో రాహుకేతువుల సంచారం ఫలితంగా వృత్తి పరమైన ఆందోళన అధికంగా ఉంటుంది. ప్రియతముల ఆరోగ్యం మందగిస్తుంది. ప్రశాంతత లోపిస్తుంది. విద్యార్థులు అధిక శ్రద్ధ చూపితేనే ఫలితాలు సాధిస్తారు. విద్య కోసం ఖర్చులు అధికం. ప్రేమ వ్యవహారాల్లో చిరాకులు పెరుగుతాయి. పిల్లల వైఖరి మనస్తాపం కలిగిస్తుంది. చెడు స్నేహాల వల్ల నష్టపోయే ప్రమాదం ఉంది.

## మీనం
(పూర్వాభాద్ర 4, ఉత్తరాభాద్ర, రేవతి)

ఈ ఏడాది గురు, శని, రాహుకేతువుల సంచారం ఫలితంగా మీనరాశి వారు ప్రమోషన్లు అందుకుంటారు. వేతనం పెరిగే అవకాశం ఉంది. విదేశీ గమనం, ఉన్నత విద్యాభ్యాస ప్రయత్నాలు ఫలిస్తాయి. మీ వ్యక్తిత్వంలో మార్పు వస్తుంది.

12-1 స్థానాల్లో గురు సంచారం ఫలితంగా పర రాష్ట్రాలు, విదేశీ గమనానికి, విదేశాలలో చదువులకు చేసే ప్రయత్నాలు ఫలిస్తాయి. స్థిరాస్తుల మూలంగా ఆదాయం లభిస్తుంది. వారసత్వం వల్ల లాభం చేకూరుతుంది. జూలై నుంచి 4 మాసాల పాటు మనశ్శాంతి లోపిస్తుంది. ప్రయాణాల్లో చిక్కులు ఎదురౌతాయి. వ్యవసాయం, కళాసాంస్కృతిక రంగాలు, సినిమా, ఫొటోగ్రఫీ, గ్రానైట్ రంగాల వారికి ఊహించని సమస్యలు ఎదురయ్యే అవకాశం ఉంది.

ఏడవ స్థానంలో శని సంచారం కారణంగా కుటుంబ విషయాల్లో చిక్కులు ఎదురవుతాయి. ఉమ్మడి నిధుల నిర్వహణలో అపనిందలు భరించాల్సి ఉంటుంది. క్రయవిక్రయాల్లో కష్టనష్టాలు సంభవం.

10,4 స్థానాల్లో రాహు కేతువుల సంచారం ఫలితంగా కుటుంబ విషయాల్లో చిరాకులు తప్పకపోవచ్చు. వ్యసనాలకు దూరంగా ఉండాలి. పెద్దల ఆరోగ్యం మందగిస్తుంది. పై అధికారుల నుంచి చిక్కులు ఎదుర్కొంటారు. వ్యాపారస్థులకు ఆర్థిక వ్యవహారాల్లో కష్టనష్టాలు ఎదురౌతాయి. గృహరుణాలు మంజూరవుతాయి. శ్రమాధిక్యం తప్పదు. మానసిక ఒత్తిళ్లు పెరుగుతాయి. మాతృవర్గీయుల ఆరోగ్యం మందగిస్తుంది.

– ఎ.ఎమ్.ఫీచర్స్

### శ్రీ వికృతి నామ సంవత్సరంలో

| | (అష్టోత్తరి పద్ధతి) | | | |
|---|---|---|---|---|
| రాశి | ఆదాయం | వ్యయం | రాజపూజ్యం | అవమానం |
| మేషం | 8 | 14 | 4 | 3 |
| వృషభం | 2 | 8 | 7 | 3 |
| మిథునం | 5 | 5 | 3 | 6 |
| కర్కాటకం | 14 | 2 | 6 | 9 |
| సింహం | 2 | 11 | 2 | 2 |
| కన్య | 5 | 5 | 5 | 2 |
| తుల | 2 | 8 | 1 | 5 |
| వృశ్చికం | 8 | 14 | 4 | 5 |
| ధనుస్సు | 11 | 5 | 7 | 5 |
| మకరం | 14 | 14 | 3 | 1 |
| కుంభం | 14 | 14 | 6 | 1 |
| మీనం | 11 | 5 | 2 | 4 |

# సైన్ ఫ్లో



కె.యల్.డి.జి. గురుప్రకాష్

**పానకాలు ఓ ప్రైవేట్ కంపెనీలో అసిస్టెంట్ అకౌంటెంట్. అతని అసలు పేరు పానకాలే అయినా అంతా 'సంతకాలు' అని పిలుస్తుంటారు. పేరులోని 'కాలు' తీసి పక్కనపెడితే ఈ 'పాన'కీ, ఆ 'సంత'కీ లింకేంటీ అని బుర్రగోక్కుంటున్నారా?!**

**దానికి మస్తు, జబర్దస్తు లింకుందండీ...! మనోడిది అదేనండీ పానకాల ది అల్లాటప్పా మామూలు 'లోకల్ టాలెంట్' కాదు..! 'ఎస్టీడీ'ని తలదన్నే 'ఐఎస్డీ' టాలెంట్. సాదాసీదా టాలెంటయితే పనిగట్టుకుని మరీ ఎందుకు చెప్పాలనుకుంటానండీ..?! పానకాలు అలియాస్ సంతకాలుకి ఒక భయంకరమైన వింతజబ్బు లాంటిది ఉంది. అయ్‌బాబోయ్ ఎయిడ్సో, స్వైన్ ఫ్లూనో అని కమిటైపోకండి...! పానకాలుకి ఉంది సైన్ (సిగ్నేచర్) ఫ్లో. అదేనండీ...! సంతకాల పిచ్చి. అలాంటిలాంటి పిచ్చికాదండీ బాబూ...! ఎక్కడపడితే అక్కడ, ఎలాపడితే అలా, ఎప్పుడుపడితే అప్పుడు ఎడాపెడా, పెడాఎడా సంతకాలు పెడుతూనే ఉంటాడు.**

జేబులనిండా డజన్లకొద్దీ పెన్నుల్ని పెట్టుకుని తిరుగుతుంటాడు. 'కాదేదీ కవిత కనర్హం' నుంచి స్ఫూర్తి పొందాడేమో, 'కాదేదీ సంతకానికనర్హం' అనుకుని కాగితాలు, పుస్తకాలకే పరిమితం కాకుండా ఇంటి, ఆఫీసు గోడలు, బల్లలు, తలుపులు, కిటికీలు ఇష్టం వచ్చినట్టు సంతకాలు పెడుతూనే ఉంటాడు. అతనింటి గోడలు, తలుపులు, బల్లలు అయితే సరే, కానీ పరాయివాళ్లిళ్లకి వెళ్లినా అదే తంతు కొనసాగించాలనుకుంటాడు. అందుకే పానకాలుని ఎవరూ తమ ఇళ్లకి విందు, వినోదాలకి పిలవరు. ఒకవేళ కర్మకాలి, మొహమాటపడి పిలిస్తే, 'స్టిక్ నో బిల్స్' లాగ 'స్టిక్ నో సిగ్నేచర్స్' అని గోడలకి, తలుపులకి అక్కడక్కడా చిన్న, చిన్న చెక్కబోర్డులు తగిలించాల్సిందే. లేదంటే వాళ్ల గోడలు, తలుపులు సంతకాలార్పణం. సంతకాల పిచ్చి బాగా పెన్ను పట్టించుకున్న పానకాలు అది తనకో స్పెషల్ క్వాలిటీగా భావిస్తూ, తెగ ఫీలైపోతుంటాడు. భజనపరులైన అతని స్నేహితులు కొందరు, పదో, పాతికో అప్పుకోసం పానకాలు సంతకం అమెరికా అధ్యక్షుడు ఒబామా సంతకం అంత ఎట్రాక్టివ్‌గా ఉందనీ, ఐశ్వర్యారాయ్ కంటే అందంగా ఉందని పొగడుతుంటారు. దాంతో పానకాలు ఛాతి వైశాల్యం అమాంతం పెంచుకుని ఆనక మునగచెట్టు ఎక్కేస్తాడు. అంత ఇదిగా పొగడ్తల మత్తులో తూలిపోతుంటాడు.

★★★★★

ఆఫీస్‌లో ఫైల్స్ తిరగేస్తున్నాడు పరాంకుశం అలియాస్ పానకాలు మేనేజర్. ఒక్కక్షణం ఫైల్‌లోంచి తలెత్తి, కోపంతో బుసలుకొడుతూ 'పానకాలూ' అంటూ గదిగోడలు దద్దరిల్లేలా అరిచాడు. సినిమాల్లో భక్తుడి ముందు భగవంతుడు ప్రత్యక్షమైనట్టు పరాంకుశం ముందు పానకాలు ప్రత్యక్షమయ్యాడు.

**హాస్య కథల పోటీ విభాగంలో కన్సోలేషన్ బహుమతి పొందిన కథ**

చిద్విలాసభరితుడై, పరాంకుశాన్ని చూస్తూ-

"పిలిచారా సార్...?" అడిగాడు పానకాలు.

"కాదు అరిచాను. కాసేపుంటే కరుస్తాను" అన్నాడు పరాంకుశం.

"ఊరుకోండి సార్... మీరు భలే జోకులేస్తారు... మీరేంటీ... కుక్కలా మారి కరవడమేంటీ...?! కొంపదీసి రాత్రేమయినా టీవిలో విఠలాచార్య సినిమాగానీ చూశ్లేదుగదా...?!" అన్నాడు పానకాలు.

"అబ్బా...!" అంటూ రెండు చేతుల్తో, పిచ్చి పట్టినట్టు జుట్టు పీక్కున్నాడు పరాంకుశం.

"ఆ... ఇప్పుడర్థమైంది. మిమ్మలేదో పిచ్చికుక్క కరిచినట్టుంది. ఆ సిమ్టమ్స్ అవే...!"

"పానకాలూ... ఎక్కువ మాట్లాడావంటే ఏకీలుకాకీలు విరిచేసి ఏ వకీలుకీ అందని కేసుని చేసి నిన్ను బొక్కలో తోయిస్తా...!"

"మీరు మరీ ఎక్కువగా ఎమోషనల్ అయిపోతున్నారు సార్... కూల్‌డౌన్...!"

"కూల్‌డౌను కాదు కూల్ అప్పు కాదు. నేను చెప్పేది చెవికెక్కించుకుంటావా?!"

"వూ... అయితే ముందు విషయమేంటో అర్థమయ్యేలా చెప్పండి సార్...!"

"ఇందులో అర్థంకాకపోవడానికేం వుందీ నా సంతకం...!"

"సంతకమా...?! పెట్టేస్తాను... ఎక్కడా...?! ఎన్ని...?! వందా...?! రెండొందలా?!"

"స్టూపిట్...!" ఫైల్‌ని బల్లకేసి గట్టిగా కొట్టి, కోపంగా లేచి నిలబడ్డాడు పరాంకుశం. అతని కోపాన్ని చూసి లోలోపల నవ్వుకుంటూ నిల్చున్నాడు పానకాలు...

ఓ ఫైల్‌లో పదుల సంఖ్యలో పానకాలు పెట్టిన సంతకాల్ని, అతనికి చూపిస్తూ...

"ఏంటిది...?!" గట్టిగా నిలదీశాడు పరాంకుశం.

"అది ఫైల్ కదా సార్... దాని పేరు కూడా మరచిపోయారంటే మిమ్మల్ని కరిచింది పిచ్చికుక్క కాదు... ఖచ్చితంగా 'గజిని' గాడెవడో అయుంటాడు. అందుకే మెమొరీ లాస్ అయ్యారు."

"షటవ్...!" ఈసారి ఆఫీసే అదిరిపోయేలా అరిచాడు పరాంకుశం.

కొంచెం తగ్గాడు పానకాలు.

"ఫైల్స్‌ని వెరిఫై చేసి అవసరమైన చోట ఒక్క సంతకం పెట్టమంటే ఫైల్స్‌ని నీ బోడి సంతకాలతో నింపేస్తావా...?!'

"సారీ సర్... అదీ...!"

"ఆ... ఏదయ్యా...?! నీకంతగా సంతకాల పిచ్చుంటే ఉద్యోగం మానేసి, ఇంట్లో కూర్చుని రామకోటి లాగ సంతకాల కోటి రాసుకో. అంతేగానీ పిచ్చిపట్టినట్టు ఎక్కడపడితే అక్కడ సంతకాలు చేయకు...!"

తప్పు చేసినవాడిలా తలవొంచుకున్నాడు పానకాలు.

"తలొంచుకుని నిలబడినంత మాత్రాన చేసిన తప్పు చెదిరిపోదు మిస్టర్ పానకాలూ...! నువ్విక్కడ నా ముందు తలొంచుకున్నట్టు నేను ఎం.డి. ముందు తలదించుకుని నిలబడలేను గదా...?"

"క్షమించండి సర్... ఇంకెప్పుడూ ఇలా బిహేవ్ చేయను"

"ఈ మాట ఇప్పుడే కాదు, ఉద్యోగంలో చేరినప్పటి నుంచీ కొన్ని వందలు సార్లు చెప్పి ఉంటావు. నీ చేతుల్ని, కొంచెం కంట్రోల్‌లో పెట్టుకో...!"

"అలాగే సర్...!" చేతులు కట్టుకుని, బుద్ధిమంతుడిలా తలాడించాడు పానకాలు.

"ఇదే నీకు ఫైనల్ వార్నింగ్ అని గుర్తుంచుకో...!" స్పష్టం చేశాడు పరాంకుశం.

....

"ఏంటండీ...?! అంత దిగులుగా ఉన్నారు?! మళ్లీ ఇండియాగానీ క్రికెట్‌లో పాకిస్తాన్ చేతిలో ఓడిపోయిందా...?! దిగులుగా కూర్చున్న పానకాలుని అడిగింది అతని భార్య భాగ్యం.

"కాదు. మా మేనేజర్ చేతిలో నేనోడిపోయాను..." బాధతో చెప్పాడు పానకాలు.

"దేనికీ...?!"

"ఈ కుడిచేయి మూలంగా...!"

"ఏం...?! లంచంగానీ తీసుకుంటూ రెడ్‌హ్యాండెడ్‌గా పట్టుబడ్డారా?!"

"కాదు. ఫైల్స్‌నిండా సంతకాలు చేసి బ్లూహ్యాండెడ్‌గా పట్టుబడ్డాను."

"అబ్బా... మీ సంతకాల పిచ్చితో చస్తున్నానుకో...!"



"బాధపడకు భాగ్యం...! పడ్డవాడెప్పుడూ చెడ్డవాడు కాదు. ఈ సంతకాల పిచ్చితోనే ఏదో ఒకరోజు గిన్నిస్ రికార్డ్ సాధించి ఈ పానకాలు పేరు సంతకంలా చిరస్థాయిగా చరిత్రలో నిలిచిపోయేలా చేస్తాను"

''ఏంటి నిలిచిపోయేంది ట్రాఫిక్‌లో వాహనాలూ...!"

''భరించలేను భాగ్యం... వెటకారంగా మాట్లాడి అందరిలా నువ్వూ నా గుండెను తూట్లు పొడవకు...!"

"నీ తూట్ల సంగతి దేవుడెరుగు. మా పాట్ల సంగతి వరికి చెప్పుకోవాలీ . . . !"

"అవమానిస్తున్నావ్ భాగ్యం...!"

"కాదు, అఘోరిస్తున్నాను" అంటూ చేత్తో తల కొట్టుకుని కిచెన్‌లోకి రుసరుసలాడుతూ విసవిసా వెళ్లిపోయింది భాగ్యం.

ఆఫీస్‌కి బయల్దేరుతున్నాడు పానకాలు. బ్యాండేజ్ క్లాత్‌తో అక్కడికొచ్చింది భాగ్యం.

"ఒక్కసారి మీ కుడిచేయి ఇవ్వండి...!" అడిగింది.

"ముద్దుపెట్టుకుంటావా భాగ్యం...?!" మురిపెంగా అడిగాడు పానకాలు.

"కాదు ప్రాయశ్చిత్తం చేసుకుంటాను" అంటూ అతని కుడిచేతిని లాగిపట్టుకుని పానకాలు వారిస్తున్నా, వినకుండా బ్యాండేజ్‌తో వేళ్లు కనపడకుండా కట్టుకట్టింది భాగ్యం.

మొండి చేయిని బాధగా చూసుకున్నాడు పానకాలు.

"ఏంటిది భాగ్యం...?!"

"నా దౌర్భాగ్యం! ఇలాగైనా చేస్తే మీ సంతకాల పిచ్చి కొంతయినా తగ్గుతుందనీ...!"

"అలాగంటావా...?!"

"ఇలాగే అంటాను. ఆఫీస్‌లో చెయ్యి దగ్గర పెట్టుకుని పని చెయ్యండి. వెళ్లండి..." అంటూ భర్తని పంపించేసింది భాగ్యం.

....

ఆఫీస్‌లో అడుగుపెట్టగానే కంగారుగా అతని కొలీగ్స్ అంతా పానకాలు చుట్టూ మూగారు.

"ఏఁవైంది పానకాలూ...?! చేతికెలా దెబ్బతగిలింది?!" అడిగాడు కిరణ్.

"అబ్బా... ఇది దెబ్బ తగలడం వల్ల కాదు. మా ఆవిడ...!"

"కొట్టడం వల్లనా...?!" ఎగతాళిగా అన్నాడు సురేశ్... అంతా గొల్లున నవ్వారు.

"ఎక్కడపడితే అక్కడ సంతకాలు చేయకుండా, మేనేజర్‌తో చీవాట్లు తినకుండా ఉండాలని మా ఆవిడ ఇలా కట్టుకట్టి పంపింది" చెప్పాడు పానకాలు.




"మీ ఆవిడ తెలివైందే కానీ, ఒట్టి అమాయకురాలిలా ఉంది" అన్నాడు వేణు.

"దేనికీ...?!" అడిగాడు పానకాలు.

"కుడిచేయిని కట్టడి చేస్తే సరిపోతుందా?! నువ్వెలాగూ ఎడమచేత్తో సంతకాల ముట్టడి చేయవూ...!" పగలబడి నవ్వాడు కిరణ్.

ఈలోగా ఎం.డి. వస్తున్నట్టు ఇన్‌ఫర్మేషన్ రావటంతో ఎవరి సీట్లలోకి వాళ్లు వెళ్లిపోయారు.

* * * * *

**ఆ**ఫీస్ నుంచి ఇంటికి తిరిగివచ్చిన పానకాలుకి తన ఆరేళ్ల కొడుకు పార్థు ఏడుపు వినిపించింది. కొడుకు వైపు చిరాగ్గా చూశాడు.

"అబ్బా... ఏంట్రా ఇదీ...! ఏడవడానికే పుట్టినట్టు ఎప్పుడూ ఏడుస్తూనే ఉంటావు..?!" కొడుకుని విసుక్కున్నాడు పానకాలు.

"వాడు ఏడవకపోతే, ఆ ఏడుపేదో మీరు ఏడవాల్సి ఉంటుందండీ...!" లోపల్నుంచి వస్తూ అంది భాగ్యం.

"అంటే...?!" అర్థంకానట్టు అయోమయంగా మొహంపెట్టాడు పానకాలు.

"ఏఁవుందీ... మీ కొడుగ్గా పుట్టడం వల్ల పార్థుని వాళ్ల ప్రిన్సిపాల్ వారంరోజుల పాటు స్కూల్ నుంచి డిస్మిస్ చేశారు".

"డిస్మిస్ చేసేంత పెద్ద తప్పు వాడేం చేశాడనీ...?!"

"చేసింది వాడు కాదు. మీరు..."

"నేనా...?!"

"వూ... తమరే...! ఇదిగో చూడండి" అంటూ పార్థు ప్రోగెస్ రిపోర్ట్ చూపించింది. అందులో పేరెంట్స్ సంతకం అని ఉన్న చోటే కాకుండా క్లాస్‌టీచర్, ప్రిన్సిపల్‌ల సంతకాల కోసం కేటాయించిన చోటులో కూడా పానకాలు సంతకం చేసున్నాడు. అది గ్రహించి గిల్టీగా ఫీలౌతూ మౌనం వహించాడు పానకాలు.

"మీ సంతకాల పిచ్చితో మీతో పాటు మేం కూడా బాధలు అనుభవించాల్సి వస్తోంది. భర్త అని కట్టుకున్నాక, భరించక తప్పుతుందా?!"

అంది నిష్ఠూరంగా భాగ్యం. ఆమె వైపు సూటిగా చూసి, కోపంగా వెళ్లిపోయాడు.

★ ★ ★ ★ ★

**"అ**దిరా తమ్ముడూ... మీ బావ సంతకాల పిచ్చితో చచ్చిపోతున్నామనుకో. ఎంత ప్రయత్నించినా ఆయనతో మాన్పించకలేకపోతున్నాను. ఏ వన్నా అంటే 'గిన్నిస్ రికార్డ్' అంటూ అరిగిపోయిన రికార్డులా చెప్పిందే చెప్తుంటారు. అంతా నాకర్మ...!" అంటూ ముక్కుచీది, పైటకొంగుతో కన్నీళ్లు తుడుచుకుంది భాగ్యం.

"డోంట్‌వర్రీ అక్కా! బావ తిక్క ఎలా కుదర్చాలో నాకు బాగా తెలుసు. నాకో నాలుగు రోజులు టైమిచ్చి చూడు...!" అన్నాడు శ్రీనివాస్.

"నాలు రోజులేం కర్మరా.. అవసరమైతే నలభై రోజులైనా తీసుకో...!" అంది భాగ్యం.

"అక్కర్లేదు. నాలుగు రోజులు చాలు. చూస్తూ ఉండక్కా.. బావ సంతకాల పిచ్చినెలా పోగొడతానో....!" స్థిరంగా పలికాడు శ్రీనివాస్.

"మీ సిగ్నేచర్ అదుర్స్ బావా! సచిన్ టెండూల్కర్ సంతకానికి దగ్గరగా ఉంటుందనుకో..." పానకాలుని పొగిడాడు బామ్మర్ది శ్రీనివాస్.

"నిజంవా?!" అబ్బురపడి చాటంత మొహం చేశాడు పానకాలు.

"అవును బావా... మీమీదొట్టు...!" సిన్సియర్‌గా అన్నాడు శ్రీనివాస్.

"సచిన్ సంతకానికి నా సంతకం దగ్గరగా కాకుండా, పూర్తిగా కలిసిపోయేలా, అదే... ఒకేలా ఉండాలంటే ఏం చెయ్యాలి?!" ఆత్రంగా అడిగాడు పానకాలు.

"విపరీతమైన ప్రాక్టీస్ చెయ్యాలి బావా?! ఆలస్యం చేయకుండా వెంటనే ప్రారంభించండి...!" అంటూ తెల్లకాగితాల్ని, పుస్తకాల్ని, పానకాలు ముందుపెట్టాడు శ్రీనివాస్.

పానకాలు పిచ్చిపిచ్చిగా రెచ్చిపోయాడు. పదులు, వందలు, వేల సంఖ్యలో సంతకాలతో తెల్ల కాగితాల్ని, నలుపేస్తున్నాడు. అయినా అతని ఆరాటం తీరలేదు. తీరడమూ లేదు.

"బావా...! ఇలా కాకుండా కళ్లకి గంతలు కట్టుకుని ఇంతే అందంగా, స్పీడుగా సంతకాలు చేస్తే మరింత వాయువేగంతో గిన్నిస్‌బుక్‌లో ఎక్కగలరు...!" అన్నాడు శ్రీనివాస్.

"నిజమా?! అయితే తొందరగా కర్చీఫ్ కళ్లకి కట్టు. ప్రయత్నం చేస్తాను" అంటూ ఆరాటపడ్డాడు పానకాలు. బావ కోరికని మన్నించాడు శ్రీనివాస్. పానకాలు సంతకాలతో విజృంభించాడు. 'అద్భుతం, అమోఘం' అని పొగుడుతూ పానకాలు చెక్‌బుక్‌లోని ఒక చెక్ మీద తెలివిగా బావ సంతకం తీసుకున్నాడు శ్రీనివాస్.

★ ★ ★ ★ ★

**"భా**గ్యం... ఘోరం జరిగిపోయింది. నా బ్యాంక్ అకౌంట్‌లోంచి ఎవరో యాభై వేల రూపాయలు కాజేశారు" అంటూ బయట్నుంచి వస్తూ భోరుమన్నాడు పానకాలు.

"యాభై వేలే...?! ఎవరికంత డబ్బు చెక్ రాసిచ్చారండీ?!" అంది భాగ్యం.

"ఎవరికీ ఇవ్వలేదు భాగ్యం... కానీ ఎలా పోయేయో అర్థం కావడంలేదు...!" చేతులు నలుపుకుంటూ అటూ ఇటూ పచార్లు చేస్తూ అన్నాడు పానకాలు.

"మీరు ఎక్కడపడితే అక్కడ ఇష్టం వచ్చినట్లు సంతకాలు చేస్తారు కదా.... ఎవడన్నా, మీ సిగ్నేచర్‌ని ఫోర్జరీ అయినా చేసి ఉండాలి. లేదంటే తెలివిగా మీ కళ్లుగప్పి మీతోనే మీ చెక్ మీద సంతకమైనా చేయించుకుని ఉండాలి బావా...!" సానుభూతి నటించాడు శ్రీనివాస్.

"నిజంవే... ఈ రెండింటిలో ఏదో ఒకటి జరిగి ఉంటుంది" అన్నాడు బాధగా పానకాలు.

"చేతులు కాలాక ఆకులు పట్టుకుని ఏం ప్రయోజనమండీ! ఆ సంతకాల పిచ్చి మానుకోమని నెత్తీనోరూ కొట్టుకుని చెప్పినా బుర్రకెక్కించుకోలేదు. ఈ రోజు ఎవడో తెలివిగా మీ పిచ్చిని ఆసరాగా చేసుకుని యాభై వేలు కాజేశాడు. రేపు ఏదో ఒకనాడు ఈ ఇంటినీ, పొలాన్నీ, ఆస్తి మొత్తాన్నీ రాయించేసుకుంటాడు. అప్పుడు నేనూ, నా కొడుకూ రోడ్డునపడి ముష్టి ఎత్తుకుంటూ ఉంటాం. మీరేమో గిన్నిస్ రికార్డ్ కోసం ఎదురు చూస్తూ ఉండండి...!" అంటూ ఈసారి గట్టిగా ముక్కుచీది, పైటకొంగుతో కన్నీళ్లు తుడుచుకుంది భాగ్యం.

"లేదు భాగ్యం...! అలా ఎన్నటికీ జరగదు. నాకు గిన్నిస్‌రికార్డ్ కంటే నా భార్యాబిడ్డలే ముఖ్యం. నీ మీద ఒట్టేసి చెప్తున్నా... ఈ రోజు నుంచి సంతకాల పిచ్చికి స్వస్తి పలుకుతున్నాను. నా మాట నమ్ము...!" అంటూ జేబులోని పెన్నుల కట్టని పక్కనపెట్టి స్థిరంగా పలికాడు పానకాలు.

"చాలా సంతోషమండీ! ఇంతకాలంగా మీ నోటివెంట ఈమాట కోసమే ఎదురుచూస్తున్నాను ఇక నాకే బెంగా, బాధ లేదు. నిజంగా నేను అదృష్టవంతురాలినే...!" ఆనందపరవశంతో భర్తను ఉద్దేశించి అంటూ, తమ్ముడి వైపు మెచ్చుకోలుగా, కృతజ్ఞతగా చూసింది భాగ్యం.

☆



# పంచాయితీ స్థానాల్లో పెద్ద సంఖ్యలో మహిళలు
# దేశంలో విప్లవాత్మక పరిణామం

"మహిళల స్థితిగతులు బాగుపడనిదే, సమాజం అభివృద్ధి చెందే అవకాశమే లేదు. ఎందుకంటే, ఒక్క రెక్కపై ఎగరటం పక్షికి సాధ్యం కాదు కనుక", అని స్వామి వివేకానంద అనేవారు. ప్రజాస్వామ్యం అంటే ప్రజల పాలన. రాజకీయ నిర్ణయాల్లో వారు పాలు పంచుకోవాలి. ప్రజలు తమ ఆశలను, అవసరాలను తెలియజేయటానికి ఈ ప్రక్రియను వాడుకుంటారు. తద్వారా ప్రజాస్వామ్యం మరింత పటిష్టమవుతుంది.

మహిళలకు రాజకీయ సాధికారత కల్పించటం చాలా అవసరం. దీనివల్ల మహిళలు అభివృద్ధి చెందుతారు. అంతేకాక, సమాజంలో రాజకీయ నిర్ణయాలు జరిగే ప్రక్రియ న్యాయబద్ధంగా ఉంటుంది. మహిళల్లోని సృజనాత్మకమైన శక్తి సామాజికంగా ఎంతో అవసరం. అది వినియోగంలోకి రానట్లయితే, సుస్థిరాభివృద్ధి సాధించటమనే మాటను దేశం మర్చిపోవాల్సి ఉంటుంది.

భారతదేశంలోని మహిళల చరిత్ర ఇప్పుడొక గొప్ప విప్లవాత్మకదశలో ఉంది. పశ్చిమ దేశాల్లోని మహిళలు ఓటు హక్కులాంటి కనీస హక్కుల కోసం శతాబ్దం పైగా పోరాటం చేయవలసి వస్తే, భారత రాజ్యాంగం మొదటి నుంచే స్త్రీ పురుషులకు సమానహక్కులు ప్రసాదించింది. రాజ్యాంగంలోని 325, 326 అధికరణాలు స్త్రీ, పురుషులకు రాజకీయ సమానత్వాన్ని ఇస్తున్నాయి. రాజకీయ కార్యక్రమాల్లో పాల్గొనే హక్కు, ఓటు చేసే హక్కు స్త్రీ పురుషులకు సమానంగా ఉన్నాయి.

1951 నుంచి మహిళలు రాజకీయాల్లో ఓటర్లుగా పాల్గొంటున్నారు. 1984లో మహిళలు అత్యధిక సంఖ్యలో ఓటు చేశారు (68%). 2004 ఎన్నికల్లో మహిళా ఓటింగ్ 44% శాతం మాత్రమే. ఓటు హక్కును అత్యధిక మంది మహిళలు వినియోగించుకోగా, రాజకీయ కార్యకలాపాల్లో పాల్గొనే హక్కును మాత్రం పెద్దగా ఉపయోగించుకోలేదు. ఇదింకా మొగ్గ దశలోనే ఉంది.

మహిళా ఉద్యమం, 1975ను మహిళా సంవత్సరంగా, 1975-1985 మధ్య సంవత్సరాలను మహిళా దశాబ్దంగా ప్రకటించడం వల్ల మహిళల పట్ల రాజకీయ పార్టీల దృక్పథంలో కొంతమార్పు వచ్చింది. తద్వారా కొందరు మహిళా నాయకులు రాజకీయంగా ముఖ్యమైన స్థానాలకు, అంటే పార్టీ అధ్యక్ష పదవి, శాసనసభాపక్ష నాయకత్వ పదవి వంటి వాటిని అలంకరించగలిగారు. ఉదాహరణకు ఇందిరాగాంధీ, సోనియాగాంధీ, మృణాల్ గోరే, గీతా ముఖర్జీ, విజయరాజె సింధియా, సుష్మా స్వరాజ్, మమతా బెనర్జీ, జయలలిత, మాయావతి, జయాజైట్లీ, షీలాదీక్షిత్, ఉమాభారతి, రబ్రీదేవి వంటి మహిళలు.

ఇటీవలి సంవత్సరాల్లో మహిళల రాజకీయ భాగస్వామ్యాన్ని పెంచటానికి ప్రత్యేకంగా ప్రయత్నాలు జరుగుతున్నాయి. మహిళా రిజర్వేషన్ బిల్లు అమల్లోకి వస్తే, కేంద్ర, రాష్ట్ర స్థాయిల్లో మహిళల రాజకీయ భాగస్వామ్యం బాగా బలపడుతుందని చెప్పవచ్చు.

లోకసభ, రాష్ట్ర శాసనసభల కంటే, పంచాయితీరాజ్ సంస్థల్లో మహిళల ప్రాతినిధ్యం మెరుగ్గా ఉంది. భారత పార్లమెంటరీ ప్రజాస్వామ్య చరిత్రలో 73వ రాజ్యాంగ సవరణ ఒక మైలురాయి వంటిదని చెప్పవచ్చు. ఈ సవరణ ద్వారా గ్రామ, తాలుకా, జిల్లా స్థాయి సంస్థల్లో 33 శాతం స్థానాలను మహిళలకు కేటాయించారు. బీహార్‌లోని స్థానిక సంస్థల్లో 50 శాతం స్థానాలను మహిళలకు రిజర్వు చేశారు.

తద్వారా అంతకుముందు స్థానిక సంస్థల్లో కేవలం 4-5 శాతం ఉండే మహిళా ప్రాతినిధ్యం తక్షణం 25.40 శాతానికి పెరిగింది.



ఇటీవల 2005-06, 2006-07 సంవత్సరాల్లో స్థానికసంస్థలకు జరిగిన ఎన్నికల్లో మహిళలు 37 శాతం వరకు స్థానాలకు ఎన్నికయ్యారు. ప్రస్తుతం గ్రామీణ భారతంలోని స్థానిక పరిపాలనా సంస్థల్లో 12 లక్షల మంది ఎన్నికైన మహిళా ప్రతినిధులు ఉన్నారు. ఇదొక అద్భుతమైన పరిణామం. మన రాష్ట్రంలో వీరి సంఖ్య 87,000 మొత్తం ప్రతినిధుల్లో మహిళల శాతం 42% వరకూ ఉంది. అంటే వారికి కేటాయించిన 33 శాతం కంటే 11 శాతం స్థానాలకు మహిళా ప్రతినధులు అదనంగా ఎన్నికయ్యారన్న మాట.



పంచాయితీ రాజ్ సంస్థలకు పెద్ద సంఖ్యలో ఎన్నికైన మహిళలు పరిపాలనలో గొప్ప మార్పులు తేగలిగారు. ఆత్మవిశ్వాసాన్ని పెంచుకోవటం ద్వారా వనరులు, అధికారులపై వారు పట్టు సంపాదించగలిగారు. అన్నిటికంటే ముఖ్యంగా పురుషాధిపత్యాన్ని సవాలు చేయగలిగారు.

మహిళలకు స్థానాలు కేటాయించటంలో గల ఔచిత్యాన్ని అనేక అధ్యయనాలు సమర్థించాయి. మహిళల నాయకత్వంలో అనేక పంచాయితీల్లో వారి నాయకత్వ పటిమ, భాగస్వామ్యం, పరిపాలనపై మంచి ప్రభావాన్ని కనబరిచాయి. నిధుల వినియోగం చక్కగా జరిగింది. పంచాయితీల పాలనా దృష్టి రాజకీయ అధికారపు ఎత్తులు, జిత్తుల నుంచి ప్రజలకు మంచినీరు, ఆరోగ్య సదుపాయాలు, విద్యాసదుపాయాలు కల్పించటం, వంటచెరకు, పారిశుద్ధ్యానికి సంబంధించిన సమస్యలను పరిష్కరించటం వంటి అంశాలకు మళ్లింది.

## పంచాయితీ సంస్థల్లో మహిళా ప్రతినిధులు సాధించిన కొన్ని విజయాలు

### ఊర్మిళా యాదవ్ (56)

హర్యానాలోని కోస్లి గ్రామానికి పంచాయితీ సర్పంచ్‌గా ఉన్న ఊర్మిళ గ్రామంలో అత్యంత తీవ్రమైన మంచినీటి ఎద్దడి సమస్యను పరిష్కరించగలిగారు. అంతేకాక, వరకట్న వ్యతిరేక కమిటీలను,



మహిళా సాధికారతా కమిటీలను ఆమె పంచాయితీలో ఏర్పాటు చేశారు. ఈ కమిటీలు మహిళలపై జరిగే అరాచకాలు, అత్యాచారాలు, వేధింపుల కేసులను చేపడతాయి. పంచాయితీ ఆదాయం పెంచటానికి స్థానిక టెలిఫోన్ ఎక్స్ఛేంజ్‌కి, పశువైద్యశాలకు పంచాయితీ భూమిని ఆమె అద్దెకు ఇచ్చారు.నేడు హర్యానాలో అత్యంత అభివృద్ధి చెందిన ఆదర్శ గ్రామంగా కోస్లి తయారైంది. ఇందుకు కారణం సర్పంచ్‌గా సమర్థవంతమైన సేవలందిస్తున్న ఊర్మిళానే.

### పొన్ని కైలాసం (40)

తమిళనాడులోని తిరువాయూర్ జిల్లాలోని అన్నైకుప్పం గ్రామపంచాయితీకి పొన్ని కైలాసం 1996లో సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. గ్రామస్తుల ప్రోద్బలంతో ఎన్నికల్లో పోటీ చేసి గెలుపొందారు. ఆమె సర్పంచ్ అయినప్పుడు, ఏడాదికి ఇంటిపన్ను వసూలు గ్రామం మొత్తానికి 500 రూపాయలు మాత్రమే ఉండేది. ఇంటిపన్ను పెంచటమే కాక, మొత్తం పన్ను వసూలయ్యేలా చర్యలు తీసుకోవటంతో అది ఏడాదికి 18,000 రూపాయలకు చేరుకుంది. ఆమె ప్రజలందరినీ విశ్వాసంలోకి తీసుకోవటమే కాక, గ్రామం మొత్తంలో ఐకమత్యాన్ని సాధించారు. అభివృద్ధి పనులకు వనరులను సమీకరించటంలో ఆమె తన సామర్థ్యాన్ని నిరూపించుకున్నారు.

### సుధా పటేల్ (25)

గుజరాత్‌లోని సర్దార్ పటేల్ యూనివర్సిటీలో పోస్టు గ్రాడ్యుయేషన్ చేసిన సుధా పటేల్ భారతదేశంలో మొదటి అంధ సర్పంచ్. గట్టి పోటీని ఎదుర్కొని ఆమె చంగా గ్రామానికి సర్పంచ్‌గా ఎన్నికయ్యారు. వెంటనే ఆమె ప్రత్యర్థులు నీటి ఎద్దడి సమస్యను లేవనెత్తారు. కొంత హింస కూడా ప్రజ్వరిల్లింది. అయితే, సుధా పటేల్ తన శాంతాన్ని, ఓర్పుని కోల్పోలేదు. పోలీసులను పిల్చింది. సమస్య పరిష్కారమయింది. కుటుంబ నియంత్రణ, కార్మికుల పిల్లలకు ఓపెన్ స్కూలు, ప్రజా వైద్యశాల, కాన్ఫరెన్స్ హాలు, స్థానిక పాఠశాలలో కంప్యూటర్ల ఏర్పాటు వంటి అనేక పనులను ఆమె చేపట్టారు. అంధులు, మానసిక

వికలాంగుల కోసం ఆమె ఒక పునరావాస ప్రాజెక్టును కూడా నిర్వహిస్తున్నారు. తను సాధించిన విజయాలకు గాను ఆమెకు 'అవుట్‌స్టాండింగ్ పర్సన్ ఆఫ్ ది వరల్డ్' అనే అవార్డును కూడా అందుకున్నారు.





**పాతిమా బీ**

ఆంధ్రప్రదేశ్‌లోని కర్నూలు జిల్లాలో ఓర్వకల్లు మండలంలోని కాల్వ గ్రామానికి సర్పంచ్‌గా పనిచేసిన ఫాతిమాబీ రాష్ట్ర ప్రభుత్వం నుంచి ఉత్తమ సర్పంచ్ అవార్డు అందుకున్నారు. గ్రామ పరిస్థితులను అద్భుతంగా మెరుగుపరిచినందుకు ఆమె ఈ పురస్కారం పొందారు. పేదరికానికి వ్యతిరేకంగా పోరాడినందుకు యుఎన్‌డిపి ఇచ్చే అవార్డును కూడా ఆమె పొందారు. తొలుత సర్పంచ్‌గా పనిచేయటానికి సహాయపడినప్పటికీ, వివిధ కార్యక్రమాల్లో పాల్గొనటం ద్వారా ఆమె ఆత్మవిశ్వాసం పొంది, విజయవంతమైన మహిళా సర్పంచ్‌గా పేరు తెచ్చుకున్నారు.

**కిమిడి సీతామహాలక్ష్మి**

తూర్పుగోదావరి జిల్లాలోని కరప మండల అధ్యక్షురాలిగా ఎన్నికైన సీతామహాలక్ష్మి ఒక చురుకైన, నిజాయితీ కలిగిన నిస్వార్థ మహిళ. యాచక వృత్తిలో ఉన్న అనేకమంది ఆ వృత్తి మానుకొని, స్వయం సహాయ బృందాల్లో సభ్యులుగా చేరి, కష్టపడి పనిచేసి సంపాదించుకుంటూ, గౌరవంగా బతికేలా ఈమె మార్చగలిగారు.

అదే విధంగా, ఇదే జిల్లాలోని తుని మండలాధ్యక్షురాలైన విజయలక్ష్మి, కొత్తపేట మండలాధ్యక్షురాలైన బూసి విజయలక్ష్మి కూడా విజయవంతమైన మహిళా నాయకురాళ్లుగా పేరు తెచ్చుకున్నారు.

తమిళనాడులోని వెల్లూరు జిల్లాలో గల కాట్పడి పంచాయితీ అధ్యక్షురాలైన సురమంజరి అనేక వినూత్న కార్యక్రమాలు చేపట్టారు. కులాంతర వివాహాలు, వితంతు వివాహాలు చేశారు. న్యూఢిల్లీలోని ఇన్‌స్టిట్యూట్ ఆఫ్ సోషల్ సైన్సెస్ వారు ఆమెకు అత్యుత్తమ పంచాయితీ నాయకురాలి అవార్డు ఇచ్చి సత్కరించారు.



స్థానిక ప్రభుత్వ పాలనలో మహిళలు పాలు పంచుకోవటం వారి రాజకీయ సాధికారతలో ఒక ప్రధానమైన ముందడుగు. అసలు బలహీన వర్గాలకు చెందిన మహిళలు పంచాయితీ సమావేశాలకు హాజరవటమే ఒక ముందడుగు. కొందరు మహిళలయితే తమ భాగస్వామ్యాన్ని చురుగ్గా నిర్వర్తించటం ద్వారా ఇతరులకు ఆదర్శంగా నిలిచారు.

మహిళా ప్రతినిధులు స్థానిక పరిపాలనా వ్యవస్థలో ఉన్నట్లయితే, ఇతర మహిళలకు తమ అవసరార్థం వారి దగ్గరకు వెళ్లటం తేలికగా ఉంటుంది. అంతేకాక, పలువురు మహిళా ప్రతినిధులకు స్వంత కుటుంబంలో కూడా పరిస్థితులు మెరుగయ్యాయి.

అయితే, స్థానిక పరిపాలనలో పాల్గొనటంలో మహిళలు అనేక ఇబ్బందులు కూడా ఎదుర్కొంటున్నారు. అనుభవరాహిత్యం, నిరక్షరాస్యత, కుటుంబ బాధ్యతలు, సమాజ పరిమితులు, సరైన ప్రోత్సాహక వాతావరణం లేకపోవటం, హింస, గృహహింస, వేధింపులు, క్యారెక్టర్‌పై నిందలు మోపటం, నూతన పదవి కారణంగా కుటుంబంలో పెరిగే వేధింపులు వంటివి ఇందులో ఉన్నాయి. స్థానిక రాజకీయాల్లో చురుగ్గా పాలుపంచుకుంటున్నందుకు కొంతమంది మహిళలు తమ ప్రాణాలు సైతం కోల్పోయారు.



అయితే ఎన్ని ఆటంకాలు, అవరోధాలు ఉన్నప్పటికీ, కుటుంబ సభ్యులు, కొన్నిచోట్ల భర్తలు, ప్రత్యేకించి కుటుంబంలోని ఇతర మహిళలు ఈ మహిళా నాయకురాళ్లకు ఎంతో సహాయంగా, ప్రోత్సాహంగా ఉన్నారు. ప్రజాజీవితంలో మహిళలు పాల్గొనటంపై ఉన్న ఆటంకాలు నెమ్మదిగా తగ్గిపోతున్నాయి. కాలం గడిచేకొలదీ ఈ మార్పు మరింత వేగవంతమవుతుంది. ఇట్లా పనిచేసిన మహిళల్లో కొందరు తిరిగి ఎన్నికల్లో నిలబడి గెలిచారు. కొందరయితే, జనరల్ స్థానాల నుంచి గెలవటం విశేషం. వీరిలో కొందరి ఆత్మవిశ్వాసం, అవగాహన బాగా పెరగటంతో రాజకీయంగా ఉన్నత స్థానాలను అందుకోవాలని ఆశిస్తున్నారు.

స్థానిక ప్రభుత్వ పరిపాలనా వ్యవస్థకు ఎన్నికైన మహిళా ప్రతినిధులకు అండగా ఉండే వ్యవస్థలు కూడా ప్రభుత్వ ఆధ్వర్యంలో ఉన్నాయి. ప్రభుత్వ ఆధ్వర్యంలో నడిచే శిక్షణా సంస్థలు, పౌర సంస్థలు అనేకం ఈ మహిళా ప్రతినిధులకు శిక్షణ అందిస్తూ, వారి సామర్థ్యాన్ని పెంచుతున్నాయి. అంతేకాక, విస్తృతంగా వ్యాపించిన స్వయం సహాయక బృందాల నుంచి కూడా మహిళా నాయకత్వం ఆవిర్భవిస్తోంది.

ఆ విధంగా, రాజకీయాల్లో పనిచేస్తున్న మహిళలు అజ్ఞానం నుంచి జ్ఞానం వైపు, అయిష్టత నుంచి ఆత్మవిశ్వాసం వైపు, ప్రేక్షక స్థానం నుంచి క్రియాశీల పాత్ర వైపు కదిలారు. సమస్యల పరిష్కారంలో, అందరినీ కలుపుకుని పోవటంలో, పరిపాలనను సమర్థవంతంగా నిర్వహించటంలో వారు అసాధారణమైన శక్తి సామర్థ్యాలను ప్రదర్శిస్తున్నారు.

తమ హుందాతనాన్ని కాపాడుకుంటూ, ప్రజాస్వామిక విలువలను పెంపొందించటంలో కూడా వీరు ముందు స్థానాల్లో ఉండటం విశేషం.

***- ఎస్. శారదా దేవి***

జూనియర్ ఫ్యాకల్టీ, అపార్డ్

*(అనువాదం: రాధాకృష్ణ)*



# మహిళా హక్కులు, చట్టాలు

ఐక్యరాజ్య సమితి 1945లోనే ప్రకటించిన చార్టర్ ఆఫ్ ది యునైటెట్ నేషన్స్ స్త్రీ పురుషుల సమాన హక్కుల పట్ల ఉన్న విశ్వాసాన్ని పునరుద్ఘాటించింది.

వివక్షత అంగీకరించరాదన్న సూత్రాన్ని బలపరుస్తూ, మానవులందరూ పుట్టుకతో స్వేచ్ఛా జీవులని, లింగపరమైన విషయంతో సహ ఏ విషయము లోను ఏ విధమైన వివక్షత చూపరాదని అంతర్జాతీయ మానవ హక్కుల ప్రకటన ప్రకటించినది.

స్త్రీ పురుషులకు సమానంగా ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, పౌర, రాజకీయ హక్కులను ఖాయపరిచే విధంగా చూడాలని, మానవ హక్కులపై భాగస్వామ్య దేశాలు బాధ్యత వహించాల్సి ఉంటుందని అంతర్జాతీయ ఒప్పందాలలోని అంశాలు సూచించాయి.

అయినప్పటికీ స్త్రీల పట్ల తీవ్రమైన వివక్షత కొనసాగుతున్న దృష్ట్యా, స్త్రీల పట్ల వివక్షత సమాన హక్కుల సూత్రాలకు, మానవుని గౌరవాన్ని కాపాడటానికి భంగం కలిగిస్తున్నదని, పురుషులతో సమానంగా స్త్రీలు రాజకీయ, సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక జీవితాన్ని స్త్రీలు గడపటానికి ఆటంకమవుతుందని, సమాజ, కుటుంబ అభ్యున్నతి పురోగమనాన్ని ఆటంక పరుస్తూ తమ దేశాలు, మానవాళి కొరకు స్త్రీలు తమ శక్తి సామర్థ్యాలను వినియోగించటాన్ని పూర్తి స్థాయిలో అభివృద్ధి చేయుటను మరింత క్లిష్టతరం చేస్తుందని గమనించి;

పేదరికంలో ఉన్న మహిళల ఆహారం, ఆరోగ్యం, విద్య, శిక్షణ, ఉద్యోగ అవకాశాలు, ఇతర అవసరాలు కష్టమవుతున్నాయని భావించి;

సమానత్వం, న్యాయం ప్రాతిప దికన ఏర్పడే నూతన అంతర్జాతీయ ఆర్థిక విధానం స్త్రీ పురుషుల సమానత్వాన్ని అభివృద్ధి చేయటానికి ఎంతగానో దోహదం చేస్తుందని అంగీకరించి;

దేశ పరిపూర్ణమైన అభివృద్ధి, ప్రపంచ సంక్షేమం, శాంతి ప్రాతిపదికన స్త్రీలు పురుషులతో సమానంగా అన్ని రంగాలలోను పూర్తిస్థాయిలో పాల్గొనటం అవసరమని గుర్తించి;

కుటుంబ సంక్షేమానికి, సమాజ అభివృద్ధికి స్త్రీల గొప్ప సహాయాన్ని గమనంలో ఉంచుకొని, మాతృత్వం, కుటుంబములోను, పిల్లల పెంపకంలోను తల్లిదండ్రుల ఇద్దరి పాత్ర ఇప్పటి వరకు సరిగా గుర్తింపబడలేదని; పిల్లలను కనడంలో స్త్రీలు నిర్వహిస్తున్న పాత్ర వివక్షతలకు ప్రాతిపదిక కారాదని, పిల్లల పెంపకం విషయంలో స్త్రీలు, పురుషులు, సమాజం మొత్తం బాధ్యతలు పంచుకోవలసిన అవసరం ఉందన్న విషయాన్ని గమనంలో ఉంచుకొని;

సమాజంలోను, కుటుంబములోను స్త్రీ పురుషులు నిర్వహిస్తున్న సంప్రదాయక పాత్రలో మార్పు తీసుకురావటం స్త్రీ పురుషుల సమానత్వాన్ని పూర్తి స్థాయిలో సాధించటానికి అవసరం అని భావించి స్త్రీలు ఎదుర్కొంటున్న అన్ని రకాల వివక్షతలను ఎదుర్కొనుటకు ప్రకటన చేసి అందుకు అవసరమైన చర్యలను తీసుకోవాలనే సంకల్పంతో ఐక్యరాజ్య సమితి జనరల్ అసెంబ్లీ స్త్రీల పట్ల అన్ని రకాల వివక్షతలను తొలగించుటకు 1979లో ఏర్పాటు అయిన సదస్సు ప్రకటించినది. దీనినే "కన్వెన్షన్ ఆన్ ది ఎలిమినేషన్ ఆఫ్ ఆల్ ఫామ్స్ ఆఫ్ డిస్‌క్రిమినేషన్ ఎగైనెస్ట్ ఉమెన్" (CEDAW) అంటారు.

1993లో భారతదేశం కూడా ఈ సదస్సులో భాగస్వామి అయింది. అయితే భారతదేశంలో స్త్రీల రక్షణ కొరకు చట్టాలు రూపొందించటం గత శతాబ్దకాలం నుండే జరుగుతున్నది. స్త్రీల పట్ల జరుగుతున్న అన్యాయాలు, అక్రమాలపై భారతదేశంలో సంఘసంస్కరణోద్యమం గొప్ప దండయాత్రనే చేసింది. రాజారామ్ మోహన్‌రాయ్, ఈశ్వరచంద్ర విద్యాసాగర్, కందుకూరి వీరేశలింగం, గురజాడ అప్పారావు వంటి సంస్కర్తలెందరో నిర్వహించిన సంఘసంస్కరణ ఉద్యమం స్వాతంత్ర్య ఉద్యమంతో పెనవేసుకొని సాగింది. భారతదేశంలో మహిళోద్ధారణ జరుగకుండా, వారిని సాంప్రదాయ బంధనాల నుండి విముక్తులను చేసి స్వాతంత్ర్యోద్యమంలో భాగస్వాములను చేయకుండా భారతదేశ స్వతంత్రం కోసం జరుగుతున్న జాతీయోద్యమంలో విడదీయరాని భాగమైంది.

సంస్కరణోద్యమ ప్రభావం భారతదేశంలో రూపొందిన మహిళా రక్షణ చట్టాల మీద స్పష్టంగా కనబడుతుంది. మహిళల రక్షణకు బాల్యవివాహాలను నిషేధిస్తూ 1929లోనే శారదా చట్టం రూపొందించబడింది.



## భారత రాజ్యాంగం – స్త్రీలు

సంస్కరణోద్యమం మిళితమైన భారత జాతీయోద్యమ స్ఫూర్తిగా ఏర్పడిన భారత రాజ్యాంగం స్త్రీల సమాన హక్కులకు ఎంతో ప్రాధాన్యతనిచ్చింది. ప్రాథమిక హక్కుల్లోని 14వ అధికరణలో చట్టం ముందు అందరూ సమానులే అని చెప్పడంలో స్త్రీ పురుషుల సమానత్వం కూడా ఇమిడి ఉన్నది.

15వ అధికరణలో మతం, జాతి, కులం, లింగ, జన్మస్థలం ప్రాతిపదికన ప్రభుత్వం ఏ పౌరుని యెడల వివక్షత చూపరాదని పేర్కొన్నారు.

అయితే స్త్రీలకు, పిల్లలకు ప్రత్యేక చట్టాలను ప్రభుత్వం రూపొందించుటకు ఈ అధికరణ ఆటంకం కాదని ఈ అధికరణలోని క్లాజు (3)లో పేర్కొన్నారు.

21వ అధికరణలో పొందుపరచబడిన జీవించే హక్కులో స్త్రీలు జీవించే హక్కుకూడా ఉన్నది. పని ప్రదేశాల్లో మహిళల పట్ల లైంగిక వేధింపులు వారి జీవించే హక్కును ఉల్లంఘించటమేనని వైశాఖ VS స్టేట్ ఆఫ్ రాజస్థాన్ కేసులో సుప్రీంకోర్టు పేర్కొన్నది.

అశ్లీలమైన పద్ధతుల్లో మానవులను ఉపయోగించడాన్ని 23వ అధికరణ నిషేధిస్తుంది. దేవదాసీ విధానం కూడా దాని క్రిందకు వస్తుందని సుప్రీంకోర్టు విశాల్ జీత్ కేసులో తీర్పునిచ్చింది.

73 మరియు 74 రాజ్యాంగ సవరణల ద్వారా స్థానిక సంస్థల ఎన్నికల్లో మహిళలకు 3వ వంతు రిజర్వేషన్‌ను కల్పించారు.

CEDAW లోని ఆర్టికల్ ఒకటి "మహిళల పట్ల వివక్షత" అనే పదానికి అర్థం లింగ ప్రాతిపదికపై స్త్రీ తన హక్కులను వినియోగించుకోవటాన్ని పరిమితం చేసే ఎట్టి చర్యయైనా వారి వైవాహిక అంతస్తుతో నిమిత్తం లేకుండా స్త్రీ పురుష సమానత్వ ప్రాతిపదికన మానవ హక్కులను, రాజకీయ, ఆర్థిక, సాంఘిక, సాంస్కృతిక, పౌర, ఏదేని ఇతర రంగంలో వినియోగించుకోవటాన్ని లింగ ప్రాతిపదికపై వేరు చేయుటం, మినహాయించటం లేదా పరిమితం చేయటమే స్త్రీలయెడల వివక్షతకు అర్థం అని తెలియజేస్తుంది.

సభ్యదేశాలు స్త్రీల యెడల అన్నిరకాల వివక్షతలు ఖండిస్తూ, స్త్రీల యెడల అన్నిరకాల వివక్షతను రూపుమాపటానికి ఒక విధానాన్ని ఏమాత్రం ఆలస్యం చేయకుండా తగురీతిలో రూపొందించటానికి అంగీకరించి అందుకొరకు;

(ఎ) తమ జాతీయ రాజ్యాంగాలలో స్త్రీ పురుష సమానత్వ సూత్రాన్ని పొందుపరచటానికి, ఈ సూత్రాన్ని ఆచరణలో అమలు చేయుటకు చట్టపరంగాను, ఇతర తగిన రీతులలోను ఇప్పటికే ఏర్పాటు చేయకపోయినట్లయితే అందుకు అనుగుణమైన చట్టాలను రూపొందించటం;

(బి) మహిళల యెడల అన్నిరకాల వివక్షతను నిషేధిస్తూ అవసరమైన చట్టాలు రూపొందించుట, ఇతర చర్యలు చేపట్టుట;

(సి) పురుషలతో సమానంగా స్త్రీ హక్కులకు న్యాయపరమైన రక్షణ ఏర్పాటు చేయుట జాతీయ ట్రిబ్యునల్, ఇతర ప్రజాసంస్థల ద్వారా స్త్రీలను వివక్షతను గురిచేసే చర్యల నుండి సరియైన రక్షణ కల్పించటం;

(డి) మహిళలను వివక్షతకు గురిచేసే ఎట్టి చర్యలను చేపట్టకుండా ఉండటం, పబ్లిక్ అథారిటీలు, సంస్థలు ఇట్టి బాధ్యతలకు అనుగుణంగా వ్యవహరించేటట్లు చూడటం;

(ఇ) వ్యక్తి, సంస్థ లేదా పరిశ్రమల నుండి మహిళలను వివక్షతకు గురి చేయడాన్ని తొలగించుటకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టుట;

(ఎఫ్) మహిళలకు వివక్షత కలిగించేటటువంటి చట్టాలను, రెగ్యులేషన్‌లను, సాంప్రదాయాలను, ఆచరణలను సవరించటానికి లేదా రద్దు చేయుటానికి చట్టాలను చేయుటంతో సహా అన్ని రకాల అవసరమైన చర్యలను చేపట్టుట;

(జి) తమ జాతీయ శిక్షాస్మృతులలోని మహిళలను వివక్షతకు గురిచేసే అంశాలను తొలగించుటకు సభ్యదేశాలు బాధ్యత తీసుకొన్నాయని CEDAW లోని ఆర్టికల్ 2లో చెప్పబడినవి.

పురుషులతో సమానత్వ ప్రాతిపదిక మీద స్త్రీలు మానవ హక్కులను, ప్రాథమిక స్వాతంత్రాన్ని అనుభవించుటకు హామీ ఇచ్చే విధంగా స్త్రీలు పూర్తి స్థాయిలో అభివృద్ధి, పురోగతి చెందుటకు రాజకీయ, సాంఘిక, ఆర్థిక, సాంస్కృతిక రంగాలతో సహా అన్ని రంగాలలో చట్టాలను రూపొందించుటంతో సహా అన్ని రకాల చర్యలను సభ్యదేశాలు చేపట్టాలని CEDAW లోని 3వ ఆర్టికల్‌లో పేర్కొన్నారు.

స్త్రీ పురుషుల మధ్య సమానత్వాన్ని వాస్తవ రూపంలోనికి తీసుకు వచ్చే లక్ష్యంతో సభ్యదేశాలు చేపట్టే ప్రత్యేకమైన తాత్కాలిక చర్యలను ఈ కన్‌వెన్షన్‌లో నిర్వహించిన వివక్షతగా పరగణించరాదు. కాని అసమానత లేదా వేరువేరు ప్రమాణాలను ఏర్పరచరాదు;

సమాన అవకాశాల లక్ష్యాన్ని సాధించిన తరువాత ఈ చర్యలను ఆపివేయాలి. మానవత్వాన్ని రక్షించటం కోసం ఈ కన్‌వెన్షన్‌లో పేర్కొన్న చర్యలతో సహా సభ్యదేశాలు చేపట్టే ప్రత్యేక చర్యలను వివక్షతగా పేర్కొన రాదు అని CEDAW లోని 4వ ఆర్టికల్‌లో చెప్పబడింది.

## సాంప్రదాయాలు – కుటుంబ విద్య

(ఎ) స్త్రీలు, పురుషుల సాంప్రదాయక పాత్రలు లేదా ఒకరిని ఎక్కువ చేసి మరి ఒకరిని తక్కువ చేసే ఆలోచనల ప్రాతిపదికపైన ఉన్న అన్ని రకాల ఇతర ఆచరణలు, సాంప్రదాయాలు, వివక్షతను తొలగించుటకు అనుగుణంగా స్త్రీలు, పురుషుల సాంఘిక, సాంస్కృతిక పద్ధతులను సవరించటం;

(బి) అన్ని అంశాలలోను పిల్లల ప్రయోజనాలే ప్రాధాన్యతగా కల దృష్టితో అవగాహన కలిగి ఉండి, మాతృత్వం ఒక సామాజిక బాధ్యత అనే అవగాహన కలిగించే విధంగాను, పిల్లల పెంపకంలో స్త్రీలు, పురుషుల సమిష్టి బాధ్యతను గుర్తించే విధంగాను కుటంబ విద్యను కల్పించడానికి సభ్యదేశాలు అవసరమయిన అన్ని చర్యలను చేపట్టాలని లోని CEDAW 5వ ఆర్టికల్ లో పేర్కొన్నారు.

## వ్యభిచార నిరోధక చట్టాలు

అనైతిక కార్యక్రమాలకు స్త్రీలను వినియోగించడాన్ని, వ్యభిచారము వంటి పద్ధతులలో స్త్రీలను దోపిడిచేయడాన్ని అణిచివేస్తూ చట్టాలు చేయడంతో సహా అన్ని రకాల చర్యలను సభ్యదేశాలు చేపట్టాలని CEDAW 6వ ఆర్టికల్ లో పేర్కొన్నారు.

భారతదేశంలో ఇందుకోసం అనైతిక కార్యక్రమాల నిరోధక చట్టం 1956, స్త్రీల అశ్లీల ప్రదర్శన నిషేధ చట్టం 1986 జారీ చేయబడ్డాయి.

## ఎన్నికల్లో ఓటు

దేశంలోని రాజకీయ, ప్రజా జీవితంలో స్త్రీలయెడల వివక్షతను తొలగించడానికి, నిర్దిష్టంగా స్త్రీలు పురుషులతో సమానంగా,

(ఎ) అన్ని ఎన్నికలలోను, పబ్లిక్ రెఫరెండాల్లోను ఓటు చేయుట, ప్రజలచే ఎన్నికకాబడే సంస్థలకు ఎన్నిక అవడానికి అర్హత కలిగి ఉండుట;

(బి) ప్రభుత్వ విధాన నిర్ణయాలను రూపొందించుటలోను, వాటిని అమలు జరుపుటలోను పాల్గొనుట, పబ్లిక్ ఆఫీసెస్‌ను నిర్వహించుట, ప్రభుత్వము యొక్క అన్ని స్థాయిలోను పబ్లిక్ ఫంక్షన్‌ను నిర్వహించుట;

(సి) దేశము ప్రజా, రాజకీయ జీవితంతో సంబంధము ఉన్న ప్రభుత్వేతర ఆర్గనైజేషన్లు, అసోసియేషన్‌లలో పాల్గొనుట;

తమ హక్కులను వినియోగించుకోవడములో స్త్రీలయెడల వివక్షతను తొలగించుటకు అవసరమయిన అన్ని చర్యలు చేపట్టాలని CEDAW 7వ ఆర్టికల్‌లో పేర్కొన్నారు.

## అంతర్జాతీయ సంస్థల్లో స్త్రీలు

తమ ప్రభుత్వాలకు అంతర్జాతీయ స్థాయిలో ప్రాతినిధ్యం వహించడానికి, అంతర్జాతీయ సంస్థల పనిలో, స్త్రీలు వివక్షతకు గురికాకుండా పురుషులతో సమానంగా పాల్గొనడానికి అవసరమైన అన్ని చర్యలను చేపట్టాలని CEDAW లోని 8వ ఆర్టికల్‌లో పేర్కొన్నారు.

## స్త్రీలు – జాతీయత

జాతీయతను పొందుటకు, కొనసాగించుటకు, మార్చుకొనుటకు, స్త్రీలకు పురుషులతో సమాన హక్కును కల్పించాలి. విదేశీయుని వివాహము చేసుకొనటం వలన గాని లేదా వైవాహిక జీవిత కాలంలో భర్త తన జాతీయతను మార్చుకొనడము వల్లగానీ భార్య యొక్క జాతీయత మారి ఆమెపై భర్త జాతీయత రుద్దబడకుండా ఉండే విధంగా చూడాలి.

వారి పిల్లల జాతీయత విషయములో కూడా స్త్రీలకు పురుషులతో సమాన హక్కులను కల్పించాలని CEDAW లోని 9వ ఆర్టికల్‌లో పేర్కొన్నారు.

## విద్యా విషయాలలో

విద్యలో స్త్రీలు పురుషులతో సమానంగా ఉండుటకు అవసరమైన అన్ని చర్యలు చేపట్టాలని లోని 10వ ఆర్టికల్‌లో పేర్కొన్నారు.

(ఎ) అన్ని రకాల వృత్తి విద్యా శిక్షణలలోను, ప్రిస్కూలు, సాధారణ, సాంకేతిక, వృత్తి, ఉన్నత సాంకేతిక విద్యలో, గ్రామీణ, పట్టణాల్లోని అన్ని రకాల విద్యా సంస్థల్లో సమాన అవకాశాలు కల్పించుట;

(బి) పాఠశాల ప్రాంగణము, అర్హత కలిగిన బోధనా సిబ్బంది, పాఠ్యప్రణాళిక, పరికరాల విషయంలో సమాన అవకాశాలు;

(సి) అన్నిరకాల విద్యా పద్ధతుల్లో స్త్రీ పురుషుల పాత్రకు సంబంధించి సనాతన పద్ధతులను తొలగించుటకు, కో ఎడ్యుకేషన్‌ను ప్రోత్సహించుటకు, నిర్దిష్టంగా పాఠ్యపుస్తకాలలోను, పాఠశాల కార్యక్రమాలలోను బోధనా పద్ధతులలోను అవసరమైన మార్పులు చేయుట;

(డి) స్కాలర్‌షిప్‌ల ద్వారా, ఇతర స్టడీ గ్రాంట్‌ల ద్వారా చేకూర్చే ప్రయోజనాలలో సమాన అవకాశాలు;

(ఇ) వయోజన విద్య, అక్షరాస్యత కార్యక్రమాలు, నిర్దిష్టంగా స్త్రీ పురుషుల మధ్య విద్యా విషయాలలో ఉన్న తేడాను సాధ్యమైనంత త్వరగా తగ్గించటానికి చేపట్టే కార్యక్రమాలలో సమాన అవకాశాలు;

(ఎఫ్) మధ్యలోనే చదువు మానివేసిన బాలికలు మరియు మహిళల కొరకు ప్రత్యేక కార్యకమాలను నిర్వహించుట ద్వారా విద్యార్థినులలో డ్రాప్ అవుట్‌లను తగ్గించుట;

(జి) ఆటలలోను, శారీరక విద్యలోను పాల్గొనుటకు సమాన అవకాశాలు కల్పించుట;

(హెచ్) కుటుంబ నియంత్రణపై సమాచారము, సలహాలతో సహా, ఆరోగ్యము, కుటుంబ సంక్షేమాన్ని దృవీకరించుటకు సహాకరించే విధంగా సమాచారాన్ని ఇచ్చే నిర్ధిష్ట విద్యకు అవకాశం కల్పించుట

## ఉద్యోగ విషయాలలో

1) ఉద్యోగ విషయాలలో స్త్రీల పట్ల వివక్షతను తొలగించుటకు స్త్రీ పురుష సమానత్వం, సమాన హక్కులు ప్రాతిపదిక మీద చర్యలు చేపట్టాలని CEDAW లోని 11వ ఆర్టికల్‌లో పేర్కొన్నారు.

(ఎ) పనిచేసే హక్కు అనేది మానవుల నుండి విడదీయడానికి వీలు లేని హక్కు;

(బి) ఉద్యోగాలకు ఎంపిక ప్రక్రియలో ఒకే ప్రాతిపదికను నిర్ణయించటంతో సహా ఉద్యోగ అవకాశాలలో సమాన హక్కు;

(సి) రికరెంట్ ట్రైనింగ్, అడ్వాన్స్‌డ్ ఒకేషనల్ ట్రైనింగ్, అప్రెంట్ షిప్‌లతో సహా వృత్తిపరమైన శిక్షణ స్వీకరించే హక్కు, కావలసిన వృత్తిని మరియు ఉద్యోగాన్ని స్వేచ్ఛగా ఎంచుకొనే హక్కు, ప్రమోషన్, కండిషన్స్ ఆఫ్ సర్వీస్‌లో సమానహక్కు;

(డి) సమాన పనికి సమాన వేతనము, అలాగే పని నైపుణ్యాన్ని పెంచడంలో సమాన అవకాశాలు;

(ఇ) సామాజిక భద్రత హక్కు నిర్దిష్టంగా పదవీ విరమణ, నిరుద్యోగం, అనారోగ్యం, అశక్తత, వృద్ధాప్యం, ఇతర అశక్తతలు ఏర్పడినప్పుడు, సెలవు వేతన హక్కు;

(ఎఫ్) ఆరోగ్య రక్షణ హక్కు, పునరుత్పత్తి ప్రక్రియను కాపాడటంతో సహా పని ప్రదేశాల్లో భద్రత;

(2) వివాహము లేదా మాతృత్వం కారణంగా స్త్రీలు ఎదుర్కొంటున్న వివక్షతను నివారించుటకు, శక్తి వంతమైన వారి పని హక్కును ధృవపరచుటకు చర్యలు చేపట్టాలని కూడా ఇందులో పేర్కొన్నారు. అవి;

(ఎ) గర్భధారణ లేదా మాతృత్వ సెలవు కారణంగా పనిలో నుంచి తొలగించుట, వైవాహిక స్థితిని బట్టి తొలగింపులలో వివక్షతను చూపడాన్ని నిబంధనలకు లోబడి నిషేధించుట;

(బి) ఉద్యోగానికి,సీనియారిటీకి లేదా సోషల్ అలవెన్సులకు నష్టం కలగకుండా జీతంతో కూడిన మాతృత్వసెలవును లేదా పోల్చదగిన సోషల్ బెనిఫిట్స్‌ను ప్రవేశపెట్టుట;

(సి) తల్లిదండ్రులను, కుటుంబ బాధ్యతలతో పని బాధ్యతలను సమన్వయం చేసుకొని ప్రజాజీవితంలో పాల్గొనటానికి అవసరమైన సాంఘిక సేవలను ప్రోత్సహించటం నిర్దిష్టంగా శిశు సంక్షేమ సౌకర్యాల సమన్వయాన్ని ఏర్పాటు చేయుట, అభివృద్ధి చేయుట;

3) ఈ ఆర్టికల్‌లో పేర్కొన్న అంశాలకు సంబంధించిన రక్షణ చట్టాలను ఎప్పటికప్పుడు వస్తున్న శాస్త్రీయ, సాంకేతిక విజ్ఞానానికి అనుగుణంగా సమీక్షించటం, మార్పులు చేయటం, తొలగించటం లేదా అవసరమైన విధంగా విస్తృత పరచటం చేయాలి;

## ఆరోగ్య రక్షణ

కుటుంబ నియంత్రణకు సంబంధించిన వాటితో సహా అన్ని ఆరోగ్య రక్షణ సేవలు స్త్రీ పురుషుల సమానత్వ ప్రాతిపదికను ధృవీకరించేందుకు అనుగుణంగా ఆరోగ్య సంరక్షణలో స్త్రీలయెడల వివక్షతను రూపుమాపేందుకు అవసరం అయిన చర్యలను చేపట్టాలి.

అంతే కాకుండా గర్భిణి, ప్రసవకాలం, ప్రసవించిన తదుపరి కాలం అవసరమైన ఉచిత సేవలను అందచేయటం, గర్భిణి, పాలు ఇచ్చే కాలంలో అవపరమైన పోషణ ఏర్పాటు చేయాలని CEDAW లోని 12వ ఆర్టికల్‌లో పేర్కొన్నారు.

మెటర్నిటీ బెనిఫిట్ చట్టం 1961 మాతృత్వంలో ఉన్న స్త్రీల రక్షణ గురించి అనేక అంశాలు పేర్కొన్నారు.

ఈ చట్టానికి 2008లో చేసిన సవరణ ద్వారా ఈ చట్టం ప్రకారం మెటర్నిటీ బెనిఫిట్‌కు అర్హురాలైన స్త్రీకి యజమాని ఉచితంగా ప్రసవానికి ముందు తరువాత ఉచిత సంరక్షణను ఏర్పరచనట్లయితే వెయ్యి రూపాయిల మెడికల్ బోనస్‌ను కూడా అదనంగా చెల్లించాలని పేర్కొన్నారు.

కేంద్రప్రభుత్వం ప్రతి మూడు సంవత్సరాలకు లోపల మెడికల్ బోనస్ మొత్తాన్ని ఇరవైఅయిదువేల రూపాయల గరిష్ట పరిమితి వరకూ పెంచవచ్చును అనికూడా పేర్కొన్నారు.

ఫ్యాక్టరీల చట్టం 1948, గనుల చట్టం 1952 వంటి అనేక చట్టాల్లో స్త్రీ రక్షణకు సంబంధించి అనేక అంశాలు పొందుపరచబడ్డాయి.

## సాంఘిక – ఆర్థిక విషయాల్లో

సాంఘిక, ఆర్థిక విషయాలలో స్త్రీ పురుష సమానత్వాన్ని ధృవీకరించేందుకు సమాన హక్కులు కల్పించటం నిర్దిష్టంగా

(ఎ) Right to family benefits;

(బి) బ్యాంకు అప్పులు, తనఖా మరియు ఇతర విధాలయిన ఆర్థిక సహాయాలపై హక్కు;

(సి) క్రీడలు, అన్ని రకాల సాంస్కృతిక జీవితంలోను, ఆహ్లాదకరమైన కార్యక్రమాలలో పాల్గొనే హక్కు; కల్పించాలని CEDAW లోని 13వ ఆర్టికల్‌లో పేర్కొన్నారు.

## గ్రామీణ మహిళలు

గ్రామీణ మహిళలు నిర్దిష్టంగా ఎదుర్కొనే సమస్యలను పరిశీలించుట, ఆర్థిక వ్యవస్థలో డబ్బుతో లెక్కించని (non monetized) విభాగాల పనితో సహా తమ కుటుంబ ఆర్థిక మనుగడలో గ్రామీణ మహిళలు నిర్వహిస్తున్న గుర్తించదగిన పాత్ర, ఈ కన్వెన్షన్‌లోని అంశాలను గ్రామీణ ప్రజలకు వర్తింప చేసే విధంగా చర్యలు చేపట్టాలని CEDAW లోని 14వ ఆర్టికల్‌లో పేర్కొన్నారు.

గ్రామీణ అభివృద్ధిలో పాల్గొనటం, తద్వారా లబ్దిపొందటంతో సహా అన్ని విషయాలలోను స్త్రీ పురుష సమానత్వాన్ని పాటించాలని తద్వారా స్త్రీలకు -

(ఎ) అన్ని స్థాయిలలో అభివృద్ధి ప్రణాళికను రూపొందించటంలో, అమలు చేయటంలోను పాల్గొనటానికి;

(బి) కుటుంబ నియంత్రణ సమాచారం, సలహాలు, సేవలతో సహా అవసరమైన ఆరోగ్య రక్షణ సౌకర్యాలకు అవకాశం కల్పించుట;

(సి) సాంఘిక సంక్షేమ కార్యక్రమాల నుండి ప్రత్యక్షంగా లాభం చేకూర్చుట;

(డి) వారియొక్క సాంకేతిక వృత్తి నైపుణ్యాన్ని పెంచుటకు, సముదాయక, విస్తృత సేవల ప్రయోజనం పొందటానికి అవసరమైన అన్నిరకాల అక్షరాస్యత కార్యక్రమాలతో సహా ఫార్మల్, నాన్ ఫార్మల్ శిక్షణ, విద్య పొందుటకు;

(ఇ) స్వయం ఉపాధి లేదా ఉద్యోగ అవకాశాల ద్వారా వచ్చే ఆర్థిక అవకాశాలతో సమాన అవకాశం కలిగే విధంగా స్వయం సహాయక బృందాలను మరియు కో ఆపరేటివ్‌లను ఏర్పాటు చేయుట;

(ఎఫ్) అన్ని సాముదాయక కార్యక్రమాలలో పాల్గొనే విధంగా;

(జి) వ్యవసాయ పరపతి, అప్పులు, మార్కెటింగ్ సౌకర్యాలు, అవసరమైన సాంకేతికత, భూపునరావాస పథకాలు, భూమి, వ్యవసాయ సంస్కరణలలో సమాన అవకాశాలు కల్పించుట;

(హెచ్) గృహ, పారిశుధ్య విద్యుత్, నీటి సరఫరా, కమ్యూనికేషన్‌లతో సహా మెరుగైన జీవన పరిస్థితులు కల్పించుట చేయాలని ఇందులో పేర్కొన్నారు.

## చట్టం – సమానత్వం

చట్టం మందు స్త్రీలను పురుషులతో సమానంగా ఉంచేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని లోని 15వ ఆర్టికల్‌లో పేర్కొన్నారు.

ఒప్పందాలను చేసుకొనే హక్కుల విషయములో, ఆస్తి నిర్వహణలో, కోర్టులు, ట్రిబునల్స్‌లో అన్ని స్థాయిలోను స్త్రీలకు పురుషులతో సమానంగా అవకాశాలు కల్పించాలని పేర్కొన్నారు

స్త్రీల న్యాయపరమైన సామర్థ్యాన్ని పరిమితం చేసేటటువంటి ఏ ఒప్పందాలు అయినా, పత్రాలయినా చెల్లవు అని అంగీకరించబడినది.

## పెళ్ళి, కుటుంబ సంబంధాలు

1. పెళ్ళి, కుటుంబ సంబంధమైన విషయాలలో స్త్రీల పట్ల ఉన్న వివక్షతను తొలగించి స్త్రీ పురుష సమానత్వ ప్రాతి పదికన;

(ఎ) పెళ్ళి చేసుకొనే విషయంలో సమాన హక్కు;

(బి) భాగస్వామిని ఎంచుకొనే విషయంలో స్వేచ్ఛ, స్వేచ్ఛాయుతమైన, పరిపూర్ణమైన అంగీకారంతోనే వివాహం చేసుకోవటం;

(సి) వివాహ కాలములోను, విడాకుల సందర్భంలోను సమాన హక్కులు, బాధ్యతలు ఉండటం;

(డి) వైవాహిక అంతస్తుతో నిమిత్తం లేకుండా తమ పిల్లలకు సంబంధించిన విషయాలలో తల్లి తండ్రులుగా సమాన హక్కులు, బాధ్యతలు కలిగి ఉండటం;

అన్ని సందర్భాలలోను పిల్లల ప్రయోజనాలకు ప్రథమ ప్రాదాన్యతను ఇవ్వడం.

(ఇ) పిల్లల సంఖ్యలోను, బిడ్డకు బిడ్డకు మధ్య ఉండాల్సిన సమయం విషయంలోను స్వేచ్ఛగా, బాధ్యతగా నిర్ణయించుకొవటానికి సమాన హక్కు, ఈ హక్కును వినియెగించుకోవటానికి అవసరమైన సమాచారం, అవగాహన కల్పించటం;

(ఎఫ్) గార్డియన్ షిఫ్, వార్డ్‌షిఫ్, పిల్లలను దత్తత స్వీకరించుట లేదా జాతీయ చట్టాలలో ఉన్నటు వంటి అలాంటి విషయాలలో సమాన హక్కులు, బాధ్యతలు; అన్ని విషయములోను పిల్లల ప్రయోజనాలకు ప్రథమ ప్రాధాన్యతను ఇవ్వాలి.

(జి) కుటుంబ పేరును, వృత్తిని ఎంచుకోవటంలో భార్యా భర్తలకు సమాన వ్యక్తిగత హక్కులు;

(హెచ్) ఆస్తి యాజమాన్యము, సంపాదించుకోవడం (acquisition) నిర్వహణ, అనుభవించడం, ఉచితంగా కాని, ప్రతిఫలం స్వీకరించిగాని అన్యాకాంతము చేయుట వంటి విషయాలలో దంపతులు ఇరువురికి సమాన హక్కులు కల్పించుట;

2. బాల్య వివాహము, అట్టి నిశ్చితార్థమునకు ఏ విధమైన చట్టబద్దత లేదు. వివాహానికి కనీస వయస్సును, వివాహాలను రిజిష్టరు ఆఫీసులో రిజిష్టరు చేయటం తప్పని సరి చేస్తూ చట్టాలు రూపొందించాలి అని CEDAW లోని 16వ ఆర్టికల్‌లో చెప్పబడింది.

- హిందూ వివాహచట్టం 1955;
- హిందూ దత్తత స్వీకరణ, మనోవర్తి చట్టం 1956;
- హిందూ మైనారిటీ, గార్డియన్ షిప్ చట్టం 1956;
- హిందూ స్త్రీల ఆస్థి హక్కు చట్టాలు, వంటి ఎన్నో చట్టాలు వివాహము, విడాకులు, మనోవర్తి, ఆస్థి హక్కు, పిల్లల పట్ల హక్కులు, బాధ్యతలు, దత్తత స్వీకరణ వంటి ఎన్నో అంశాల గురించి పేర్కొన్నాయి.

అలాగే క్రైస్తవ మతానికి చెందిన వివాహము - విడాకుల విషయాలకు సంబంధించి భారతీయ క్రైస్తవ వివాహ చట్టం 1872, భారతీయ విడాకుల చట్టం 1869 పేర్కొంటాయి.

ముస్లింలకు సంబందించి ముస్లిం విడాకుల చట్టం 1939, ముస్లిం మహిళల (విడాకుల తదుపరి రక్షణ హక్కులు) చట్టం 1986 జారీ చేయబడ్డాయి.

స్త్రీలు, పిల్లల పోషణ బాధ్యత గురించి క్రిమినల్ ప్రొసీజర్ కోడ్‌లోని 125వ సెక్షనులో ఖచ్చితంగా చెప్పబడింది. దీనికి అదనంగా పైన పేర్కొన్న వివాహ, విడాకుల చట్టాల్లో కూడా పోషణ ఖర్చుకు సంబంధించిన అంశాలు పొందుపర్చబడ్డాయి.

కుటుంబ సంబంధమైన అంశాలు త్వరితగతిన పరిశీలనకు కుటుంబ కోర్టు చట్టం 1984 అమలులోనికి తీసుకురాబడినది.

విడాకులు తీసుకున్న ముస్లిం మహిళకు ఇద్దత్ కాలం తరువాత కూడా మనోవర్తి చెల్లించాల్సిందేనని సుప్రీం కోర్టు షాబాను కేసు (AIR 2010SC 305) లో తీర్పునిచ్చింది.

ఇంకా వరకట్న నిషేధ చట్టం 1961 నుండి స్త్రీలపై గృహహింస నిరోధక చట్టం 2005 వరకూ మహిళల రక్షణకు చేయబడ్డ ఎన్నో చట్టాలను గూర్చి వివరంగా మహిళలకు అవగాహన కల్పించాల్సి ఉంది.

– కె. రాధిక, న్యాయవాది

# యేసుక్రీస్తును మేమూ ఆరాధిస్తున్నాం

– స్వామి రంగనాథానంద

(గత సంచిక తరువాయి భాగం)

**యేసుక్రీస్తు బాధలు, ప్రయాణాలు అద్భుతాలతో ఆగ్రహం చెందిన యాజకులు ఆయన్ను బంధించి చట్టం ముందు విచారణకు తీసుకురావడానికి సన్నాహాలు ప్రారంభించారు.**

ఆయన చేసిన బోధనల్లోని కొన్ని వ్యాఖ్యల్ని ఆధారం చేసుకొని దైవదోష నేరం ఆరోపిస్తూ కేసు తయారుచేశారు. తన శిష్యులతో కలిసి పస్కావిందు భోజనంలో, తన శిష్యుల్లోనే ఒకడు తనను అప్పగించబోతున్నాడంటూ యూదాను ఉద్దేశించి ఆయన చేసిన పరోక్ష వ్యాఖ్యతో ఆ విషాదం మరింత బలపడినట్లయింది. అందుకు అభ్యంతరం చెప్పబోయిన పేతురుతో, నీవు కూడా మరుసటి రోజు ఉదయం కాకమునుపే నన్నెరుగవంటూ మూడుసార్లు బొంకపోతున్నావని ఆయన తెలిపారు. అంతం దగ్గరపడిందన్న భారంతో ఆయన గెత్సెమెనె తోటకు వెళ్ళి అక్కడ ప్రార్థించడానికి పూనుకున్నాడు. పేతురును, మరో ఇద్దరు శిష్యులను కూడా తనతో పాటు ప్రార్థనలో ఏకీభవించమని ఆయన కోరాడు. అయితే ప్రార్థించడానికి బదులుగా నిద్రలోకి జారుకున్న పేతురును ఒక గడియపాటు నాతోపాటు ప్రార్థించలేవా? శోధనలో పడుకుంటున్నట్లు మెలకువతో ప్రార్థన చేయి, ఆత్మ ఎల్లపుడూ సిద్ధమే కాని శరీరమే బలహీనం, అని గద్దించాడు.

ఇలా మూడు సార్లు జరిగింది. ఆ తరువాత వారిని నిద్రపోనిచ్చి తాను యూదా వచ్చి తనను రోమా భటులకు అప్పగించడం కోసం ఎదురు చూశాడు. యేసును అప్పగించడం కోసం ముప్పై వెండి నాణేలు లంచం తీసుకున్న యూదా సైనికులు యాజకులతో వచ్చి ఆయనకు ముద్దు పెట్టడం ద్వారా ఈయనే యేసు అని నిర్ధారించి వారికి అప్పగించాడు. అందుకు ఆగ్రహించిన పేతురు ఒక సైనికుని చెవిని కత్తితో తెగనరికాడు. అయితే నీ కత్తిని ఒరలోనే ఉండనివ్వు. కత్తి సాయంతో బతికే వాళ్ళంతా కత్తితోనే మరణిస్తారని ప్రభువు అతన్ని గద్దించాడు.

ఆ విధంగా ఆయన విషాదాంతం ఆరంభమయింది. యేసును ముందు ప్రధాన యాజకుడైన కయప వద్దకు తీసుకువెళ్ళారు. ఆ సమయంలో ఆయన శిష్యులంతా ఆయన్ను వదిలేసి పారిపోయారు. ఒక్క పేతురు మాత్రం ఆయన్ను దూరంగా వెంబండించాడు. అదే సందర్భంలో యేసును తానెరుగనంటూ మూడు సార్లు బొంకాడు. ఆ అనుభవం పేతురులో పుట్టెడు దుఃఖాన్ని; పశ్చాత్తాపాన్ని రగిల్చింది. సాక్ష్యాధారాలు లేకున్నా యేసును యాజకులు మతపెద్దలు దోషిగా



నిర్ధారించి రోమా గవర్నర్ అయిన పొంతి పిలాతు ఎదుట హాజరుపర్చారు.

'నీవు యూదుల రాజువా?' అన్న తన ప్రశ్నకు యేసు జవాబివ్వకుండా మౌనంగా ఉండటం పిలాతుకు ఆశ్చర్యం కలిగించింది. యేసులో ఏ నేరమూ కనుగొనని పిలాతు ఆయన్ను విడిపించాలనుకున్నాడు. కాని యూదు మత పెద్దలు పట్టుబట్టడంతో వారి డిమాండ్ మేరకు ఆయన్ను సిలువవేయడానికి అప్పగించాడు. అంతేకాదు, అతని నిరపరాధ రక్తం తన మీద ఉండకుండా ఉండే నిమిత్తం నీళ్ళతో చేతులు కడుగుకున్నాడు. అక్కడున్న ప్రజలంతా అతని రక్తపరాధం మా మీద, మా పిల్లల మీద ఉంటుందిలే అంటూ అరిచారు. అక్కడి నుంచే అసలు విషాదం ఆరంభమయింది.

యేసుకు ఊదారంగు వస్త్రాలు ధరింపజేసి ముళ్ళ కిరీటాన్ని తొడిగించి, బరువైన సిలువను ఆయన భుజాలమీద పెట్టి మోయిస్తూ, ఆయన్ను ఊరేగింపుగా గూల్గొత అనే ప్రాంతానికి తీసుకెళ్ళారు. ఇతనే యూదులరాజంటూ అక్కడి సైనికులు ఆయన్ను అవగేళన చేస్తూ ఉమ్మివేశారు, కొట్టారు. తరువాత ఊదారంగు వస్త్రాన్ని తీసేసి ఆయన వస్త్రాలే ఆయన సిలువకు బిగించారు. 'ఇతనే యేసు యూదులరాజు' అని రాసిన బోర్డును సిలువ'కు ఆయన తలమీద వేలాడదీశారు.

భయంకరమైన ఈ బాధను అనుభవిస్తూ 'నాదేవా, నాదేవా, నన్నెందుకు చేయి విడిచావు' అని ఆయన తండ్రిని వేడుకున్నాడు (మత్తయి 27:46). తర్వాత 'తండ్రి వారేం చేస్తున్నారో వీరెరుగరు గనుక వారిని క్షమించు' అని కూడా ప్రార్థించాడు. (లూకా 23:34).

ఆ రోజు శుక్రవారం. ఆయన తల్లియైన మరియమ్మ ఈ విషాదాన్నంతటినీ దూరం నుండి చూస్తూనే ఉంది. ఆమెతో పాటు ఆమె సోదరీమణి, మగ్దలేనె మరియ, శిష్యుడైన యోహాను కూడా ఉన్నారు. చనిపోయేముందు ఆయన తన తల్లిని యోహానుకు అప్పగించి తన సొంత తల్లివలె చూసుకోవాలంటూ ఆయన్ను పురమాయించాడు. తరువాత తలవంచి తన ఆత్మను తండ్రికి అప్పగించి ప్రాణాలు వదిలాడు.

ఏ లోకాన్నైతే రక్షించడానికి వచ్చాడో ఆ లోకమే ఆయన్ను తృణీకరించగా, ముప్పైమూడు సంవత్సరాల ప్రాయంలోనే ఆయన ఇహలోక జీవితం విషాదంగా ముగిసింది. కాని పునరుత్థానంలో ఆయన ఆత్మ జయించింది. ఆయన రహస్య అనుచరుడు పలుకుబడి కలిగిన వాడు అయిన అరిమతయి యోసేపు అనేవ్యక్తి ఆయన మృతదేహాన్ని రోమా ప్రభుత్వ అనుమతితో స్వీకరించి ఒక ఒక కొత్త రాతి సమాధిలో పెట్టి, పెద్దరాయినొకదాన్ని దానికి అడ్డుగా పెట్టి వెళ్ళిపోయాడు. అయితే ఇద్దరు మరియలు మాత్రం దానికి దగ్గరలోనే ఉండిపోయారు. మూడు రోజుల తరువాత, యేసు తిరిగి లేచాడన్న విషయాన్ని దూతల ద్వారా తెలుసుకొని వారు ఆశ్చర్య చకితులయ్యారు. గలీలియ ప్రాంతంలోని ఆయన ఇతర శిష్యులకు వారు పరుగెత్తుకొని వెళ్ళి ఈ విషయం చెప్పారు. మార్గంలో యేసు ప్రభువే వారికి సాక్షాత్కరించగా వారాయన పాదాల మీద పడ్డారు. యేసు గలిలియ కొండ మీద వారికి ప్రత్యక్షమై వారిని ఆశీర్వదించి, సువార్తను లోకమంతా చాటిచెప్పమని ఆదేశించి పరలోకానికి ఆరోహణుడయ్యాడు.



అయితే యేసుక్రీస్తు ప్రత్యక్షమైనపుడు అక్కడలేని తోమా అనే శిష్యుడు మాత్రం యేసు తిరిగి లేచాడన్న విషయం నమ్మడానికి నిరాకరించాడు. ఆయన తనకు ప్రత్యక్షంగా కనిపించేంతవరకూ నమ్మబోనని అతడు ప్రకటించాడు. ప్రభు అతనికి నిజంగానే ప్రత్యక్షమై, 'తోమా నీవు, వారు మరింత ధన్యులు' అని చెప్పాడు. (యోహాను 20:29) అందుకే అతనికి 'అనుమానపు తోమా' అన్న పేరు చరిత్రలో పెట్టారు. ఆ తోమాయే భారతదేశానికి మొదటిగా సువార్త తీసుకువచ్చాడు. కేరళలో ఆయన ద్వారా సువార్త విన్న కొందరు క్రైస్తవులయ్యారు.

హిందూమతం యేసుక్రీస్తులోని దైవత్వాన్ని గుర్తిస్తూ, ఈ విషయాలనన్నింటినీ ఒప్పుకొంటున్నది. ఆయన జీవితం మంచితనానికి, మాధుర్యానికి మారుపేరు. అయితే అందులో ఎంతో విషాదం కూడా ఉంది. అయితే ఆధ్యాత్మికంగా ఉత్తేజాన్ని కలిగించేది ఆయన జీవితం. మన దేశంలో శ్రీరాముడు, శ్రీకృష్ణుడు కూడా అంతే విషాదకరంగా మరణించినా , మన మతాన్ని వారి మరణాల మీద కాకుండా వారి జీవితాలను, బోధలను ఆధారం చేసుకుని నిర్మించుకున్నాము.

ఒక అవతార పురుషుని ఆధ్యాత్మిక జీవితపు లోటుపాటులు నిజంగానే సామాన్యులకు అర్థం కావు. ఆయన వ్యక్తిత్వాన్ని వదిలి, ఆయన చేసిన అద్భుతాలను పొగిడేందుకు వారు ప్రయత్నిస్తారు. అద్భుతాల మీద అత్యధికంగా దృష్టి సారిస్తే, అసలు బోధలు ప్రక్కకు వెళ్ళిపోయి చౌకబారుతనం రాజ్యమేలుతుంది.

## సరికొత్త ఉద్యమం

లోకానికి కొన్ని సంగతులను అది అర్థం చేసుకోగలిగిన దానికన్నా వేగంగా బోధించే ప్రయత్నం చేస్తే దుష్పరిమాణాలేర్పడతాయని బెర్ట్రాండ్ రసెల్ ఒకసారి అన్నారు. దేవుని రాజ్యం, పునరుత్థానం వంటి అంశాలకు సంబంధించిన యేసుక్రీస్తు బోధలు అంత సులువుగా అర్థంకావు. దేవుని రాజ్యానికి సంబంధించి యేసు చేసిన బోధలు ఉపనిషత్తుల్లో చెప్పబడిన విషయాలతో చాలావరకు సరిపోతాయి.

యేసు బోధించిన సువార్త ఆత్మీయ విముక్తికి సంబంధించినది. అయితే ఆత్మీయ విముక్తిని కాంక్షించే వారు ముందు లోకంతో, దాని కల్మషంతో విరక్తి చెందాలి. క్రైస్తవత్వంతో, హైందవవేదాలు పురాణాల్లో ఉన్న పోలికలు, సరిపోతే అంశాల ఆధారంగా ఒక కొత్త ఉద్యమం మానవ శ్రేయస్సు కోసం సమాజ కళ్యాణం కోసం నిర్మించాలన్నదే అందరి ఆకాంక్ష. ఆ యేసును మేమూ ప్రేమిస్తున్నాం, మేమూ ఆరాధిస్తున్నాం.

**(సమాప్తం)**

అనువాదం: **రెవ. టి. ఎ. ప్రభుకిరణ్**

# స్విట్జర్లాండ్, యు.కె. పర్యటనలో మన జాతీయ బృందాలు

వార్తల్లో 'అపార్డ్'

భారత రాజ్యాంగం 73, 74 సవరణలతో స్థానిక సంస్థలకు కొన్ని అధికారాలు బదలాయించబడ్డాయి. అయితే చేయవలసింది ఇంకా ఉంది. స్థానిక సంస్థలను బలోపేతం చేయాలంటే వేరేదేశాల్లో బలంగా పనిచేస్తున్న స్థానిక సంస్థలను అధ్యయనం చేసి, వారి అనుభవాల నుంచి మనం కూడా కార్యక్రమాలు చేపట్టవచ్చుననే ఉద్దేశ్యంతో కేంద్ర ప్రభుత్వంలోని పంచాయితీ రాజ్ శాఖ స్విట్జర్లాండ్, యు.కె. పర్యటనకై రెండు జాతీయ అధ్యయన బృందాలను (16-02-2010 నుండి 25-02-2010) పంపింది. మొదటి బృందానికి కేంద్ర ప్రభుత్వ పంచాయితీ రాజ్ శాఖ అదనపు సెక్రటరీ డా. సుధీర్ కృష్ణ నాయకత్వం వహిస్తుంటే, రెండవ బృందానికి అదే శాఖకు చెందిన మరో జాయింట్ సెక్రటరీ శ్రీమతి రష్మి శుక్లా శర్మ నాయకత్వం వహిస్తున్నారు. మొదటి బృందంలో అపార్డ్ కమీషనర్ శ్రీ ఫణి కుమార్, రెండవ బృందంలో పంచాయితీ రాజ్ ప్రిన్సిపల్ సెక్రటరీ శ్రీ యం.వి.పి.సి. శాస్త్రి ఉన్నారు. వివిధ రాష్ట్రాలకు చెందిన పంచాయితీరాజ్ గ్రామీణాభివృద్ధి శాఖ ఉన్నతాధికారులు ఈ బృందాలలో సభ్యులుగా ఉన్నారు. ఆయా దేశాలలో స్థానిక పాలనకై అమలులో ఉన్న పాలసీలు, పద్ధతులు, అనుభవాలు ఈ బృందాలు అధ్యయనం చేయడంతో పాటు మన దేశంలోని అనుభవాలను కూడా వారికి తెలియచేస్తారు.

## గ్రామ వికాసం - దూర విద్యా బోధన (మన టి.వి. (సాప్ నెట్) ఛానెల్-3)

| తేదీ/లో | అభ్యర్థులు | ప్రసార సమయం | కార్యక్రమం |
|---|---|---|---|
| 04-03-10<br>11-03-10<br>18-03-10 | గ్రామ పంచాయితీ వార్డు మెంబర్లు | 11.00-11.20 | గ్రామ నిర్వహణ |
| | | 11.20-11.40 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 11.40-12.00 | ఆరోగ్యం - పారిశుధ్యం |
| | | 12.00-12.20 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 12.20- 12.40 | గ్రామీణ ప్రాంతాలలో జీవనోపాధుల కల్పన |
| | | 12.40-01.00 | పర్యావరణ పరిరక్షణ |
| | | 1.00-1.20 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 3.00-4.30 | లైవ్ ఇంటరాక్షన్ - మన TV స్టూడియోలోని నిపుణులతో, మండల కార్యాలయంలో హాజరైన అభ్యర్థుల సంభాషణ |
| 25-03-10 | గ్రామ పంచాయితీ అధ్యక్షులు | 11.00-11.20 | గ్రామ సభ నిర్వహణ |
| | | 11.20-11.40 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 11.40-12.00 | గ్రామ పంచాయితీ మీటింగ్స్ |
| | | 12.00-12.20 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 12.20- 12.40 | గ్రామీణ నీటి సరఫరా |
| | | 12.40-01.00 | భూమి - పేదలు |
| | | 1.00-1.20 | మండల కార్యాలయంలో అభ్యర్థులతో నిపుణుల చర్చ |
| | | 3.00-4.30 | లైవ్ ఇంటరాక్షన్ - మన TV స్టూడియోలోని నిపుణులతో, మండల కార్యాలయంలో హాజరైన అభ్యర్థుల సంభాషణ |

# 'సాక్షర భారత్'పై వర్క్‌షాప్

పంచాయితీరాజ్ సంస్థల ద్వారా 'సాక్షర భారత్' ను అమలు చేయడానికి సంబంధించిన వివిధ అంశాలను చర్చించడానికి జనవరి 29న 'అపార్డ్'లో జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లు, సి.ఇ.వోలు, జిల్లాల పంచాయితీ అధికారులు, జిల్లాల వయోజన విద్యాధికారులతో ఒకరోజు వర్క్‌షాప్‌ను నిర్వహించారు.



ఈ వర్క్‌షాప్‌ను ప్రారంభిస్తూ, 'అపార్డ్' కమీషనర్ శ్రీ ఫణికుమార్ ప్రసంగించారు. అంతర్జాతీయ అక్షరాస్యతా దినమైన సెప్టెంబర్ 8, 2009 న ప్రధానమంత్రి 'సాక్షర భారత్' పథకాన్ని ప్రారంభించారని ఆయన చెప్పారు. 2009 అక్టోబర్ 1 నుంచి ఈ పథకం అమల్లోకి వచ్చిందని, దీని అమలుపై జిల్లా పరిషత్ చైర్‌పర్సన్లు ఎంతో శ్రద్ధ



కనపరిచినందుకు తానెంతో సంతోషిస్తున్నానని కమీషనర్ పేర్కొన్నారు. పంచాయితీ రాజ్ సంస్థల ద్వారానే ఈ కార్యక్రమాన్ని అమలు చేయాలనే దృఢ విశ్వాసంతో కేంద్ర ప్రభుత్వం ఉందని, ఈ కార్యక్రమాన్ని సక్రమంగా అమలు చేయటం ద్వారా మనం ఆ విశ్వాసాన్ని నిలుపుకోవాలని ఆయన ఉద్బోధించారు.

'సాక్షర భారత్' పై కేంద్ర ప్రభుత్వం రూపొందించిన మార్గదర్శకాలతో కూడిన పుస్తకాన్ని వయోజనవిద్య సంచాలకులు శ్రీ పి. జనార్థనరెడ్డి విడుదల చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, 50 శాతం కంటే తక్కువ వయోజన అక్షరాస్యులున్న జిల్లాలన్నింటిలో నిరక్షరాస్యులను అక్షరాస్యులుగా చేయటం లక్ష్యంగా ఈ కార్యక్రమాన్ని అమలు చేస్తున్నట్లు చెప్పారు.

మానవాభివృద్ధి ఇండెక్స్‌లో మొత్తం 178 దేశాల్లో మనదేశం 132 వ స్థానంలో ఉన్నదని ఎన్ఐఆర్డి లోని 'సాక్షరభారత్' నోడల్ అధికారి శ్రీ టి. విజయకుమార్ చెప్పారు. అక్షరాస్యతను మెరుగుపరచుకోవటం ద్వారా మన దేశ బ్యాంకును కూడా మెరుగుపరచుకోగలమని ఆయన అన్నారు.

అంతేకాక, అక్షరాస్యులు, ఆరోగ్యం, పోషకాహారం మొదలైన అంశాలకు సంబంధం ఉంటుందని, కేంద్ర ప్రాయోజిత పథకమైన 'సాక్షర భారత్' మన రాష్ట్రంలోని 18 జిల్లాల్లో అమలవుతుందని ఆయన తెలిపారు. దేశంలోని జిల్లాల్లో 365 జిల్లాల్లో ఈ కార్యక్రమం అమలవుతోందని ఆయన చెప్పారు.

'సాక్షర భారత్'కు సంబంధించిన వివిధ అంశాలపై 'అపార్డ్'కు చెందిన డాక్టర్ సి. కృష్ణమోహనరావు, వయోజన విద్యా శాఖ సంచాలకులు శ్రీ పి. జనార్దన రెడ్డి, ఎమ్ఆర్డికి చెందిన డాక్టర్ టి. విజయకుమార్‌లు వివరించారు. తరువాత కార్యక్రమంలో పాల్గొన్నవారు చర్చలు జరిపి, పలు సూచనలు చేశారు.

పంచాయితీరాజ్ శాఖ కమీషనర్ శ్రీ కె. చంద్రమౌళి మాట్లాడుతూ, రాజ్యాంగంలోని 73వ సవరణ ప్రకారం స్థానిక సంస్థలకు బదలాయించిన అంశాల్లో ఇది కూడా ఒకటయినందున 'సాక్షర భారత్' కార్యక్రమాన్ని పంచాయితీరాజ్ సంస్థలు అమలు చేయటం మంచిదని, ఆ బాధ్యతను చేపట్టే సరైన సమయం ఇదేనని చెప్పారు.

- రాధాకృష్ణ

## 'స్థానిక పాలన' కు ప్రశంసలు

'అపార్డ్' ఆధ్వర్యంలో 2009 సంవత్సరం ఫిబ్రవరిలో ఆవిర్భవించిన 'స్థానిక పాలన' పత్రిక 2010 ఫిబ్రవరితో ఏడాది కాలం పూర్తి చేసుకుంది. ఈ సందర్భంగా ఫిబ్రవరి నెల 'స్థానిక పాలన' సంచిక 100 పేజీలతో ప్రథమ వార్షికోత్సవ ప్రత్యేక సంచికగా వెలువడింది. ఈ పత్రికను అందుకున్న పలువురు అభినందన సందేశాలను, ప్రశంసలను పంపించారు.

వాటిలో ముఖ్యమైనది కేంద్ర ప్రభుత్వం పంచాయితీరాజ్ శాఖ అదనపు కార్యదర్శి డాక్టర్ సుధీర్‌కృష్ణ 'అపార్డ్' కమీషనర్‌కి పంపిన ప్రశంస. 'స్థానిక పాలన' పత్రికలోని అంశాలు, గెటప్, లే అవుట్ ఏడాదికాలం పాటు ఎంతగానో ఆకట్టుకున్నాయని ఆయన పేర్కొన్నారు. ముందు ముందు ఈ పత్రిక మరిన్ని శిఖరాలు అధిరోహించాలని ఆయన ఆకాంక్షించారు. ❒

# ఆదివాసీ మహిళల అక్షరాస్యత - కొన్ని సవాళ్లు

**దక్షిణ భారతదేశంలో షెడ్యూల్డ్ జాతుల జనాభా అత్యధికంగా ఉన్న ఆంధ్రప్రదేశ్, గిరిజనాభివృద్ధి పథకాలను అమలు చేయడంలోనూ, కొత్త విధానాలను ముఖ్యంగా విద్యారంగంలో వినూత్న పద్ధతులను అమలు చేయడంలో ఎప్పుడూ ముందుభాగానే ఉంటూ వస్తోంది. గత రెండు దశాబ్దాలుగా గిరిజన గ్రామీణ ప్రాంతాల్లో బాలికల విద్య, మహిళల సాధికారతా పథకాలను అమలు చేయడంలో అగ్రగామిగా నిలుస్తూ వస్తోంది. 2001 జనాభా లెక్కలప్రకారం, ఆంధ్రప్రదేశ్‌లో 50.42 లక్షల షెడ్యూల్డ్ జాతుల వారున్నారు.**



రాష్ట్ర మొత్తం జనాభాలో వీరిశాతం 6.59 శాతం ఉంది. రాష్ట్రంలో ఉన్న 35 జాతుల్లో 31 జాతులు అంటే 60.65% షెడ్యూల్డ్ ప్రాంతాల్లో నివసిస్తున్నారు. స్వాతంత్ర్యానికి ముందు అక్కడక్కడా చాలా కొద్దిచోట్ల మాత్రమే సామాజిక కార్యకర్తలు, ప్రభుత్వ సిబ్బంది ద్వారా వారిని విద్యావంతులను చేయడానికి ప్రయత్నాలు జరిగాయి.

### స్వాతంత్ర్యానికి ముందు జరిగిన ప్రయత్నాలు

దాదాపు వందేళ్ల క్రితం గిడుగు రామ్మూర్తి పంతులు గారు బహుశ మొదటి సారి గిరిజనుల విద్యకు శ్రీకారం చుట్టారు. పర్లాకిమిడిలోని ఒక జమిందారీ హైస్కూల్‌లో అసిస్టెంట్ టీచర్‌గా పనిచేస్తున్న పంతులుగారు 'సవర్ల విద్యా స్థితిగతులు' పేరిట ఒక సవివరమైన వ్యాసం రాశారు. అది 1894 నవంబర్‌లో 'ఇండియన్ జర్నల్ ఆఫ్ ఎడ్యుకేషన్' లో ప్రచురితమైంది. గిరిజనులకోసం ప్రభుత్వం పాఠశాలలు ఏర్పాటు చేయకపోవడంతో ఆయనే తన సొంత డబ్బుతో పాఠశాలలను స్థాపించారని అంటారు. విధి లేక ఆ పాఠశాలలకు 1905-06లో ప్రభుత్వ అనుమతులను మంజూరు చేసింది. మహాత్మాగాంధీ అడుగుజాడల్లో కొందరు గాంధేయ సామాజిక కార్యకర్తలు ముఖ్యంగా రెబ్బాప్రగడ మందేశ్వర శర్మ విశాఖ జిల్లా పాడేరు ప్రాంతంలోనూ, మల్లిపెద్ది కృష్ణమూర్తి శ్రీకాకుళం జిల్లా మందస ప్రాంతంలోనూ, రాధేశ్యామ్ పశ్చిమగోదావరి జిల్లా కన్నాపురం ప్రాంతంలో గిరిజన పాఠశాలలను స్థాపించారు. అదే విధంగా 1916లో బ్రిటిష్ ప్రభుత్వం కర్నూలు జిల్లాలో చెంచుల కోసం పాఠశాలలను ఏర్పాటు చేసింది. పెద్ద చెరువు ప్రాంతంలో బాలికలకోసం ప్రత్యేక పాఠశాలను కూడా స్థాపించింది.

1940 ప్రాంతంలో ఆదిలాబాద్ జిల్లాలోని గిరిజనులు కొమరం భీమ నాయకత్వంలో గిరిజనేతరులు, రెవెన్యూ, ఫారెస్ట్ అధికారుల దోపిడీకి వ్యతిరేకంగా తిరుగుబాటు చేశారు. ఆ తరువాత, నిజాం నవాబు మేల్కొని గిరిజన వ్యవహారాలలో సలహాలిచ్చేందుకు ప్రొఫెసర్ హైమెండార్ఫ్‌ను నియమించారు. గిరిజనాభివృద్ధికి నిజాం నవాబు చేపట్టిన గోండు విద్యాపథకం చాలా ముఖ్యమైంది. గిరిజన కుటుంబాలన్నిటికీ నిజాం భూములను కేటాయించారు.

1945 నాటికి నిజాం ప్రభుత్వం ఆదిలాబాద్ జిల్లాలో గోండుల కోసం, వరంగల్ జిల్లాలో కోయలకోసం ప్రత్యేక పాఠశాలలను స్థాపించింది. గిరిజనుల కోసం మొట్టమొదటి సారిగా 1916లో ప్రత్యేక పాఠశాలను స్థాపించగా, ఆ తరువాతి కాలంలో పాఠశాలల సంఖ్య 27కు చేరింది. వాటిలో 305 బాలురు, 141 మంది బాలికలు చేరారు. బ్రిటీష్ హయాంలో కోస్తా జిల్లాలలోని గిరిజన ప్రాంతాల్లో ఒక పాఠశాలను కూడా ఏర్పాటు చేయలేదు.

### స్వాతంత్ర్యం వచ్చాక జరిగిన ప్రయత్నాలు

యావత్ భారతదేశంలో గిరిజనులుండే ప్రాంతాలలో 1955లో స్పెషల్ మల్టీపర్పస్ ట్రైబల్ డెవలప్‌మెంట్ బ్లాక్‌ల (ఎం.పి.పి)ను ఏర్పాటు చేశారు. ఈ బ్లాకుల్లో రోడ్లను వేయడం, తాగునీరు, విద్యావసతులు కల్పించడంపై ప్రాధాన్యం చూపారు. ఆ తరువాత ప్రణాళికా కాలంలో గిరిజనాభివృద్ధికి ప్రభుత్వం అదేమాదిరిగా ప్రాధాన్యం ఇచ్చింది. నాలుగో పంచవర్ష ప్రణాళికాంతానికి కొద్ది ప్రాథమిక పాఠశాలలు మాత్రమే గిరిజన విద్యార్థులకోసం ఏర్పాటు అయ్యాయి. రహదారులు లేని మారుమూల గిరిజన పల్లెల్లోకి టీచర్లు, ముఖ్యంగా గిరిజనేతర ప్రాంతాల టీచర్లు వెళ్లడం కష్టంగా ఉండేది. అందువల్ల టీచర్ల గైరాజరు ఎక్కువగా ఉండేది.

విద్య లేకపోవడం వల్లే తాము వ్యాపారులు, వడ్డీ వ్యాపారుల



భారిన పడాల్సి వస్తోందని గిరిజనులు గ్రహించడం ప్రారంభించారు. తత్ఫలితంగా వారి పిల్లలను విద్యావంతులను చేయాలన్న కోరిక వారిలో కలగనారంభించింది. అయితే, వారి పిల్లలు కాస్త పెద్ద వాళ్లయ్యాక, వ్యవసాయం, అటవీ ఉత్పత్తుల సేకరణలో తండ్రులకు సహాయ పడేందుకు మగపిల్లలను, నీళ్లు తేవడానికి, చిన్న పిల్లల ఆలనాపాలన చూడటానికి ఆడపిల్లలను బడి మాన్పించేవారు. వారి సాంప్రదాయం ప్రకారం, ఏడేళ్లు వచ్చాక ఆడపిల్లలకు పెళ్లిళ్లు చేసి అత్తవారింటికి పంపేవారు. అయిదో తరగతి వరకు 75% మంది బడి మానివేయగా, ఏడో తరగతికల్లా ఆది 93.91%కు పెరిగింది.

నాలుగో పంచవర్ష ప్రణాళిక అంతం నాటికి అంటే 1973లో అఖిలభారత స్థాయిలో ఆదివాసీల స్థితిగతులపై సవివరమైన సమీక్ష జరిగింది. దేశంలోని ప్రముఖ వ్యక్తులతో ఈ సమీక్షను జరపటానికి వర్కింగ్ గ్రూపులు ఏర్పాటయ్యాయి. గిరిజనుల సమస్యల పరిష్కారానికి ఒక స్పష్టమైన వ్యూహాన్ని రూపొందించారు. దీని ప్రకారం 200మందికి పైగా ఆదివాసీలు నివసించే గ్రామాలు లేదా 20మంది బడికివెళ్లే విద్యార్థులున్న గ్రామాలన్నిటిలో నాన్ -రెసిడెన్షియల్ స్కూళ్లను ఏర్పాటు చేయాలని నిర్ణయించారు.

ప్రారంభంలో ఒక స్కూలుకు ఒక ఉపాధ్యాయుణ్ణి నియమించి ఒకటి, రెండు తరగతుల వరకు బోధన చేయాలని కూడా నిర్ణయించారు. అక్కడక్కడా చెల్లాచెదురుగా ఉండే నివాసాల నుంచి దూరంగా స్కూళ్లకు వెళ్లవలసి వచ్చిన విద్యార్థుల కోసం రెసిడెన్షియల్ స్కూల్‌ను స్థాపించాలని నిర్ణయించారు.

అలా ఏర్పాటు చేసిన ఆశ్రమ స్కూళ్లలో వసతి, తిండి, పుస్తకాలు, జత బట్టలను ప్రభుత్వమే ఇచ్చేది. స్కూలు కూడా అదే ప్రాంగణంలో ఉండే విధంగా ఏర్పాటు చేశారు.

1986లో జాతీయ విద్యావిధానాన్ని ప్రవేశపెట్టినప్పుడు, దాదాపు 3000 కొత్త ప్రాథమిక పాఠశాలలను ప్రారంభించి ఎన్నో కొత్త ప్రాంతాలకు విద్యను వ్యాప్తి చేశారు. ఆ తరువాత కాలంలో ప్రభుత్వ పాఠశాలల సంఖ్య 4317కు పెరిగింది. ఇవి గాక, 2005లో 5411 కమ్యూనిటీ స్కూళ్ళను ప్రారంభించారు. దీంతో 50 మంది ఆదివాసీలు నివసించే ప్రతి కుగ్రామంలో స్కూళ్లు ఏర్పాటైనాయి.

గిరిజన విద్యార్థులకు నాణ్యమైన విద్యనందించేందుకు ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం ప్రత్యేక గురుకులం పాఠశాలలను ఏర్పాటు చేసింది. అటువంటి ఆశ్రమ పాఠశాల మొట్టమొదటిసారిగా విశాఖపట్నం జిల్లా కిన్నెరసానిలో 1975లో ఏర్పాటు చేశారు. ఇప్పుడు గిరిజన విద్యార్థుల కోసం 29 రెసిడెన్షియల్ పాఠశాలలు, 38 రెసిడెన్షియల్ జూనియర్ కాలేజీలు, వాటితోపాటు నాలుగు ఇంగ్లీష్ మీడియం స్కూళ్లు, 504 ఆశ్రమ పాఠశాలలు, 506 హాస్టళ్లు ఉన్నాయి.

### కొత్త విద్యార్థుల సంఖ్య పెరుగుదల

1986 తరువాత స్కూళ్లు అందరికీ అందుబాటులోకి రావడంలో స్కూళ్లలో చేరే వారి సంఖ్య గణనీయంగా పెరిగింది. 1964-65లో ప్రాథమిక స్థాయిలో మొత్తం విద్యార్థుల సంఖ్య 78వేలు ఉండేది. వారిలో బాలికలు 27 వేలమంది, అంటే 34 శాతం మంది మాత్రమే ఉండేవారు. ఆ సంఖ్య 2003-04 నాటికి మొత్తం 9.01 లక్షలకు పెరిగింది. అందులో బాలికల సంఖ్య 4.29 లక్షలు లేదా 48 శాతానికి పెరిగింది.

2003-04లో హైస్కూలు స్థాయి విద్యార్థుల సంఖ్య 3.33 లక్షలకు పెరిగింది. 1964-65లో హైస్కూలు స్థాయిలో చదివే విద్యార్థుల సంఖ్య కేవలం 2000 మాత్రమే ఉండేది. ఇదే కాలంలో అంటే 2003-04లో హైస్కూలు చేరిన బాలికల సంఖ్య 1,21,000 (36శాతం) ఉండగా, అది 1964-65లో కేవలం 300 మాత్రమే ఉండేది. అయినప్పటికీ, బడిమానివేసే వారి సంఖ్య పెరుగుతూనే ఉండటం విచారకరం. బడి మానివేసే విద్యార్థుల నిష్పత్తులు ఈ విధంగా ఉండేవి.

**గిరిజన ప్రాంతాలు, మైదాన ప్రాంతాలలో అక్షరాస్యత శాతాల వ్యత్యాసం**

| జనాభాలెక్కలు | అఖిల భారతస్థాయి | | ఆంధ్రప్రదేశ్ | |
|---|---|---|---|---|
| | మైదాన ప్రాంతాలు | గిరిజన ప్రాంతాలు | మైదాన ప్రాంతాలు | గిరిజన ప్రాంతాలు |
| 1951 | 16.67 | 5.96 | 15.81 | 3.46 |
| 1961 | 28.29 | 8.54 | 21.10 | 4.41 |
| 1971 | 34.45 | 11.29 | 24.57 | 5.34 |
| 1981 | 36.26 | 16.35 | 29.94 | 7.82 |
| 1991 | 51.11 | 29.60 | 44.09 | 17.16 |
| 2001 | 65.38 | 47.10 | 61.11 | 37.03 |

## ఆంధ్రప్రదేశ్‌లో గిరిజనుల అక్షరాస్యత

| వరుస సంఖ్య | జనాభా లెక్కలు | పురుషులు | స్త్రీలు | మొత్తం | ఆంధ్రప్రదేశ్‌లో సాధారణ అక్షరాస్యత | షె.తెగల అక్షరాస్యత (అఖిలభారత స్థాయి) |
|---|---|---|---|---|---|---|
| 1 | 1981 | 12.02 | 3.46 | 7.83 | 29.94 | 16.35 |
| 2 | 1991 | 25.25 | 8.68 | 17.16 | 44.09 | 29.60 |
| 3 | 2001 | 47.66 | 26.10 | 37.03 | 66.11 | 47.10 |

## బడి మానివేసేవారి నిష్పత్తులు

| సంవత్సరం | అయిదోతరగతి వరకు | ఏడోతరగతి వరకు |
|---|---|---|
| 1971 | 75.30 | 93.91 |
| 1981 | 68.10 | 78.01 |
| 1991 | 65.20 | 78.01 |
| 2001 | 65.80 | 80.82 |
| 2002 | 54.04 | 75.34 |

### అక్షరాస్యత స్థాయిల్లో పెరుగుదల

1981 జనాభాలెక్కల ప్రకారం చూస్తే గిరిజనుల అక్షరాస్యత స్థాయిలో చెప్పుకోతగ్గ వృద్ధి కన్పించలేదు. అయితే 1981 తరువాత ఈ పరిస్థితిలో చాలా మార్పు వచ్చింది. కానీ అఖిల భారత స్థాయి సమాచారంతో పోలిస్తే గిరిజనుల విద్యా స్థితిగతులు ఎంతో వెనుకబడి ఉన్నాయని చెప్పుకోక తప్పదు.

2001 జనాభా లెక్కల ప్రకారం చూస్తే, అక్షరాస్యత విషయంలో గిరిజనులు చాలా వెనుకబడి ఉన్నారు. రాష్ట్రాలవారీగా చూస్తే రెండు రాష్ట్రాలు మాత్రమే ఆంధ్రప్రదేశ్ కంటే దిగువనున్నాయి.

### మహిళా అక్షరాస్యత

2001 జనాభా లెక్కల ప్రకారం అక్షరాస్యతలో పురుషుల కన్నా మహిళలు వెనుకబడి ఉన్నారు. కానీ మైదాన ప్రాంతాల్లో మహిళా అక్షరాస్యతలో ఉన్న వృద్ధి రేటు కన్నా ఆదివాసీ ప్రాంతంలోని వృద్ధి రేటు ఎక్కువగా ఉంది. 1971లో గిరిజన మహిళల అక్షరాస్యత కేవలం 2.12 శాతం ఉండగా, అది 2001 నాటికి 26.10 శాతానికి పెరిగింది. ఈ వృద్ధి ప్రధానంగా సమగ్ర గిరిజనాభివృద్ధి సంస్థలున్న జిల్లాల్లోనే కన్పిస్తుంది.



### గిరిజన బాలికల విద్య - ఎదురౌతున్న సవాళ్లు

బాలికల చదువు పట్ల గిరిజనులు చూపుతున్న మక్కువను దృష్టిలో ఉంచుకొని ప్రాథమిక, ఉన్నత, పోస్ట్‌మెట్రిక్ విద్యను వారికి మరింత చేరువలోకి తేవాల్సిన అవసరం ఉంది. గిరిజన బాలికల గుణాత్మక, పరిణామాత్మక విద్యాభివృద్ధికి ఒక మాస్టర్ ప్లాన్‌ను తయారుచేయాల్సి ఉంది. అదే సమయంలో, చదువుకున్న బాలికల భవిష్యత్‌ను గురించి కూడా ఆలోచించాల్సి ఉంది. 2007లో రెసిడెన్షియల్ స్కూళ్ళలో చదివిన 1790 మంది బాలికలు పదోతరగతిలో ఉత్తీర్ణులయ్యారు. అదే ఏడాది 1420 మంది ఇంటర్మీడియట్ పాసయ్యారు. 2007-08 విద్యా సంవత్సరంలో రాష్ట్రం మొత్తం మీద 1,47,333 గిరిజన విద్యార్థులు పోస్ట్ మెట్రిక్ కోర్సులు చదువుతుండగా, వారిలో 45,175 మంది అంటే 30 శాతం మంది బాలికలు ఉన్నారు. ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వం 2008-09లో చేపట్టిన మారుమూల ప్రాంతాల అభివృద్ధి పథకం కారణంగా రెసిడెన్షియల్ స్కూళ్ళలో చదివే గిరిజన బాలికల సంఖ్య 18000కు చేరుకొంది.

కొన్నేళ్ళకు చదువుకునే గిరిజన బాలికల సంఖ్య విపరీతంగా పెరిగిపోతుంది. చదువుకున్న గిరిజన బాలికలు ఇప్పటికే అనేక మంది నిరుద్యోగులుగా ఉన్నారు. 26 శాతం అక్షరాస్యత స్థాయి ఉన్నప్పుడే ఈ పరిస్థితి ఉంటే, ఈ సంఖ్యను మరింత మెరుగుపరచాలన్న ప్రభుత్వ పథకం అమలైతే, పరిస్థితి ఎలా ఉంటుంది? ఏడో తరగతి స్థాయి వరకు వచ్చి బడి మానేసిన వారి సంగతేమిటి? ఉపాధిపై దీని ప్రభావం ఎలా ఉంటుంది? రానున్న దశాబ్దాలలో గిరిజన సమాజంపై దీని ప్రభావం ఎలా ఉంటుందో ఆలోచించాలి. ప్రస్తుత ధోరణులను దృష్టిలో ఉంచుకొని గిరిజన మహిళలకు ఎటువంటి సాధికారత అవసరమో కూడా ఆలోచించాల్సి ఉంటుంది. ఇది గిరిజనాభివృద్ధి ప్రణాళికా వేత్తలకు సవాలుగా నిలుస్తుందా?

### బడి మానిన వారికి ప్రైవేటు ఉపాధి

బడి మానిన వారు విద్యావేత్తల భాషలో దేనికీ పనికిరాని వారు. కానీ, ఈ రచయిత అనుభవం మాత్రం మరోవిధంగా ఉంది. బడి మానివేసిన అమ్మాయిలు స్వయం సహాయక సంఘాలలో చేరి ఆర్థిక లావాదేవీలను చక్కగా నిర్వహించగలుగుతున్నారు. ఈ రచయితకు గ్రామీణాభివృద్ధి మంత్రిత్వ శాఖ ప్రవేశపెట్టిన ఇందిరాక్రాంతి పథకం, అటవీ సంరక్షణ పథకంలో గిరిజన స్థితిగతులపై ప్రత్యేక అనుభవం ఉంది. రాష్ట్రంలో మొత్తం 4.84 లక్షల స్వయం సహాయక సంఘాలున్నాయి. రాష్ట్రంలోని గిరిజన మహిళలంతా ఈ సంఘాలలో భాగస్వాములుగా ఉన్నారు. మహిళలు తాము చేసుకున్న పొదుపునకు సరిసమానంగా ప్రభుత్వం

**జిల్లాలవారీగా మహిళా అక్షరాస్యతా శాతం**

| వరస సంఖ్య | జిల్లా | 1971 | 1981 | 1991 | 2001 |
|---|---|---|---|---|---|
| 1 | శ్రీకాకుళం | 1.05 | 4.65 | 10.41 | 30.60 |
| 2 | విజయనగరం | వేరేజిల్లా కాదు | 4.00 | 8.79 | 26.20 |
| 3 | విశాఖపట్నం | 1.08 | 2.02 | 7.83 | 22.70 |
| 4 | తూర్పుగోదావరి | 3.55 | 2.58 | 16.48 | 38.90 |
| 5 | పశ్చిమగోదావరి | 3.72 | 8.46 | 19.02 | 46.00 |
| 6 | ఖమ్మం | 0.95 | 2.49 | 8.02 | 27.60 |
| 7 | వరంగల్ | 0.59 | 1.31 | 4.90 | 22.40 |
| 8 | ఆదిలాబాద్ | 0.61 | 1.62 | 7.55 | 26.90 |
| | రాష్ట్ర సగటు | 2.12 | 3.46 | 8.68 | 26.10 |

గ్రాంటునిస్తుంది. ఇది కాక, గిరిజన మహిళలు అభివృద్ధి పథకాలలో, వ్యవసాయ, అటవీ ఉత్పత్తులను మార్కెటు చేస్తూ ఉంటారు. హైస్కూలు మానివేసిన బాలికలకు బట్టల తయారీలో శిక్షణనిచ్చి ఆయా సంస్థలు ఉద్యోగాలలోకి తీసుకొంటున్నాయి. అయితే, వివిధ కారణాలతో ప్రైవేటు సెక్టారులోని ఉద్యోగాలు అస్థిరంగా ఉంటాయి.

ఈ అటవీ సంరక్షణ కమిటీల్లో 8 నుంచి 15 మంది మహిళలు సభ్యులుగా ఉంటారు. అటవీ ఉత్పత్తులతో పాటు ప్రభుత్వం అమలు చేసే వివిధ జీవనోపాధి పథకాల కింద కూడా అదనపు ఆదాయం వస్తుంది. వీటిలో విజయవంతమైన అగరబత్తీల తయారీ, అడ్డాకుల విస్తర్ల తయారీ గురించి ముఖ్యంగా చెప్పుకోవచ్చు. ఒక్కో సీజన్‌లో మహిళలు 5000 రూపాయల వరకు సంపాదించగలుగుతున్నారు. ఇది కాక, వ్యవసాయం, అటవీ ఉత్పత్తులపై వచ్చే ఆదాయం అదనం. మహిళలకు ప్రభుత్వం కల్పించే రక్షణ, దానికి సంబంధించిన నిబంధనలను ఎప్పటికప్పుడు వారికి తెలియజేయబడుతున్నాయి.

## పబ్లిక్ సెక్టారులో ఉపాధి

షెడ్యూల్డ్ ప్రాంతాలలో ఎ.ఎన్.ఎం. అంగన్‌వాడీ కార్యకర్తల పోస్టులను నూరు శాతం గిరిజన బాలికలకే రిజర్వు చేశారు. ఇలా రిజర్వు చేయడం దేశం మొత్తంలోనే మొదటిసారి. ఈ ప్రాంతాలలో ప్రభుత్వ పోస్టులన్నింటిలో మూడోవంతు గిరిజన మహిళలకే రిజర్వు చేయబడ్డాయి. అయితే, ప్రభుత్వంలో అవకాశాలు చాలా పరిమితంగా ఉంటాయన్న విషయాన్ని మరువకూడదు.

ఇన్ని మార్పులు వచ్చినా, గిరిజన మహిళల బాధలు నెరవేరలేకపోగా మరింత పెరిగాయి. గిరిజన సాధికారత పూర్తిగా ఆర్థిక అంశాల చుట్టూ తిరుగుతుంటాయి. అందువల్ల గిరిజనుల బాధలు ముఖ్యంగా, మహిళల బాధలు కొన్ని రంగాల్లో తగ్గకపోగా మరింతగా పెరిగాయి. అవేంటో చూద్దాం.

- కొన్నేళ్ళ కిందటి వరకు గిరిజన మహిళలను ఉంపుడుగత్తెల్లా ఉంచుకొని కొందరు మైదాన ప్రాంతీయుల గిరిజనులను దోపిడీ చేసేవారు. ఇప్పుడుకూడా విశాఖ జిల్లాలోని అరకులో గిరిజనేతరులు హోటళ్ళు పెట్టి వాటికి తమ గిరిజన భార్యల పేర్లు పెట్టి లక్షలాది రూపాయలు గడిస్తున్నారు.
- మానభంగాలు, హత్యలు ఈ ప్రాంతాల్లో తరచూ జరుగుతున్నట్లు పేపర్లలో వార్తలను మనం చూస్తూనే ఉన్నాం.
- షెడ్యూల్డ్ ప్రాంతాల్లో వరకట్నం కేసులు కూడా విపరీతంగా పెరిగిపోతున్నాయి.
- చదువుకొని నిరుద్యోగులుగా ఉన్న యువకులు తమ భార్యలను వదిలివేసి, గిరిజనేతరులను వివాహమాడుతున్న ఘటనలు పెరిగిపోతున్నాయి.
- మహిళల ఆదాయం పెరగడంతో వారి భర్తలు సారాకు అలవాటుపడి భార్యలను కొట్టడం నిత్యకృత్యమైంది ప్రాంతాలలో.
- భర్తలు సారాకు బానిసలై, ఆరోగ్యం చెడి, చనిపోవడంతో భార్యల పై కుటుంబ భారం పడుతోంది.
- ఆర్థిక లావాదేవీల టెన్షన్ పెరిగిపోతోంది. చిన్న పిల్లలు, రోగాలతో ఉన్న చిన్నపిల్లలను ఇళ్ళలో వదిలి స్వయం సహాయక సంఘాల సమావేశాలకు హాజరవడం వల్ల కూడా కుటుంబాలలో ఉద్రిక్తతలు పెరుగుతున్నాయి.
- కొందరు యువకులు గిరిజన తల్లుల పేరుతో తప్పుడు కుల ధృవీకరణ పత్రాలు సృష్టించి కేసుల్లో ఇరుక్కొంటున్నారు.
- స్వయం సహాయక సంఘాల వల్ల ఆదాయం పెరిగినా, పోషకాహారం తీసుకోకపోవడంతో పౌష్టికాహారలోపం, ఎం.ఎం.ఆర్., ఐ.ఎం.ఆర్ వంటి జబ్బుల గిరిజన ప్రాంతాలలో పెరుగుతున్నాయి.
- వర్షాకాలం, వేసవి కాలాల్లో గిరిజనులు ముఖ్యంగా పిల్లలు మలేరియా, ఉదరకోశ వ్యాధులు, టి.బి. వంటి జబ్బుల వాత పడుతున్నారు.
- విశాఖపట్నంలోని ఆంధ్ర విశ్వవిద్యాలయంలోని ఆంత్రోపాలజీ విభాగం చేపట్టిన సర్వే ప్రకారం, అరకు వేలీలో పెరిగిపోతున్న టూరిజం వల్ల గిరిజనుల్లో హెచ్.ఐ.వి. కేసుల సంఖ్య కూడా పెరిగి పోతున్నట్లు తేలింది.
- గిరిజన మహిళలు నక్సలైట్ ఉద్యమంలో చేరి, ఎన్‌కౌంటర్లలో చనిపోవడం కూడా ఎక్కువైంది.
- విశాఖజిల్లా వాకపల్లి గ్రామ గిరిజన మహిళలను పోలీసుల రేప్ చేసినట్లు, కూంబింగ్ ఆపరేషన్ల సందర్భంగా వారిని కొట్టి హింసించినట్లు ఆరోపణలు కూడా వచ్చాయి.

గిరిజన మహిళా విద్యకు సదుపాయాలు కల్పించడం, కొత్త సవాళ్ళ నెదుర్కొంటున్న మహిళల సమస్యల పరిష్కారం కనుక్కోవడం రెండు ప్రధానమైన సమస్యలను పరిష్కరించాల్సి ఉంది.

*- డాక్టర్ వి.ఎన్.వి.కె. శాస్త్రి, 'అపార్డ్' కన్సల్టెంట్*

*అనువాదం: కె.యస్. రెడ్డి*



# మహిళలకి రక్షణ కవచం గృహహింస నిరోధక చట్టం

**మహిళలు ఎదుర్కొంటున్న అనేకానేక హింసల్లో గృహహింస ఒకటి. ఇది బయటికి కనిపించని హింస. ఇది అనేక రకాలు. శారీరక హింస, మానసిక హింస, ఆర్థిక హింస, భావోద్వేగ పూరితమైన హింస మొదలైన రకాలుగా గృహ హింస సాగుతోంది. ఇది మహిళలను రకరకాల పరిస్థితుల్లో జీవచ్ఛవాలుగా మారుస్తుంది. మరో కంటికి తెలియకుండా మానవహక్కుల రెక్కలని కత్తిరిస్తుంది. నాలుగు గోడల మధ్య ఖైదీని చేస్తుంది. ఇది బయటికి కన్పించని 'మానవ హక్కుల ఉల్లంఘనం'.**

**మహిళలు అనేక దశాబ్దాలుగా జరుపుతున్న ఉద్యమాలు, పోరాటాల కారణంగా, ప్రదర్శిస్తున్న చైతన్యం కారణంగా మూడేళ్ల క్రితం కేంద్ర ప్రభుత్వం గృహ హింస నిరోధక చట్టాన్ని తీసుకుని వచ్చింది. ఇది మహిళల హక్కులకి అద్భుతంగా రక్షణ కల్పించగలదు. వారి గౌరవాన్ని నిలబెట్టగలదు. నాలుగు గోడల మధ్య అమానుషమైన, అమానవీయమైన, మానసికమైన, శారీరకమైన రకరకాల హింసాత్మక పరిస్థితులకి గురి కాకుండా మహిళలు ఈ చట్టం సహాయంతో తమని కాపాడుకోవచ్చు. ఒక్కమాటలో చెప్పాలంటే, మహిళల ఆత్మాభిమానానికి ఈ చట్టం రక్షణ కవచం లాంటిది. అయితే, మహిళలు ధైర్యంగా ముందుకు వచ్చి, దీనిని ఉపయోగించుకున్నప్పుడే దాని లక్ష్యం నెరవేరుతుంది.**

మహిళా సాధికారత దిశగా జరుగుతున్న ప్రయత్నాల్లో గృహహింస నిరోధక చట్టం ఓ ముందడుగు. భర్త, ఆయన కుటుంబ సభ్యులు కొట్టినా, తిట్టినా, చిత్రహింసలు పెట్టినా మౌనంగా రోదిస్తూ కూర్చుని ఉండేందుకు ఇది మధ్యయుగం కాదని, గృహహింస నిరోధక చట్టం మహిళలకు భరోసా ఇచ్చింది. ఈ చట్టం రాకమునుపు భారతీయ శిక్షా స్మృతిలోని 498(ఎ) మాత్రమే స్త్రీలకు చేదోడుగా ఉండేది.

అయితే ఈ నిబంధన కేవలం వరకట్న సంబంధిత అంశాలకు పరిమితం కావడంతో ఒక పదునైన, మహిళలకు అండగా నిలిచే చట్టం

# 'మహిళల ఆత్మాభిమానానికి ఆవశ్యకం'

మహిళలు ఆత్మాభిమానంతో తలెత్తుకొని నిలబడేందుకు గృహహింస నిరోధక చట్టం అత్యంత ఆవశ్యకమని మాజీ ఐపిఎస్ అధికారి కిరణ్‌బేడీ అన్నారు. ఇటీవల ఢిల్లీలో జరిగిన ఒక కార్యక్రమంలో పాల్గొన్న ఆమె మాట్లాడారు. విద్యావంతురాలైన ప్రతి మహిళ గృహహింస నిరోధక చట్టం గురించి తెలుసుకోవాలని అన్నారు. ఐపీఎస్ అధికారిగా ఉన్న సమయంలో తన వృత్తిగత జీవితంలో ఎదురైన అనేకమంది విధివంచితల యథార్థ జీవిత గాథలను ఆమె 'వాట్ వెంట్ రాంగ్' పేరిట పుస్తకరూపంలో వెలువరించారు. తరువాత ఆమె కూతురు సైనాబేడీ ఆ పుస్తకానికి దృశ్య రూపం ఇస్తూ 'గల్తీ కిస్కీ' (తప్పెవరిది) అనే కార్యక్రమాన్ని దూరదర్శన్ కోసం రూపొందించారు.

దీనిపై కిరణ్‌బేడీ స్పందిస్తూ, పుస్తకం ద్వారా సమాజంలో అట్టడుగున ఉన్న నిరక్షరాస్యులైన మహిళలు, అమాయక స్త్రీల సమస్యలను ప్రపంచం దృష్టికి తీసుకురావడమే తన ఉద్దేశమని వివరించారు. వారు ఏ విధంగా అన్యాయానికి గురి అయ్యారో వివరించి మహిళలను జాగృతం చేయాలనేదే తన తాపత్రయమని చెప్పారు.

గృహహింస నిరోధక చట్టాన్ని ప్రస్తావించినప్పుడు.. ఇటీవల ఓ ప్రైవేటు టీవీ ఛానెల్ కోసం 'ఆప్కీ కచేరి' అనే కార్యక్రమం నిర్వహించినపుడు అనేక సమస్యలు తన ముందుకు వచ్చాయని అన్నారు. ఆ కార్యక్రమంలో తనకు ఎదురయిన ఓ భార్యభర్తల సమస్య అత్యంత క్లిష్టమైనదిగా భావించారు.

భార్యను హింసించడాన్ని ఆ భర్త హక్కుగా భావిస్తున్నాడని, ఇంతకంటే దారుణం ఎక్కడ ఉంటుందని ఆమె ప్రశ్నించారు. ఒక ఆమె తాను చేపట్టిన మరో కేసులో మూడు వివాహాలు చేసుకొన్న వ్యక్తి.. తన భార్యను రాత్రి తొమ్మిది నుంచి తెల్లవారుజామున నాలుగింటి వరకు శారీరకంగా హింసించేవాడిని, అప్పుడు కూడా అతను అలసిపోవడంతోనే తన బాదుడికి స్వస్తి చెప్పేవాడని కిరణ్‌బేడీ వివరించారు.

'ఆప్కీ కచేరీ'లో సమస్య పరిష్కారమయ్యాక కూడా అతను హింసించినట్లు తమ దృష్టికి వచ్చిందని.. అయితే సంబంధిత స్వచ్ఛంద సంస్థ పర్యవేక్షణలో పరిస్థితి సద్దుమణిగిందని చెప్పారు.



గతంలో కిరణ్‌బేడీ ఆధ్వర్యంలో వచ్చిన 'గల్తీ కిస్కీ'.. సమస్యలను వెలుగులోకి తెస్తే, 'ఆప్కీ కచేరీ'.. సమస్యలకు పరిష్కారాన్ని చూపింది. ఈ కార్యక్రమాలకు వచ్చిన అనేకమంది పురుషులకు భార్యపై అనుమానపు జబ్బు ఉండడాన్ని తనకు ఆవేదన కలిగించిందని బేడీ అన్నారు. వివాహంపై నమ్మకం ఉన్నపుడు అనుమానానికి తావు ఎక్కడిదని ఆమె ప్రశ్నించారు. భార్య సెల్‌ఫోన్ కాల్స్‌ను గమనించడం వంటి సంఘటనలు స్త్రీల వ్యక్తిగత స్వేచ్ఛ హరిస్తున్నాయని అన్నారు. ☆

కావాలని దేశవ్యాప్తంగా ఉన్న మహిళా సంఘాలు ఉద్యమించాయి. ఢిల్లీలోని ప్రముఖ న్యాయవాది ఇందిరా జైసింగ్ ఈ ఉద్యమంలో కీలక భూమిక పోషించారు. గృహ హింస నిరోధక చట్టం ముసాయిదా రూపకల్పనలో ఆమె కర్తగా వ్యవహరించారు. అంతకుముందు ఈ చట్ట ఆవశ్యకతను వివరిస్తూ మహిళా సంఘాలను సంఘటితం చేసే బాధ్యతలను ఆమె తీసుకొన్నారు. ఈ నేపథ్యంలో ప్రభుత్వం 2005లో గృహహింస నిరోధక చట్టం రూపొందించింది.

## చట్టం అమలుపై నివేదిక

2006 అక్టోబర్ 26 నుంచి ఈ చట్టాన్ని దేశవ్యాప్తంగా అమలులోకి తీసుకొచ్చారు. దీంతో మూడేళ్లుగా ఈ చట్టం తీరుతెన్నులు, అమలు తీరు, చట్టాన్ని వినియోగించు కోవడంలో ఎదురవుతున్న సమస్యలపై ఓ నివేదికను ఇందిరా జైసింగ్ నేతృత్వంలోని 'లాయర్స్ కలెక్టివ్ ఉమెన్స్ రైట్స్ ఇనిషియేటివ్' రూపొందించింది. ఈ నివేదిక తొలి ప్రతిని నవంబర్ 13న రాష్ట్రపతి ప్రతిభాపాటిల్ అందుకున్నారు.

స్వాతంత్ర్యం వచ్చిన అర్ధశతాబ్ద కాలంలో గృహహింసను ఎదుర్కొంటున్న స్త్రీల యథార్థగాథలను పట్టించుకొన్నవారు లేరనే చెప్పాలి. అంతర్జాతీయ మహిళా ఉద్యమ సంస్థలు గృహహింసను 'బయటికి కనిపించని' మానవహక్కుల ఉల్లంఘనగా పేర్కొన్నాయి.

## ఐక్య రాజ్య సమితి డిక్లరేషన్

1993లో ఐక్యరాజ్యసమితి డిక్లరేషన్ ప్రకారం 'స్త్రీల ఆత్మాభిమానాన్ని హరించే శారీరక, మానసిక, లింగ ఆధారితమైన ఎలాంటి హింస అయినా మహిళల స్వేచ్ఛను హరిస్తున్నట్లయితే' దానిని నేరంగా ప్రకటించాలని తీర్మానించింది. అదేవిధంగా బహిరంగ ప్రపంచానికి కనిపించని హింసే గృహహింస అని నిర్వచించింది. భారతీయ సమాజంలో బలంగా వేళ్లూనుకొన్న పితృస్వామ్య సమాజ పునాదులు, సామాజిక, సాంస్కృతిక సంప్రదాయాల దృష్టితో గృహహింసను చూడాలని ఇందిరా జైసింగ్ అంటారు.

ఒక కుటుంబంలో భార్యాభర్తలు ఘర్షణ పడితే.. దాన్ని కుటుంబ వ్యవహారంగా తోసిపుచ్చే సమాజంలో మనం ఉన్న విషయాన్ని



విస్మరించరాదని ఆమె అంటారు. అదేవిధంగా మహిళలు కూడా తమ కుటుంబ అంతర్గత విషయాల్లో బయటి వ్యక్తులను అనుమతించేందుకు నిరాకరించడం కూడా ఒక ప్రతిబంధకంగా నిలుస్తోందని అభిప్రాయపడ్డారు.

## సమాజ దృష్టి కోణం మారాలి

తన వద్దకు వచ్చిన అనేక కేసుల్లో మహిళలు తమ నిలువనీడ గురించే అధికంగా బెంగ పెట్టుకొన్న సందర్భాలు ఉన్నాయని ఇందిరా జైసింగ్ చెప్తారు. భర్తతో ఘర్షణ పడి పుట్టింటికి వెళితే ఆదరణ చూపే తల్లిదండ్రులు చాలా తక్కువని తమ సర్వేలో వెల్లడయిందని వివరించారు. దీనికి కారణం.. భర్తను వదిలిపెట్టిన మహిళను సమాజం చూసే దృష్టికోణమేనని అన్నారు.

అంతేకాదు, మహిళలు ఒంటరిగా జీవించేందుకు ఇప్పటికీ భారతీయ సమాజం పూర్తిస్థాయిలో అంగీకరించలేదనే వాస్తవాన్ని పక్కనపెట్టలేక, చట్టాన్ని వినియోగించుకొనేందుకు సంకోచిస్తున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. ఒంటరి స్త్రీలు, నిలువ నీడలేని మహిళల పట్ల సమాజం చూసే చిన్నచూపే ఆమెను వెనకడుగు వేయిస్తోందని అన్నారు. అయితే గృహహింస నిరోధక చట్టం అమల్లోకి వచ్చి మూడేళ్లే అయినందున, దీనిపై అవగాహనను పెంచాల్సిందిగా పిలుపునిచ్చారు.

## అవగాహనలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానం

రాజస్థాన్ వంటి రాష్ట్రాల్లో పోలీసులకు సైతం గృహహింస నిరోధక చట్టం అంటే ఏమిటో తెలియకపోవడం చూస్తుంటే చట్టం అమలులో గల నిర్లక్ష్యం స్పష్టమౌతోందని ఇందిరా జైసింగ్ అన్నారు. చట్టం అవగాహన విషయంలో ఆంధ్రప్రదేశ్ అగ్రస్థానంలో ఉన్నందుకు ఆమె ప్రశంసించారు. అయితే మహిళల స్వాభిమానానికి, చట్టాన్ని వినియోగించుకొనేందుకు ఆర్థిక స్వావలంబనే కీలకమని, మహిళ తన కాళ్లపై తాను నిలుచున్నప్పుడే అది సాధ్యమవుతుందని విశ్లేషించారు.

పురుషులు కొట్టినా, తిట్టినా సహించి మౌనంగా రోదించనవసరం లేదని, చట్టాన్ని ఉపయోగించుకొని శాంతియుత పంథాలో నిరసనను తెలిపి దారికి తెచ్చుకోడానికి చట్టం ఒక సాధనమని ఇందిర నిర్వచించారు.

చట్టప్రకారం ఇంటి నుంచి తరిమివేసే అధికారం భర్తకు కానీ, కుటుంబ సభ్యులకు కానీ లేదనే విషయాన్ని మహిళలు గుర్తించాలని అన్నారు. పురుషుల్లో మార్పు అనేది వారి మనసుల నుంచి ఆరంభం కావాలని ఇందిరా జైసింగ్ అభిలషించారు. మహిళల సమస్యలను, బాధలను అదే దృష్టి కోణంతో అర్థం చేసుకొనేందుకుగానూ మహిళా న్యాయమూర్తులను నియమించాలని ఆమె కేంద్రాన్ని కోరారు.

భర్తతో పోరాటం చేస్తున్న మహిళల పునరావాసానికి అండగా ఉంటానని ప్రభుత్వాలు హామీ ఇచ్చాయనీ.. అయితే ఆచరణలో ఆంధ్రప్రదేశ్, హిమాచల్‌ప్రదేశ్, హర్యానాలు మినహాయించి మిగతా రాష్ట్రాలన్నీ వెనుకబడి ఉన్నాయని ఆవేదన వ్యక్తం చేశారు.

ఆంధ్రప్రదేశ్‌లో కేంద్ర ప్రాయోజిత స్వధార్ పథకం కింద 72 పునరావాస కేంద్రాలున్నాయని తెలిపారు.

*- వై. సరోజ*

# స్వయం సహాయక సంఘాల మహిళలకు సాగుభూమి యోచనలో ప్రభుత్వం

స్వయం సహాయక సంఘాల మహిళలకు మహర్దశ కల్పించే బృహత్తర పథకానికి రాష్ట్ర ప్రభుత్వం శ్రీకారం చుట్టనుంది. సాగు భూమి సౌకర్యం లేని డ్వాక్రా మహిళలకు లీజుకు భూమినిప్పించడం ద్వారా వారి ఆర్థిక స్థితిని మెరుగుపరిచే దిశగా చర్యలు తీసుకోనుంది. ఇందులో భాగంగా ఏళ్లుగా పడావు (వృథాగా) పడిన లక్షల ఎకరాల భూమిని సాగులోకి తీసుకురానుంది. 'ఎస్‌హెచ్‌జీ ల్యాండ్ లీజు' అనే ఈ బృహత్తర పథకం ద్వారా బహుముఖ ప్రయోజనాలు సిద్ధిస్తాయని



ప్రభుత్వం భావిస్తోంది. మహిళా సంఘాలకు మరో ఆదాయవనరును కల్పించడంతో పాటు పడావు పడిన లక్షల ఎకరాల భూమి అభివృద్ధి... తద్వారా ఆహారధాన్యాల ఉత్పత్తి పెంపు.. విస్తృతంగా అందుబాటులో ఉన్న ఉపాధిహామీ నిధుల్ని సద్వినియోగం చేయడం వంటి లక్ష్యాలతో కార్యక్రమాన్ని రూపొందించారు.

ఇటీవల మహిళా సంఘాల్లో కొంత నిర్లిప్తత కనిపిస్తోంది. దీన్ని తొలగించేందుకు కూడా ఈ కొత్త పథకం ఉపయోగపడుతుందన్నది అధికారుల ఆశ. ఇప్పటికే ముసాయిదా బిల్లు సిద్ధమైన ఈ పథకం వివరాలను అధికారులు ముఖ్యమంత్రి దృష్టికి తీసుకెళ్లారు. ఆయన కూడా సానుకూలత వ్యక్తపరచడంతో త్వరలో జరగబోయే ఉన్నత స్థాయి సమావేశంలో దీనిపై తుది నిర్ణయం తీసుకోనున్నారు. అనంతరం బిల్లును ప్రవేశపెట్టడానికి లేదా ఆర్డినెన్స్ జారీ చేయడానికి వీలుంటుంది. స్వయం సహాయక సంఘాల్లోని ప్రతి మహిళను లక్షాధికారి చేయాలని దివంగత నేత వై.యస్. కలలు కన్నారు. ఆ దిశలో పావలా వడ్డీ వంటి ప్రోత్సాహకాలనూ ఆయన అమలు చేశారు. ఇదే దిశలో మహిళా సంఘాలకు మంచి ఆదాయవనరు చూపించాలనే భావనతో ఉన్నతాధికారులు ఎస్‌హెచ్‌జీ ల్యాండ్ లీజు పేరిట ఈ పథకాన్ని సిద్ధం చేశారు.

### పథకం తీరుతెన్నులివీ....

రాష్ట్రంలో మొత్తం కోటి మంది మహిళా సంఘాల సభ్యులు ఉంటే... వారిలో దాదాపు 30 లక్షల సభ్యుల కుటుంబాలకు అసలు సాగు భూమి సౌకర్యం లేదని గ్రామీణాభివృద్ధి శాఖ గుర్తించింది. అందుకే పడావు పడిన భూములను వారికి ఇప్పిస్తే అవి వినియోగంలోకి రావడమేగాకుండా, సంఘాలకూ కొంత ఆదాయ వనరు కల్పించవచ్చని ఆలోచన చేసింది. ఇప్పటికే పలు జిల్లాల్లో మహిళా సంఘాలు భూములను లీజుకు తీసుకుని, సొంతంగానే అభివృద్ధి చేసుకుంటున్న ఉదాహరణలనూ ఈ శాఖ పరిగణనలోకి తీసుకుంది. అయితే చాలాచోట్ల పడావుగా పడిన భూములున్నా వాటిని లీజుకివ్వడానికి భూ యజమానులు ఇష్టపడటం లేదు. పైగా ఒకటి, రెండేళ్లు లీజుకు ఇచ్చినా దాని అభివృద్ధికి పెట్టుబడి పెట్టడానికి లీజుదారులు సిద్ధపడటం లేదు. అందుకే ప్రభుత్వమే మధ్యవర్తిగా ఉండేలా ఈ పథకం రూపొందింది. ఇందులో భాగంగా గుర్తించిన భూముల్ని మహిళా సంఘాలకు ఇప్పిస్తారు. తొలి దశలో ఐదేళ్ల పాటు లీజు ఒప్పందాలు చేయిస్తారు. మలి దశలో సదరు యజమాని ఒప్పందాన్ని మళ్లీ కొనసాగిస్తే సరి... ఒకవేళ దానికి అంగీకరించకపోతే ఆ భూమిని తిరిగి యజమానికి అప్పగించే బాధ్యత ప్రభుత్వంపైనే ఉంటుంది. అంతేకాదు... లీజు ఒప్పందాలు ఉంటాయి కాబట్టి.. బ్యాంకులు మహిళలకు రుణాలిచ్చేందుకూ వీలుంటుంది.

### ఉపాధి హామీ నిధుల వినియోగం...

ప్రభుత్వం పలు దశల్లో పంపిణీ చేసిన భూమి అభివృద్ధికోసం దాదాపు రూ.500 కోట్ల నాబార్డు సాయంతో ఇందిరప్రభ పథకాన్ని అమలు చేశారు. దీనికి ఇంకా నిధుల అవసరం ఉంది. మరో వైపు రాష్ట్రానికి అందుబాటులో ఉన్న రూ.వేల కోట్ల ఉపాధి హామీ నిధులతో ఉపయుక్త కార్యక్రమాలే చేపట్టాల్సి ఉంది. ఈ నేపథ్యంలో కొత్త పథకం ద్వారా లీజు తీసుకునే భూముల అభివృద్ధికి ఉపాధి హామీ నిధులను కూడా వినియోగించుకోవటానికి అనుమతిస్తారు. ఉపాధి హామీ అమలులో మన రాష్ట్రం దేశంలోనే అగ్రస్థానంలో ఉన్నా.... 2009-10లో ఈ పథకం కింద రాష్ట్రానికి రూ.6,060 కోట్లు రాగా, కేవలం రూ.3,200 కోట్లే ఖర్చు చేయగలిగారు. భూమి అభివృద్ధికి లీజుదారులు సొంతంగా నిధులను సమకూర్చుకోలేని స్థితిలో ఆ లోటు తీరడానికి కూడా ఈ ఉపాధి హామీ నిధులు ఉపయోగపడతాయి. ఇలా పెద్ద ఎత్తున భూములు సాగులోకి వస్తే ఆహార ధాన్యాల ఉత్పత్తి కూడా పెరిగే వీలుంటుంది. 'లీజు ఒప్పందాలు కూడా ఉంటాయి కాబట్టి బ్యాంకులు వీరికి ఎక్కువ మొత్తంలో రుణాలు ఇవ్వడానికి కూడా ముందుకు వచ్చే వీలుంటుంది. లీజు ధరను కూడా ప్రభుత్వం నిర్ణయించదు. మహిళా సంఘాలు, సంబంధిత భూ యజమానులే ఖరారు చేసుకుంటారు.' అని గ్రామీణాభివృద్ధి శాఖ ముఖ్య కార్యదర్శి రెడ్డి సుబ్రహ్మణ్యం అన్నారు. ఈ బిల్లును 'ఎస్‌హెచ్‌జీ ల్యాండ్ లీజ్ బిల్'గా పేర్కొంటున్నట్లు ఆయన వెల్లడించారు.

– టి.ఎస్.

Printed & published by Phani Kumar, Commissioner, on behalf of Andhra Pradesh Academy of Rural Development, Printed at Caxton Offset Pvt. Ltd., 11-5-416/3, Red Hills, Hyderabad-4. A.P. Published at Andhra Pradesh Academy of Rural Development, Rajendranagar, Hyderabad-30, Rangareddi. **Editor : Phani Kumar**


వసంతఋతు శోభ

Sthanika Palana

APTEL / 2009/27888

# మార్చి 8న అంతర్జాతీయ మహిళా దినోత్సవం




ఆధునిక స్త్రీ చరిత్రను తిరగరాస్తోంది

Printed at: Caxton Offset Pvt. Ltd., Hyd.